
జ్యోతి
సెప్టెంబర్ '63 - 60 నపై


సౌందర్య పోషణకు మారు పేరు!
OK
OK
SANDAL
SOAP
ఓ. కె.
శాండల్
సబ్బు
అక్టమర్, లనోలిన్
అధికమైన గ్లిసరిన్
కలిగి వున్నది
దీ ఈస్ట్ ఏషియాటిక్ కంపెని (ఇండియా) ప్రైవెట్ లిమిటెడ్, మద్రాసు-1.
OK
బహుమతి
కూపన్లు
చేర్చబడె

దీపావళి జ్యోతి సంచిక

మరొక్క సంచికసేపు ఓపిక పడితే దీపావళి సంచిక !

పండక్కి పదిహేను రోజులు ముందుగానే నవంబరు ఒకటో తేదీకల్లా వచ్చేస్తుంది

మామూలు సంచికలకు రెట్టింపు సైజులో 120 పేజీలుంటాయి. మామూలు సంచికలకంటె రెట్టింపు అందంగా, మీకు రెట్టింపు ఆనందమిచ్చే విధంగా వుంటుంది. ఏటొచ్చీ ధరమాత్రం రెట్టింపుకాదు; వెంటనే—అంటే, సెప్టెంబరు నెలాఖరులోగా ఏడాదిచందా అమాంతంగా కట్టేసేవారికి మామూలు ధరకే వస్తుంది. విడిగా కొనేవారికి రూపాయి ధరకే వస్తుంది.

* * * * * * * * *

ప్రకటనల రేట్లు :

ఓపెనింగ్ పేజి	రూ.	200
లోపలి పేజీలు	రూ.	150
" అరపేజీలు	రూ.	80
వెనుక కవరు ఒకే రంగులో	రూ.	300

పూర్తి పేజీ సైజు : 23X16 సెంటి మీటర్లు
అర " " : 11X16 "

తొలిమాట

నా అక్షరాలు
వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు
నా అక్షరాలు
కన్నీటి జడులలో తడిసిన దయాపారావతాలు
నా అక్షరాలు
ప్రజాశక్తుల నావహించే విజయ ఐరావతాలు.

అని ఇరవయ్యేళ్ళ క్రిందట ఒక యువనవకవి రాసుకున్నాడు. అతడి పేరు దేవరకొండ బాలగంగాధర తిలక్. సుతిమెత్తని సుతారపు భావ కవిత్వంతో సాహిత్య జీవితాన్ని మొదలుపెట్టి, అభ్యుదయ వాదంనుంచి అధివాస్తవికత దాకా కథ నడిపించి, ప్రస్తుతం ప్రస్తుత మానవుడి జీవిత స్థితిగతుల వెలుగు నీడలను తమ కవితలో, కథల్లో, నాటికల్లో అనువదించడానికి యత్నిస్తున్నారు. ఈ సంచికలోని "సీతాపతి కథ" (74 వ పేజీ) అటువంటిదే.

• • • •

తెలుగు కథకి ఇంకా యుక్తవయస్సు రాలేదని ఎవరంటారు - కె. వివేకానంద మూర్తిగారి కథ "చావు" (53 వ పేజీ) చదివాక ?

• • • •

ఈ సంచికనుంచి "స్వరలహరి" శీర్షిక" లో తెలుగుసినిమా సంగీత దర్శకులను గురించి. పి. బి. (ప్లేబాక్) శ్రీనివాయిస్‌గారు రాస్తారు. నేటి మన సినిమా సంగీతానికి నన్నయభట్టు రాజేశ్వరరావుగారితోనే (97 వ పేజీ) ఆయన తమ వ్యాసావళిని ప్రారంభిస్తున్నారు.

• • • •

బహుళ పాఠకాదరం పొందిన కూనలమ్మ పదాలకు ఈ సంచికతో ఆ రు ద్ర గా రు జన గణ మన పాడేస్తున్నట్టు తోస్తోంది, చివరి పదం చూస్తే. అయితే, మరొక కొత్త శీర్షికను నెలనెలా ఆముద్రీకరించడానికి "జ్యోతి" ప్రయత్నిస్తుంది.

• • • •

ముఖచిత్రం : అరిగే రామారావుగారి "ఆడమనసు (30 వ పేజీ) కథలో ఒక త్రివర్ణ సన్నివేశం.

జ్యోతి సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్ పేట, విజయవాడ-2.

మేనేజింగ్ ఎడిటర్ : వి. వి. రాఘవయ్య
విడిప్రతి వెల : 60 న. పై. ఏడాది చందా ఏడు రూపాయలే
సంపుటి 1 : సెప్టెంబర్ 1963 : సంచిక 8

పాఠక మహాశయా ! ఈ నెల

ఇదీ వరస....

సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,
బాపు, వి. ఎ. కె. రంగారావు, రావికొండలరావు

Edited and Published by V. V. Raghavaiah and
Printed by him at Andhra Printers Ltd.,
Buckinghampet post. Vijayawada-2.

కృష్ణ "జ్యోతి"

ఆగస్టులో కృష్ణాష్టమితోపాటు వినాయక చవితి, స్వాతంత్ర్య దినోత్సవం కూడా వచ్చాయిగదా, శ్రీకృష్ణుని గూర్చి కథలు, గేయాలు, కార్టూన్లతో జ్యోతి నింపేయడం నాకంతగా నచ్చలేదు. ముఖచిత్రం ఆకర్షణీయంగా వుంది.

విజయసాయి, అనకాపల్లి

"స్వరలహరి" శీర్షికలో "దాంపత్యం" మ్యూజిక్ డైరెక్టరు రాజేశ్వరరావు అని రాశారు. కాని రమేష్‌నాయుడు దానికి సంగీతం సమకూర్చారు. ఇకముందు ఇలాంటి తప్పులు రాకుండా వుంటే బాగుంటుంది.

కృష్ణ, విశాఖపట్నం

కృష్ణ సంచిక మేము వూహించిన దానికంటె ఎక్కువ సర్వాంగసుందరంగా అందించినందుకు నా ధన్యవాదాలు. ముఖ్యంగా ఒక్కొక్క కార్టూను చూస్తుంటే పొట్ట చెక్కలయ్యేంత నవ్వు వచ్చింది. ఎంతో భావగర్భితంగా బాపుగారు చిత్రించిన "రాధామాధవమ్" చాలా బాగుంది.

మ. చంద్రమౌళీశ్వరరావు, కాకినాడ

కృష్ణ సంచిక చాలా బావుందండీ. బాపుగారి బొమ్మలు మానసోల్లాసమ్‌గా వున్నాయి. ఆరుద్రగారి కూనలమ్మ పదాలు పిప్పరమెంట్ల రుచిలో వున్నాయి ...జోకులు కాస్త ఓవర్‌గా వుంటున్నాయి.

"దుర్గ", హైద్రాబాదు

ఉత్తరాయణం

మహా జ్యోతి భాతి
మణిద్యుతి రీతి
మెరిసె కృష్ణజ్యోతి
ఓ కూనలమ్మా

ఆనందకుమార్, కృష్ణాపురం

ఆగస్టు జ్యోతిలో ఒక్క కథకూడా లేదు. ఇంతమంది రచయితలు చేతిలో వుండికూడా ఇలా కావడం మాకు బాధ కలిగిస్తుంది. ఇప్పటివరకు ఆరు జ్యోతులు బ్రహ్మాండంగా వున్నాయి. సినీ శీర్షిక ఎక్కువగా పెంచాలి. అదిలేని పత్రికేలేదు.

చిర్ల సుబ్బారెడ్డి, గొల్లలమామిడాడ

కృష్ణ సంచిక ఆకర్షణీయంగా వుంది.... స్వరలహరిలో రచయిత్రి పాతకాలంనాటి పాటలుకూడా ఉదాహరించి, "అప్పుచేసి పప్పుకూడు"లో "బాలకృష్ణుని లీలలుగిన్న భక్తకోటికి బ్రహ్మానందం ఆనందం పరమానందం' అనే పాట, "గుండమ్మకథ"లోని "అలిగినవేళనే చూడాలి, గోపాలకృష్ణుని అందాలు" అనే పాట మరచిపోవటం విచారకరం.

కె. రామచంద్రరావు, ఎ. యు. హాస్టల్స్, వాల్తేరు

బొత్తిగా అన్నీ కృష్ణుని గురించి ప్రచురించడం వల్ల మేము కొంచెం డిజప్పాయింట్ అయ్యాము. జ్యోతిలో హాస్య కథలకు ఎక్కువ అవకాశం ఇస్తే బావుంటుంది.

వి. ఆర్. జె. ప్రసాదు, కాకినాడ

కృష్ణ జ్యోతి ఆశించినంత సంతసాన్ని యివ్వలేదని తెలియజేస్తున్నందుకు చాల విచారిస్తున్నాను. అతగారి "వంశీకుంజం" ఒక కొత్త విషయాన్ని తెలిపింది. "గోపిక" "యశోద" మనస్సుకి హత్తుకున్నాయి.

టి. ప్రకాశరావు, పర్లాకిమిడి

అలనాటి శ్రీకృష్ణుడు ఎలా వుండేవాడో ఏమోగాని, జ్యోతి కృష్ణుడు మాత్రం నాకు చాలా నచ్చాడు.

చంద్రి, హైదరాబాదు

కృష్ణపక్షపుసంచిక చాలా బాగా వచ్చింది. కృష్ణశాస్త్రిగారి రూపకం, కుటుంబరావుగారి "సూపర్‌మాన్" వెరీఫైన్‌గా వున్నాయి. "తెలుగు తెరపై కృష్ణుడు" వ్యాసాన్ని ఈ సంచికలో ప్రచురించడం సమంజసంగా వుంది.

కె. వెంకటేశ్వరరావు, మద్రాసు

ఆగస్టు ముఖచిత్రాన్ని వెంటనే చింపేసి (పారేశాననుకోగలరు!) బజారుకెళ్ళి ఫ్రేం కట్టించేశా. రాధ పిలుపు, కేశిగోపాలమ్, అవతారపురుషుడు చాలా బాగున్నాయి.

గుండుమళ్ళ వెంకటరామారావు, శ్రీకాకుళం

కేళీగోపాలం, తెలుగుకవుల కృష్ణుడు ప్రత్యేకాకర్షణగా వున్నాయి.

ఎం. ఎస్. రావు, పూలపల్లి (తూర్పు గోదావరి జిల్లా)

ఈనెల జ్యోతి కృష్ణమయమైనదని కాదు. కృష్ణపరమాత్మడే జ్యోతిర్మయుడైనాడు. ఇంతచిన్న సుకుమార సౌందర్యంతో ఆ పరంధాముని పదియారువేల మైలురాళ్ళను ఎంత సులువుగా దాటించగలిగిందోగాని మా జ్యోతి ఎంతో అభినందనీయురాలు.

ఎస్. సునంద, బుక్కరాయసముద్రం

బొతాఖూనీ

మీ పత్రికలో ప్రతిపేజీ దాదాపు అచ్చు తప్పులతోనే వుంటోంది. అటువంటప్పుడు "బొతాఖూనీ" అంటూ వేరే పేజీ కేటాయించడం అనవసరమేమో.

రమణమూర్తి, (సినీనటుడు) మద్రాసు

సంపాదక మహాశయులారా : మనస్తే. హోరుద్రగారి బొతాఖూనీ పత్రిమోసము అచ్చు పోస్తామని హామీ ఇస్తూ ఉచ్చు వేశారు. మీకు భయమిస్తున్నా. తెగులు వారికి పాగావుంది.

తినాలిరామ, చిన్నపట్టణం

సంపాదకవర్గంలో వున్నారు గనుక తమ రచనలు జ్యోతికి అనవసరమనుకున్నారేమో ముళ్ళపూడి వెంకట రమణగారూ, ఆ పప్పులు మాదగ్గర వుడకవు గనుక కనీసం అప్పుగానైనా ఓకథ వ్రాయమని ప్రాధేయపడుతున్నాను నా కోరిక తీరుస్తారుకదూ ?

అమర్, కోలార్ (మైసూరు)

ఏమండోయ్ : మీరు రాను రాను మరీ ఇదిగా నా గురించి మీ(మాదికూడా లెండి.) "జ్యోతి"లో వ్రాసేస్తున్నారు. ఏ.దో లే "జోకు" కోసీ అనుకుంటే కార్టూనులుకూడా నూరుతున్నారా :

ఎం. వి. అప్పారావు, శ్రీకాకుళం

అగస్టు సంచికలో "పాటపాడు కృష్ణా" అని స్వరసూత్రధారి కోరితే "అది నీవల్లే అవుతుంది" అని ఆ కృష్ణుడు పల్కినట్లు చిత్రించిన రేఖా చిత్రం చూసినతర్వాత "నిజంగా శ్రీ రాజేశ్వరరావు ధన్యుడు" అనుకున్నాను....

జీడిగుంట నారాయణమూర్తి, అమలాపురం



ప్రతిపక్షాలపై అవిశ్వాసం

ఇన్నాళ్ళకి భారత రాజకీయాలు మంచి రసకందాయంలో పడ్డాయి. మన పార్లమెంటు చరిత్రలో మొదటిసారిగా ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించబడింది. మొన్నటిదాకా "ఎవరికి వాళే యమునా తీరే" గా వుంటూ వచ్చిన ప్రతిపక్షాలన్నీ, కమ్యూనిస్టులు మినహా, ఏకమయ్యాయి. నెహూ్రు ప్రభుత్వంలో తమకు విశ్వాసం పోయిందని, అది గద్దె దిగిపోవాలని ముక్తకంఠంతో ఘోషించాయి.

నిజమే. నెహూ్రు నాయకత్వాన పదహారేళ్ళుగా పరిపాలన చేస్తున్న కాంగ్రెసు ప్రభుత్వం ఏం చేసింది ? ఏం సాధించింది? దేశం ఆర్థికంగా ఎంతదూరం ప్రయాణించింది ? ప్రజలలో తరతమ భేదాలు తొలగిపోయాయా ? తిండికొరత తీరిందా ? నిరుద్యోగం తరిగిందా ? అధికారుల అవినీతి, అసమర్థత, అలసత పెరగలేదా ? కుల తత్త్వం, భాషలమధ్య, రాష్ట్రాలమధ్య పేచీలు ఎక్కువ కాలేదా? పదహారేళ్ళపాటు ఏకచ్ఛత్రాధిపత్యం చెలాయించిన కాంగ్రెసు వాదులలో పదవీవ్యామోహం, అధికార లౌల్యం అధికం కాలేదా ? పన్నుల భారంతో, అధికధరలతో, జీవనవ్యయం పెరగడంతో జనం కుంగిపోవడం లేదా ! పోనీ, నెహూ్రు విదేశాంగ విధానమైనా సఫలమైందా ? పంచశీల పటాపంచలు కాలేదా ? చైనావాడిచేత దెబ్బలుతిని మనం అప్రతిష్ఠపాలు కాలేదా ?

ఇవీ, ఇలాంటివే మరి కొన్ని ప్రశ్నలు పార్లమెంటులో ప్రతిపక్షాలు వేశాయి.

నిజమే. ఈ ప్రశ్నలలో చాలమటుకు చాలవరకు నిజమే. ఇవన్నీ ప్రభుత్వాన్ని అడగవలసిన ప్రశ్నలే. ఇదివరకు చాల సార్లు అడిగినవే. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాలు చేయవలసిన పనే అది.

కాని దానికోసం అవిశ్వాస తీర్మానం అవసరమా ? ప్రభుత్వాన్ని తొలగించి, మరొక ప్రభుత్వాన్ని నెలకొల్పాలని ఆశించినప్పుడే అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెడతారు. మరి ప్రతిపక్షాలన్నీ కలిసి మరొక ప్రభుత్వాన్ని స్థాపించాలనే వుద్దేశంతోనే ఈ తీర్మానాన్ని ప్రతిపాదించాయా ?

పార్లమెంటులోని ప్రతి పక్షాలలో ఏ రెండింటి మధ్య ఏ విషయంమీద ఏకీభావంలేదు. ఏటికొకటి, కోటకొకటి లాగే పార్టీలవి.

రాజకీయ వాతావరణం


నెహ్రూ ప్రభుత్వం పోవాలనే నినాదం తప్పితే, వాటికి మరొక ప్రత్యామ్నాయ ప్రణాళికలేదు. కనీసపు కార్యక్రమం లేదు. దేశాన్ని ఇంతకంటె త్వరితంగా, సులభంగా అభివృద్ధి చేయడానికి మార్గమేమిటోవాటిలో ఏ ఒక్కటీ ప్రతిపాదించలేదు. జనసంఘానివి మతరాజకీయాలు. డి. ఎమ్. కె. వారివి ప్రాంతీయ రాజకీయాలు. స్వతంత్ర పార్టీ వారివి సోషలిస్టు వ్యతిరేక రాజకీయాలు. లోహియావి వ్యక్తిగత రాజకీయాలు. కృపలానీవి అయోమయ రాజకీయాలు. వీరితో ఎవర్ని నమ్ముకొనడం? ఎవరి అడుగుజాగలలో నడిస్తే ఈదేశానికి ఇంతకంటె సమర్థమైన, అవినీతింహితమైన, వివేక సహితమైన ప్రభుత్వం లభిస్తుంది? ప్రజల జీవన ప్రమాణాన్ని చిటికెలో పెంచి వేయగలపార్టీ ఏది? ఏ వర్గంమీదా ఎట్టి పన్నులూ వేయకుండా అన్నిపనులు చక్కదిద్దగల ప్రతిపక్షం ఏది? ప్రజాస్వామిక పద్ధతిలో ప్రగతిని సాధించే మార్గం ఏది? ఇవి ఈనాడు సామాన్య మానవుడు అడుగుతున్న ప్రశ్నలు. వీటికి ఏ ఒక్క ప్రతిపక్షం సమాధానం చెప్పగలిగే పరిస్థితిలో లేదు.

ఇదే మొన్నటి అవిశ్వాస తీర్మానంలోని దౌర్బల్యం. "ప్రస్తుత ప్రభుత్వంపై సభవారికి విశ్వాసం లేదు" అని ఒకే ఒక్క వాక్యంతో తీర్మానం ప్రతిపాదింపబడింది. విశ్వాసంలేదు, 'సోవాట్'? ఏం చెయ్యమంటారు? ఏదో ఒక ప్రభుత్వం వుండాలిగదా? దాన్ని ఏ పార్టీ స్థాపిస్తుంది? అన్ని ప్రతిపక్షాలు కలిసి స్థాపిస్తాయా? వాటికి సంఖ్యాబలం లేదే? (కమ్యూనిస్టులను మినహాయిస్తే - తీర్మానాన్ని ప్రతిపాదించిన వారు 72 మంది కాగా, చివరికి దానిపై జరిగిన ఓటింగ్‌లో దాన్ని బలపరచినవారు 61 మంది)

నెహ్రూ ప్రభుత్వం రాజీనామా చేయాలని. ఆ తరవాత మళ్ళీ ఎన్నికలు జరిపించాలని కృపలానీగారు సూచించారు. దేశంలో జనరల్ ఎన్నికలు జరిగి రెండేళ్ళయినా కాలేదు. వాటిలో కాంగ్రెసు గెలిచి ప్రభుత్వాలు స్థాపించింది. అయిదేళ్ళవరకూ పరిపాలించే ప్రజాస్వామికాధికారం దానికి వుంది. రెండేళ్ళ కొకసారో, ప్రతిపక్షాలు ఎప్పుడు కోరితే అప్పుడో, ఉపఎన్నికలలో ముగ్గురు నలుగురు ప్రతిపక్ష నాయకులు గెలిచినప్పుడల్లా ఎన్నికలు మళ్ళీ మళ్ళీ జరిపించవలసిందేనా? ఇలాగైతే ఏ ప్రభుత్వమూ ఏ పనీ చేయలేదే? మరి?

సరే, మళ్ళీ ఎన్నికలు జరుపుతారు. ప్రజలు ఏ ప్రతిపక్షానికని ఓటు చేస్తారు? దేనికీ మెజారిటీ రానిపక్షంలో మిశ్ర ప్రభుత్వం నెలకొల్పుతామని కృపలానీగారి వాదం. దానికైనా ఒక కనీసపు కార్యక్రమం, ఒక సమష్టి విధానం వుండాలిగదా? సోషలిస్టులు, జనసంఘం, డి. ఎమ్. కె., స్వతంత్ర పార్టీ కలిస్తే ఏ సమష్టి విధానం రూపొందుతుంది? అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించడానికి ఒక్క వాక్యం తప్ప దొరకని ఈ ప్రతిపక్షాలు ఏ కనీసపు కార్యక్రమాన్ని ప్రజలముందు పెడతాయి?

కాంగ్రెసు పార్టీని వెనకేసుకు రావడం ఈ వాక్యాల వుద్దేశంకాదు. ప్రతిపక్షాల బలహీనతని చూపించడమే. కాంగ్రెసు



"పతన అభ్యుదయ బంధురపంథా, యుగ యుగ ధావితయాత్రీ
తుమి చిర సారథి తవరథచక్రే, ముఖరిత పథదిన రాత్రీ
దారుణ విప్లవ మాఝే, తవ శంఖధ్వని బాజే, సంకట దుఃఖ త్రాతా
జన గణ పథ పరి చాయక జయహే! భారత భాగ్య విధాతా!"


పార్టీ ఎల్లకాలానికి అధికారంలో వుంటుందనిగాని. వుండాలనిగాని ఎవరూ అనడం లేదు. తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని నెహ్రూ సమాధానమిస్తూ "ముందు ముందు ఇతర పక్షాలేవైనా అధికారంలోకి రావచ్చు. ఎవరు చెప్పగలరు" అన్నారు. కాని ఆ దశ ఈ దేశానికింకా రాలేదు.

ఇండియా వంటి వెనుకబడిన దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి నిర్దిష్టమైన, ఖచ్చితమైన పథకాలను ప్రతిపాదిస్తున్న రెండు పార్టీలలో కాంగ్రెసు ఒకటి. అది ప్రతిపాదిస్తున్నది డెమొక్రాటిక్ సోషలిజమ్. నియంతృత్వం ద్వారా కాక ప్రజాస్వామ్యం ద్వారా ఈ దేశంలో సామ్యవాదాన్ని స్థాపించాలి. ప్రజలను నిర్బంధించికాక, వారి అనుమతితో దాన్ని నెలకొల్పాలి. సామ్యవాదం స్థాపనకు సైతం కాంగ్రెసు కొన్ని ప్రణాళికలను తయారు చేసింది. ఈ ప్రణాళికల ద్వారా మొత్తం ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం కంట్రోల్ చేస్తుంది. చిన్న పరిశ్రమలు బాగా అభివృద్ధి అయ్యేవరకు వాటిని వ్యక్తులే నిర్వహించినా, ప్రధానమైన కీలకపరిశ్రమలను. భారీ పరిశ్రమలను ప్రభుత్వమే నిర్వహిస్తుంది. పారిశ్రామికంగా దేశం పురోభివృద్ధి చెందిననాడే సామ్యవాదం స్థాపన జరుగుతుంది. ప్రజలందరి జీవన ప్రమాణం ఆకాశమంత స్థాయికి పెరిగిపోవడంగాని. వర్గరహిత స్వర్గం దిగివావడంగాని ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వెంటనే జరిగేపని కాదు. ముందు వ్యావసాయికంగా. పారిశ్రామికంగా దేశం ఒకానొక స్థాయిని చేరుకోవాలి.వానికి వ్యయం. ప్రయాస. కన్నీళ్ళు. కష్టాలు తప్పవు. కాని సాధ్యమైనంత ప్రజాస్వామికంగా. సాధ్యమైనంత తక్కువ కన్నీళ్ళు. కష్టాలతో........

అదీ విషయము. ఈ ప్రధాన ప్రాతిపదికను కాదని ఏ పార్టీ ఈ దేశంలో ప్రజాదరం పొందలేదు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఈ ప్రాతిపదిక పైనే జరగాలి. మొన్న అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించిన ప్రతిపక్షాలు ఈ మౌలిక సూత్రాన్నే వ్యతిరేకించాయి. అదే వాటి బలహీనత. వాటి విమర్శలు నిర్మాణాత్మకంగా లేకపోవడానికి అదే కారణం.

కాంగ్రెసు ప్రభుత్వం బంగారు కొండ అని కాదు. అది తలపెట్టిన అనేక కార్యక్రమాలు విఫలమయ్యాయి. సఫలమైన వాటికంటె విఫలమైనవే ఎక్కువేమో. దాని కత్యంత ప్రియతమమైన మద్యపాన నిషేధం విఫలం కావడంకంటె దాని అసమర్థతకు మరే దృష్టాంతం కావాలి ? ఉద్యోగులలో. అధికారులలో. మంత్రులలో పెచ్చు పెరిగిపోతున్న అవినీతికంటె, బంధుపక్షపాతం కంటె, పదవీ వ్యామోహంకంటె. భోగలాలసత కంటె మరే నిదర్శనం కావాలి ? తాము విధించిన పన్నులను తామే వసూలు చేయలేక పోవడం కంటె. అధిక ధరలను. అక్రమ లాభాలను అరికట్టలేక పోవడంకంటె మరే తార్కాణం కావాలి ?

ప్రతిపక్షాలు విమర్శించవలసినవి వీటిని: మౌలిక సూత్రాలనుకాదు. ఆ సూత్రాలను మొదటిసారిగా. స్పష్టంగా నిర్వచించినది



"ఏయ్ మిష్టర్ ! మలుపుదాటి చాలాసేపైంది. ఏమిటి నీ వుద్దేశం ? లె, లె"
"మళ్ళీ ఇంకో మలుపు వొస్తుంది గదండీ. అప్పుడెలాగూ వొరగాలిగా ?"

జవహర్లాల్ నెహ్రూ కావచ్చు. కాని అవి కాంగ్రెస్ సంస్థ గుత్తసొమ్ములు కావు. అవి దేశానికంతటికి సంబంధించినవి. ఏ పార్టీ అధికారంలో వున్నా వాటిని ఈ నిర్భాగ్య దేశాన్ని భాగ్యవంతం చేయడానికి. శక్తిమంతం చేయడానికి అనుసరించక తప్పదు. వాటిని అనుసరించడంలో కాంగ్రెసు ప్రభుత్వాలు చేస్తున్న అవక తవకలను విమర్శించాలి. వాటిని అంతకంటె బాగా. అంతకంటె మంచిప్రణాళికలతో అమలు చేయగలమని ప్రజలకు నచ్చచెప్పి. తమ నిస్స్వార్థ సేవద్వారా రుజువుచేసి అధికారంలోకి రావాలి. అంతవరకు ఇంతే.

కామరాజ్ పథకం

కాంగ్రెస్ సంస్థలో. ప్రభుత్వాలలో ప్రవేశించిన దౌర్బల్యాలను కాంగ్రెసు

వాదులు గుర్తించక పోలేదు. వాటిని తొలగించడమెలాగన్న సమస్యపై వారు ఆత్మ పరీక్ష చేసుకొనకపోలేదు. ఈ ఆత్మ పరీక్షా ఫలితమే ఇటీవల ఎ. ఐ. సి. సి సమావేశంలో మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్ ప్రతిపాదించిన పథకం.

ఈ పథకం ప్రకారం వున్నత పదవులలో వున్న కాంగ్రెసు అగ్రనాయకులు పదవులను విడిచిపెట్టి, సంస్థను తిరిగి పటిష్ఠం చేసే కార్యక్రమాన్ని చేపట్టాలి ఎ. ఐ. సి. సి. దీన్ని ఆమోదించింది. ఆమోదించగానే వివిధరాష్ట్రాలలో మంత్రి పదవులలో వున్నవారు, ప్రధానమంత్రి నెహ్రూ సమేతంగా పెక్కుమంది కేంద్ర మంత్రులు రాజీనామా లివ్వడానికి సిద్ధపడ్డారు. నెహ్రూ రాజీనామా ఇవ్వడానికి ఎ. ఐ. సి. సి. అంగీకరించలేదు. ఆయనలో తనకు పరిపూర్ణ విశ్వాసం కలదని, కాంగ్రెసు ఐకమత్యానికి ఆయన చిహ్నం కావడమే కాక, ప్రస్తుత క్లిష్ట పరిస్థితిలో దేశానికి, ప్రభుత్వానికి ఆయన నాయకత్వం అత్యవసరమని అది అభిప్రాయ పడింది. అందరూ రాజీనామాలిచ్చి కాంగ్రెసు సేవకు తరలిపడితే ప్రభుత్వాలను నిర్వహించే దెవరు? పరిపాలన దెబ్బతినిపోదా? అందుచేత కేంద్రంలోగాని, రాష్ట్రాలలోగాని ఎవరెవరి రాజీనామాలను ఆమోదించాలో, ఎవరెవరు పదవులలోనే వుండాలో నిర్ణయించే అధికారంకూడా ఆయనకే యివ్వబడింది.

శ్రీ నెహ్రూ నిర్ణయాల ఫలితంగా కాంగ్రెసు ప్రభుత్వాలలోను, సంస్థలోను పెద్ద మార్పులే జరగవచ్చు. పాతవారుపోయి కొత్తవారు వస్తారు. ఎవరువస్తారో, ఎవరు పోతారో ఇంకా తెలియలేదు.

ఇక్కడకూడా "సోవాట్?" అనే ప్రశ్నే ఎదురవుతుంది. వ్యక్తులు మారినంతమాత్రాన పరిస్థితులు బాగుపడతాయా? కాంగ్రెసు సంస్థ మరింత ఐకమత్యంతో, కట్టుదిట్టంగా నడుస్తుందా? మంత్రి పదవులపై వ్యామోహం పోతుందా? కాంగ్రెసు సంస్థలకు, రాష్ట్రప్రభుత్వాలకు మధ్య సయోధ్య ఏర్పడుతుందా?

స్వాతంత్ర్య సిద్ధికి ముందరి కాంగ్రెసు వేరు, ఆ తరువాత రూపొందిన కాంగ్రెసు వేరు. ఆనాటి నాయకులలో పెక్కుమంది ఈనాడు లేరు. నెహ్రూను, మరొక కొద్దిమందిని మినహాయిస్తే, ఈనాడు అగ్రనాయకులుగా చెలామణీ అవుతున్నవారంతా పదవులవల్ల ప్రముఖులైనవారే. అధికారంనుంచి తప్పుకొన్ననాడు వారి నాయకత్వ లక్షణాలు ఎంతవరకు రాణిస్తాయో, వారి పలుకులకు ఏమాత్రం పలుకుబడి వుంటుందో చూడవలసిందే. నిజంగా ప్రజాదరం పొందిన ఆకొద్దిమంది నాయకులు పదవులు విడిచి బయటకి వచ్చి అన్నిరకాల జనాభాకు ఆలవాలమైన ఈ సంస్థకు ఏమాత్రం పునరుజ్జీవనం కల్పించగలరో చూడవలసిందే.

వాయిస్ ఆఫ్ అమెరికా

ఇటీవల జరిగిన వివాదాస్పద విషయాలలో భారత ప్రభుత్వం "వాయిస్ ఆఫ్ అమెరికా" వారి ట్రాన్స్‌మిటర్ కోసం అమెరికాతో కుదుర్చుకొన్న ఒడంబడిక.

చైనా గడచిన ఏడెనిమిది నెలలుగా మనపై విపరీతంగా దుష్ప్రచారం సాగిస్తున్నది. శక్తివంతమైన రేడియో ట్రాన్స్‌మిటర్లద్వారా ఆగ్నేయాసియా దేశాలలో ఈ ప్రచారకాండ కొనసాగిస్తున్నది. ఆ దేశాలలో వాయిస్ ఆఫ్ చైనా వినబడినంతగా వాయిస్ ఆఫ్ ఇండియా వినబడడంలేదు. దీనికి కారణం మనవద్ద అంతశక్తివంతమైన ట్రాన్స్‌మిటర్లు లేకపోవడమే. ఈ లోపాన్ని తీర్చుకొనడానికి భారత ప్రభుత్వం వాయిస్ ఆఫ్ అమెరికా వారికి చెందిన వెయ్యి కిలో వాట్ల శక్తి గల ట్రాన్స్‌మిటర్ కావాలని కోరింది. కొన్ని షరతులపై ఆ ట్రాన్స్‌మిటర్‌ను మనకివ్వడానికి ఆ సంస్థవారు అంగీకరించారు. రోజుకు మూడుగంటల చొప్పున తమ కార్యక్రమాలను ప్రసారం చేయనివ్వాలన్నది ఆ షరతులలో ఒకటి. కొంతకాలం తరవాత కొద్దివెలకు ఆట్రాన్స్‌మిటర్ మనకు దఖలు పరచేట్టు ఒడంబడిక జరిగింది.

దీనికి కేంద్రప్రభుత్వంలో ఎవరు బాధ్యులో గట్టిగా తెలియదు. ఏమైనా ఇది పెద్ద వివాదాస్పదంగానే పరిణమించింది. ఈ ఒడంబడికను ఆ షరతులతో కుదుర్చుకొనడం పొరబాటేనని భారత ప్రభుత్వం కూడా ఒప్పుకుంది.

మనది ఏ అగ్రరాజ్య కూటంతోను విరోధంలేని విదేశాంగ విధానమని చెప్పుకుంటున్నాము. వాయిస్ ఆఫ్ అమెరికా కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారానికై ప్రత్యేకంగా ఉద్దేశించబడిన సంస్థ. అట్టి సంస్థ చేసే ప్రచారాన్ని మన గడ్డపైనుంచి జరగనివ్వడం మంచిదా? అది మన విదేశాంగ విధానానికి విరుద్ధంకాదా? మనదేశంనుంచి చేసే ప్రచారంలో వాయిస్ ఆఫ్ అమెరికా సోవియెట్ యూనియన్‌ను, మిగతా తూర్పు యూరప్‌రాజ్యాలను ఏమీ దూషించక పోవచ్చు. కేవలం చైనామీదనే ప్రచారాన్ని కేంద్రీకరించవచ్చు. అయినా, ఆ సంస్థకు కమ్యూనిస్టు వ్యతిరేకతా ముద్ర గట్టిగా పడిపోయింది. అందుచేత ఈ ఒడంబడిక తీవ్ర విమర్శకు గురిఅయింది.

ఏమైనా, భారత ప్రభుత్వం ఒడంబడికలోని షరతులను మార్పించడానికి యత్నిస్తూండడం సంతోషించ దగిందే.

ఇలాంటిదే మరొక వివాదాస్పదమైన అంశం అమెరికా, బ్రిటన్‌లతో కలిసి భారత వైమానిక దళం సంయుక్త విన్యాసాలు జరపడానికై కుదుర్చుకొన్న ఒడంబడిక.

ఈసారి చైనా దురాక్రమణ జరిపితే అది ఉభయ దేశాలమధ్య "ఆలౌట్ వార్" గా పరిణమించక తప్పదు. ఆ యుద్ధంలో విమాన దళాలు సైతం పాల్గొంటాయి. మన నగరాలకు విమాన రక్షణ కల్పించడానికి ఉత్తరపు సరిహద్దుల వెంబడి రేడార్ యంత్ర పరికరాలను నెలకొల్పడం అవసరం. వాటినివ్వడానికి, వాటినుపయోగించడంలో మన విమాన దళానికి శిక్షణ నివ్వడానికిఅమెరికా, బ్రిటన్‌లు అంగీకరించాయి. అయితే ఈ శిక్షణ పొందడానికి సూపర్ సానిక్ వేగంతో పోగల ఫైటర్ విమానాలు కావాలి. అవి మనకు లేవు. వాటిని మనకివ్వడానికి ఆ దేశాలు సుముఖంగా లేవు. ఈ విషయమై భారత ప్రభుత్వం ఆ దేశాలతో

ఇంకా చర్చలు కొనసాగిస్తున్నది. ఆ చర్చలు తేలేవరకూ, సూపర్‌సానిక్ యుద్ధ విమానాలు మనకు సమకూడేవరకు రేడార్ పరికరాల ఉపయోగంలో శిక్షణ ఆగిపోవలసిన అవసరంలేదు. అందుచేత తాత్కాలికంగా తమ విమానాలను మన అధీనంలో వుంచడానికి. తమ నిపుణులచేత మన వైమానికులకు శిక్షణ ఇప్పించడానికి అమెరికా, బ్రిటన్‌లు అంగీకరించాయి.

ఈ ఒడంబడికకూడా మన విదేశాంగ విధానానికి విరుద్ధమని కమ్యూనిస్టుపార్టీ విమర్శిస్తున్నది. పాశ్చాత్య రాజ్యాల విమానాలు మనదేశంలో వుండేది శిక్షణ పూర్తయ్యే వరకేగనక. ఈ శిక్షణకూడా చైనా దురాక్రమణ నుంచి మనదేశాన్ని రక్షించుకొనడానికే వుద్దేశించింది గనక వారి విమర్శలో సబబు కనిపించడంలేదు.

మాస్కో ఒప్పందం

అణ్వస్త్ర పరీక్షల నిషేధంపై మాస్కోలో ఈమధ్య జరిగిన ఒడంబడిక చరిత్రాత్మకమైంది. వాతావరణంలో, సముద్రంపై, సముద్ర గర్భంలో అణ్వస్త్ర పరీక్షలు జరపరాదని అమెరికా, రష్యా, బ్రిటన్‌లు కుదుర్చుకొన్న ఈ ఒడంబడికలో భూగర్భంలో జరిగే పరీక్షల ప్రసక్తి లేదు. మిగతా రకాల అణ్వస్త్ర పరీక్షలను ఏ దేశం జరిపినా కనిపెట్టడానికి తగిన సాధనాలున్నాయి గనక ఏ పేచీలేకుండా ఈ ఒప్పందం జరిగిపోయింది. కాని, భూగర్భంలో జరిపే పరీక్షలకు, సహజంగా సంభవించే భూకంపాలకు తేడా కనుగొనడం సాధ్యం కాదని కనుక వాటిని నిషేధిస్తూ ఒడంబడిక జరగాలంటే దాని అమలును తనిఖీ చేసే సదుపాయాలుండాలని అమెరికా వాదన. తనిఖీ లక్కరలేకుండానే భూగర్భ పరీక్షలను కనుగొనవచ్చునని రష్యా వాదన. ఈ తనిఖీలకు సంబంధించిన వివాదం తేలకపోవడం చేత మాస్కోలో పాక్షికమైన ఒప్పందం మాత్రమే జరిగింది.

అగ్రరాజ్యాల మధ్య ఆ మాత్రపు ఒడంబడికైనా జరిగినందుకు, అణ్వస్త్ర పరీక్షలవల్ల కలిగే దుష్ఫలితాలు కొంతవరకైనా నివారింప బడినందుకు అన్ని దేశాలు సంతోషిస్తున్నాయనడం అతిశయోక్తి అవుతుంది. ఫ్రాన్సు, చైనాలు ఈ ఒడంబడికను హర్షించలేదు. ఫ్రాన్సు హర్షించకపోవడానికి ప్రత్యేక కారణాలున్నాయి. అంటే, ఫ్రాన్సుకూడా అణ్వస్త్ర సంపత్తిని సమకూర్చుకొనాలని, ఆనాడుగాని అది అగ్రరాజ్యం కాజాలదని ప్రెసిడెంట్ డిగోల్ భావన. అందుచేత ఆయన ఈ ఒప్పందంలో పాల్గొనడానికి నిరాకరించాడు.

సరే, చైనా సంగతి తెలిసిందే. సంపూర్ణ నిరాయుధీకరణం జరగందే పాక్షికపు ఒప్పందాలు పనికి రావని పైకి వాదిస్తున్నా, దానికి కావలసింది అమెరికాతో శాశ్వత శత్రుత్వం. అమెరికాతోగాని, మిగతా పాశ్చాత్యరాజ్యాలతోగాని ఏ ఒడంబడికకు, సమాధానానికి రావడం దానికిష్టంలేదు. అందుచేత అది మాస్కో ఒప్పందాన్ని తిరస్కరించింది. అది దాని యుద్ధోన్మాదానికి అనుగుణమైన వైఖరే.

పోతే ఇండియాతో సహా మిగతా శాంతికాముక దేశాలన్నీ ఈ ఒప్పందాన్ని హర్షించాయి. అది ప్రపంచ శాంతి సుస్థిరతకు మొదటి మెట్టుగా, ప్రచ్ఛన్న యుద్ధాన్ని తొలగించే చర్యలలో ఒకటిగా అవి భావిస్తున్నాయి.

కూనలమ్మ పదాలు

ఆరుద్ర


పాలకోసము రాళ్ళు
భరియించుమను వాళ్ళు
తాము వంచరు ఒళ్ళు
ఓ కూనలమ్మా !



ఏక పత్నీ వ్రతము
ఎలుగెత్తు మన మతము
వేల్పు భార్యలు శతము
ఓ కూనలమ్మా !

గంగ గట్టున నూయి
కందకములో గోయి
త్రవ్వేను లొల్లాయి
ఓ కూనలమ్మా !


ఆశ తీరని తృష్ణ
అఘము తేలని ప్రశ్న
ప్రతిభ అడవుల జ్యోత్స్న
ఓ కూనలమ్మా !



అత్తవారిని మెక్క
అలక పానుపు యెక్క
మృగము క్రిందే లెక్క
ఓ కూనలమ్మా !



కడకు పాకిస్తాను
కలిసె చైనాతోను
మిత్రుడా? సైతాను !
ఓ కూనలమ్మా !




పడతి వలపుల కలలు
పండి వేసెడి గెలలు
వెలుగు నీడల వలలు
ఓ కూనలమ్మా !

కుమతియొక్క సమీక్ష
గుబ్బ యెముక పరీక్ష
చేయవలయు ఉపేక్ష
ఓ కూనలమ్మా !



హృదయమున్న విమర్శ
మెదడు కలచు విమర్శ
తిట్టు నెచ్చెలి స్పర్శ
ఓ కూనలమ్మా !

లంచ మనియెడి ఉప్పు
క్లార్కు తింటే తప్పు
ఘనుడు తింటే మెప్పు
ఓ కూనలమ్మా !



హాస్యమందున అబుణ
అందెవేసిన కబుణ
బుడుగు వెంకట రమణ
ఓ కూనలమ్మా !



సర్వజనులకు శాంతి
స్వస్తి, సంపద, క్రాంతి
నే కోరు విశ్రాంతి
ఓ కూనలమ్మా !

ఈ పదమ్ముల క్లప్తి
ఇచ్చింది సంతృప్తి
చేయనిమ్ము సమాప్తి
ఓ కూనలమ్మా !

రాజధాని కైఫీయత్

బ్సంతి యెంత గట్టిగా, యెంత సూటిగా గోడకేసి మనం విసిరితే, అంత తొందర గానూ, అంత సూటిగానూ తిరిగి మనదగ్గర కొస్తుంది. బంతి పోతుందేమో అనుకుంటూ చేతుల్లోనే పుచ్చుకూర్చుంటే కథలో మజాకా యేముంది అన్నారు శ్రీ నీలం సంజీవరెడ్డి ఒక సందర్భంలో....

ఇదీ రాజకీయం.

పదవులు పదలిపెడుతూ వుండాలి. పట్టు. విడుపు లేకపోతే ఆటేలేదు—ఇది ఆయన సారాంశం.

కాని ఒక చిన్న సందేహం.

విసిరేసే బంతిలో "గెంతేగుణం" తక్కువైపోతుంటే అక్కడే వస్తుంది ప్రమాదం. రాజకీయాల్లో విషాదం అక్కడే ప్రారంభం.

ముఖ్యమంత్రి పదవికి రాజీనామా ఇచ్చి వెళ్ళిపోతానంటున్న సంజీవరెడ్డిని మిత్రు లందరూ వారిస్తున్నారు.

కాని—

చరిత్రకు దుర్గుణం గాను గెద్దువాటంగా తిరగటం. ఆంధ్రరాజకీయాల చరిత్ర మరీ చతుర్మధ్యంగా వుంది.

* * *

కాంగ్రెసు పార్టీకి ప్రజల్లో బలం తక్కువైపోతోందని - పార్టీకి ముసలితనం వచ్చిందని "ఇంజిన్ రీబోర్" చేసినట్లు, దీనికి "కాయకల్ప చికిత్స" చెయ్యాలని కాంగ్రెసు పెద్దలు ఢిల్లీలో సంకల్పించారు. "ధాతుపుష్టి లేహ్యాల సీసా"లతో బయలుదేరుతున్నారా! యేమిటి అంటూ ఒక ముకుందం జోకు వేస్తున్నాడు. మరి "రీవైటలైజింగ్ కాంగ్రెస్"గా ?

* * *

శ్రావణ బహుళ అమావాస్యా బుధవారం నాడు, అంటే ఆగస్టు 19న రాజధానిలో రాజకీయ వాతావరణం –


ముఖ్యమంత్రి పదవి వదలివేసి, పార్టీ పనులమీద శ్రీ సంజీవరెడ్డి యొక్కడికో దూరంగా వెళ్ళిపోతారనే విషయం రూఢీ అయినట్టే.

అసలు ఈవార్త బయట పడ్డప్పుడే రాజధాని రాజకీయంలో తీవ్ర పంచలనం బయలుదేరింది. ఆశా నిరాశలు అన్ని వర్గాల్లోనూ పైకి లేచాయి.

అందరూ గబగబా గుఱ్ఱాలెక్కి పందేనికి సిద్ధపడ్డారు. పందేనికి పైపందెం. కథ నాలుగో కాలంలో నడుస్తోంది.

బ్రహ్మానందరెడ్డిగారికి "రాజ్యపట్టాభిషేకం" చేసి శ్రీ సంజీవరెడ్డిగారు వెళ్ళిపోతున్నారంటూ కొందరు ఢంఢోరా వేస్తుంటే....

అబ్బే ! సంజీవరెడ్డి పోవటం యెందుకండీ, బ్రహ్మానందరెడ్డిగారినే వెళ్ళమనండి



రాజీనామా ఇచ్చి అంటున్నారు, శ్రీ సంజీవరెడ్డిగారి కటాక్ష వీక్షణాల్లో "కాయకల్ప చికిత్స" పొందుతున్న మరొకనాయకుడు.

అసలింతకు రాష్ట్ర క్యాబినెట్లో తన పొజిషన్ ఇప్పుడు నెంబరు టు అయినప్పుడు "మీరజాలగలడా" అంటున్నారట శ్రీ నూకల రామచంద్రారెడ్డి. తనే ముఖ్యమంత్రి అవాలి అంటున్నారట ఆయన.

ఇంతమంది ఇన్ని అంటూంటే నువ్వు మాత్రం యెందుకూరుకోవాలి అంటున్నారట మిత్రులు ఏ. సీ. వి.

"వెంకి పెళ్ళి సుబ్బి చావుకు" వచ్చినట్లుంద మరి కొందరికి.

ఆయినా

అంధ్ర రాజకీయాల్లో....

యెవరూ అనుకోని "ఓ సంజీవయ్యగారు" ఒక్కమాటుగా "స్టేజీ" ఎక్కి గబుక్కున తెరలాగుతాడు. అందరూ ఆయన్నే మహారాజును చేసి చప్పట్లు కొడతారు. ఇది పరిపాటికూడా.

ఈమాటు ఈ సంజీవయ్య యెవరంటే. యెవరనుకుని నేనే నంటే నేనే అనుకుంటూ గబగబ తిరుపతి, శ్రీశైలం వెళుతున్నారు రాజకీయాలలో ప్రతి నకులుడు, ప్రతి సహదేవుడు.

అమావాస్య ఘడియలు రాకముందే రాష్ట్రమంత్రులు తమ తమ రాజీనామాలు దాఖలు చేశారు.

"బకుడేకచక్రపురమున" అనే భారత కథ గుర్తుకొస్తుంది చాలామందికి చాలా సందర్భాలలో.

* * *


సాంస్కృతిక కైఫీయత్

రవీంద్రభారతి అంటే రాజధానిలో నేషనల్ థియేటరు-దీనిని అరవై రెండులోనే ప్రారంభించినా ఇంకా చెయ్యవలసిన పనులు చాలావున్నాయి. థియేటర్‌లో అన్ని కొసల వారికి రంగంమీది "బొమ్మలు" సక్రమంగా కనిపించేటట్లు ఆ "బొమ్మలు" చెప్పే మాటలు అన్ని మూలలవారికి సక్రమంగా వినిపించేటట్లు చెయ్యటం వీటిలో ముఖ్యమైంది.

నేతిబీరకాయకు మల్లేనే రవీంద్రభారతిలో కూడా, రవీంద్రుడు, భారతి కనిపించరు.(అంటే వారి సాంస్కృతికచ్ఛాయలు.) యెదురుగుండా కనిపించేదల్లా "ఉల్లితిరుపతి" ఛాయలు. కాని ఈ థియేటర్‌ను రవీంద్రుని సంస్మరణార్థం భారతీయ సంస్కృతీ ప్రాభవానికి నిర్మాణం చేసినమాట వాస్తవం.

మరో చిన్న విషయం - భారతకాలంలో అతిరథులు, అర్ధరథులు వున్నట్లు ఇప్పుడూ ఇక్కడ అతినటులు, అర్ధనటులు బాగా కనిపిస్తున్నారు. ఓవర్‌యాక్షన్ చేసే వాళ్ళు, అంటే ముట్టనట్లు యాక్టు చేసేవాళ్ళు అని తాత్పర్యం.

ఈ మధ్య రవీంద్రభారతిలో వేసిన ఒక నాటకంలో, ఈ అతినటులూ, అర్ధనటులు చాలామంది కనిపించారు. ●



ఇప్పుడు నవ్వండి -ఆఁ-ఆఁ-అద్దదీ-

నేతి... నేతి...

* కొమ్మ ఆకుల నరాల్లో, చివురు చిగుళ్ళ గోళ్ళల్లో పెదవి ఊదారంగు బూడిదలో;

పన్నీరు పూల మకరందంలో, కాలి గజ్జెల హృదయాంతరత వేదనలో, పారాణిరంగు ముఖం లత్తుక గుండెల్లో, వ్యధలో;

నిద్రలో, కలలో, కలవరింతల్లో ఎక్కడ నువ్వు ? ఎక్కడనువ్వు ?

* మూగపాటలో, సంగీతంలో, నిట్టూర్పులో, మబ్బు శయ్య తలగడదిండు కన్నీళ్ళల్లో, దుఃఖకాస్కరుని విషాదార్ణవంలో;

లక్షరూపాయిల ధనాగారం ప్రేమ లేమిలో, అడవి ముళ్ళ పొదల పాము తల్లి కడుపు పుట్టలో, నక్షత్రాల కళ్ళల్లోని మంచు కన్నీళ్ళ బిందువుల్లో;

తల్లిలేని పులిపిల్ల అమ్మా అనే ఏడ్పులో, ప్రపంచ సంగీత సదస్సులో, వినిపించని పాటల్లో, నా నువ్వు ? ఎక్కడ నువ్వు ?

* ఆశ్రమంలో నిరాశ్రయ జీవిత తపస్సులో, హరిణం మరణం ఋషి పునర్జన్మలో, స్త్రీ హృదయంమీది మాంసం కండల్లో !

పూల బొమికలలో, సారాయి వానలో, పాపం వడగండ్లలో;

సముద్రం యుగాల అశ్రుబిందువుల్లో, వాయువు ఆయువు నిట్టూర్పులో, రెక్కలు విరిగి ఎగురలేని ఆత్మవిహంగంలోనే, నానువ్వు ? నానువ్వు ?

* తమస్సు మనసు గూటిలో, రాత్రిలోని, నిద్రలోని ప్రమిదలో;

కొమ్మల్లో, రెమ్మల్లో, స్వర్గంలో, మట్టి భూమిపైన ఆకాశమంత ఎత్తులోతు పాతాళంలో;

ఈశ్వరుడా ! ఎక్కడ నువ్వు ? పిలువలేను - పిలువలేను. పిలువలేను. పిలుచుకోలేక నిన్ను, గాలిలో పద్యాల్లుతున్నాను.

శూన్యంలో కొనలేని,మధ్యలేని,దారాన్ని ముడివేస్తున్నాను.
కిటికీల్లో, తలుపులో,కౌగిలి తలపులలో బ్రతుకుతూన్నాను.
క్షణాలలో, అరక్షణాలలో
ఈశ్వరుడా, అర్ధనారీశ్వరుడా
సజనా, ఎక్కడ నువ్వు ?
ఎవరు నువ్వు, తెలిసీ, తెలియక అడుగుతూన్నా.
కోపం కిళ్ళీ వేసికొన్న కాళికవా ?
వజ్రాలు పొదిగిన అంచులకు విషం పూసిన కత్తి పదును కోసిన రక్తపు బాధా హిమ కిరణమవ ?
కుంకుమ పూల సుగంధపు తుఫానువ ?
గంగ ఒడ్డువా ?
కాషాయరంగు పతాకానివా ?
సాయంసంధ్యలో వారిధి కడుపులో లోతైన నవ్వువా ?
వానలో తడిసిపోతున్న యమున వెన్నెలవా ?
తలుపు తట్టిన వానగాలికి తడిసిపోయిన బాటసారివ ?
రెప్పల్లేని కళ్ళవా ? దేహాల్లేని ప్రేమవా ? దీపాల్లేని వెలుగువా ?
ఆశ్రమంలో పెంచి పెద్దచేసిన జింక పిల్ల పెళ్ళివా?
వెలుగుమంచు కురుస్తూన్న కాశీలో తడిసి పోయిన విద్యుత్కాంతివా ?
వానలో మునిగిపోయిన లక్నోలో వేడి పొగగాలి ఆవిరి నిండిన టీ కప్పువా ?
కలకత్తాలో కన్నీళ్ళతో కొన్న మరమేకుల తెరచాపల వంతెనపై చౌక్కా చేతిగుండీ తళతళ దీనాలాపనవా ?
ఈదేశానికి విదేశాన్నుంచొచ్చిన ఖరీదైన కారు అద్దంలో తన రూపం తానే చూచుకొంటూ తనను తాను అడుక్కుంటూన్న నిర్భాగ్యావతార మూర్తివా ?
ఎవర్నువ్వు, దేవుడివా, గుడివా, దుఃఖమవ ?

—వేగుంట మోహనప్రసాద్

అవసర  పరిస్థితి

రత్నామహేందర్

పైన అవసరపరిస్థితి అన్నానని పాఠక మహాశయులు ఈ పేజీ వదిలేసి చదువుదామనుకుంటున్నారు కదూ ? నాకు మాత్రం తెలీదండీ ! ఈ అవసరపరిస్థితి గురించి. మన దేశావసరాల గురించి మన నాయకుల దగ్గరనుంచి పిల్లలవరకూ, ప్రజలకు బోధిస్తూనే ఉన్నారని. పెద్ద దిన పత్రికల దగ్గరనుంచి. చిన్న కనీ కనిపించని పత్రికల దాకా (పాపం క్షమించుగాక) రాసి పారేస్తున్నారనీ. మీకూ తెలుసు. "మ్మరయితే అవసరపరిస్థితి" అని ఎందుకన్నావ్ అంటారా? అక్కడే ఉంది సార్ కీలకమంతాను.

ఈమధ్య ఏదో సందర్భంలో పూజ చెయ్యాల్సొచ్చింది(దేముడికేలెండి).పత్రాగ్గా పువ్వులూ వేస్తున్నాను. పురోహితులవారు మంత్రాలు ఝామ్మని చదివేస్తున్నారు. ఇంతలో ఒకచోట'అవసరార్థం అక్షతాం సమర్పయామి' అన్నారు. నేను ఆశ్చర్యపడ్డాను. అంటే రః అవసరమన్నది దేముడిక్కూడా ఉందన్నమాట. మా అమ్మ గంధం తియ్యటం మర్చిపోయిందట. సరిగ్గా పూజ మధ్యలో గంధం కావాల్సొచ్చిందట. అంచేత అవసరమయిన ఆ వస్తువు లేనప్పుడు దానికి బదులు అక్షింతలు వెయ్యొచ్చని నాకప్పుడు తెలిసింది. ఆహా, ఏమి ఈవింత ! ఈ



"అవసరం" అన్న మాటకు ఎన్ని అర్థాలున్నాయో కదా అని ఆశ్చర్యపడిపోయాను.


లేచేసరికి మా పక్కింటి పిన్నిగారు సాక్షాత్తూ తాయారమ్మగారు వచ్చేస్తున్నారు. తిన్నగా వంటింటి దగ్గరకెళ్ళి అమ్మతో "వదినా, చాలా అవసరంగా ఉంది. ఒక్క అయిదురూపాయలున్నాయా ? (ఉన్నాయా అని అడిగితే యిస్తావా అని అర్థం). సాయంత్రానికిచ్చేస్తా" అనటం వినిపిం

చింది. అమ్మ ఎంచక్కా యిచ్చేసి ఆవిడను పంపేశాక నేను వెళ్ళి "అపునుగానీ అమ్మా! అవసరం అని ఆవిడ అనగానే అలా రూపా య లిచ్చేయడమేనేమిటి ? ఎందుకో, ఎప్పుడో, ఏమిటా అవసరమో కనుక్కోఖర్లే ?" అన్నాను.

"బాగుంది. అవన్నీ మనకెందుకు ? అవసరం అని ఊరికే అంటుందేమిటి ? ఆ ప్రశ్నలన్నీ మన కెందుకూ ? ఇస్తే యివ్వాలి లేకపోతే లేదుగానీ" అని మెల్లగా నన్నే చీవాట్లేసింది అమ్మ. ఆహా, ఏమి మన తెలుగు భాష గొప్పతనం. ఒకచోట అవసరం అంటే లేనివస్తువు ఉన్నట్టు. ఇంకోచోట అదే మాటకు అప్పుకావాలి అని అర్థం అని మెచ్చుకుని ఆనందిస్తూంటే మా దాదాయి వచ్చి "ఏమే అమ్మాయ్ ఈ మధ్య నీ మిత్రవరేణ్యుడు కనపడ్డాడా" అన్నారు.

చచ్చాను. ఈ ప్రశ్నకు నేనే ముఖం పెట్టుకుని జవాబివ్వను ? అయినా ఇందులో నా తప్పేముందో కథంతా విని మీరే చెప్పండి.

వెనకటి రోజుల్లో అంటే సుమారు ఒక సంవత్సరం క్రితం నాకో మిత్రుడుండే



వాడు. అతనెంత మంచివాడంటే అంత మంచివాడు. నాకు పుస్తకాలూ అవీ లైబ్రరీ నుంచి తెచ్చివ్వటం మొదలగు చిన్న చిన్న పనుల్లో సహాయం చేసేవాడు, రోజూ వచ్చి ఎంచక్కా కబుర్లు చెప్పేవాడు. మరి అలాటి వాడు మంచివాడు కాడంటారా ? సరే అలాటి మంచితనాన్ని వెంటేసుకొని ఒక రోజు నన్నూ,మా దాదాయిని వాళ్ళ (అతని) తమ్ముడి పరీక్షఫీజు కట్టాలనీ, చాలా "అవసరమనీ" కొంత మొత్తం అడిగాడు. నా సలహామీద అతనికి డబ్బు యివ్వబడింది, అతన్ని మంచివాడుగారు అని అన్నా ఫరవాలేదు అనుకున్న నేను చివరకి అవసరంగారు అని పిలవాల్సొచ్చింది. (ఉపాఖ్యానం)ఇంతలో ఆ మిత్రవరేణ్యుని సొంత ఊరు నేను వెళ్ళాను. అబ్బ ఏం మర్యాద! అతని తమ్ముడైతే నానుంచే తన చదువు సాగుతోందని ఎంతో యిదయాడు.


ప్రస్తుత కథ


ఈవిధంగా నా మిత్రుడు అవసరంగా ఉందని, అవసరపరిస్థితిలో ఉన్నానని కనిపిస్తూ డబ్బు తీసుకొంటూ ఉండేవాడు.అలా కనిపించి, కనిపించి ఒక శుభోదయాన కనిపించటం మానేశాడు. సరే దానికి తగ్గట్టు వాళ్ళవూరు మళ్ళీ నేను వెళ్ళేసరికి నేనెవరో తెలియనట్టే ప్రవర్తించారు. అవసరంగారి తమ్ముళ్ళూ చెల్లెళ్లూ. ఇంత కథకు కారణమైన మా దాదాయి ప్రశ్నకు నేనేమని జవాబు చెప్పాలో మీరే చెప్పండి ?

మా యింటికి అధమం వెంట్రుకలూ పాయలు అవసరం అంటూ లేని గొప్పలకు పోయి. ఫాల్స్ ప్రెస్టిజ్ వల్ల నాశనమయిన అప్పారావుగార్ని చూస్తే కడుపు తరుక్కుపోతుంది.


"కనీసం ప్రజల అవసరాలేనా తీర్చలేని ప్రభుత్వం ఏం ప్రభుత్వమండీ" అంటాడు ఒక రాజకీయ పక్షపాతి. ఈవిధంగా అవసరం యింతై అంతై ప్రజల దగ్గరనుంచి ప్రభుత్వందాకా పాకి చివరకు దేముడి దగ్గరకూడా వచ్చేసింది. తెల్లవారి లేచింది మొదలు అవసరాలో అన్న గోల భరించలేక జ్యోతి పుస్తకం తెరిచాను. ఆఖరి పేజీలో కథలేకాదు స్కిట్సుకూడా మన పత్రికకి అవసరం అంటూ తుదిమాట రాసేశారు.

ఏం చేస్తాం రాయక తప్పలేదు. ఇది నా అవసరం. చదవటం మీ అవసరం. ఏం చేస్తాం !





పాడిందే పాట -
తెల్లనివన్నీ పాలనుకోకోయ్ -
"మంచిరోజులు వచ్చాయి" పాట
త్రిలో స్టోర్స్ షాపు
కొనుమా, సలాము, షయసే



మఠానికి
ఆస్పత్రికి
కుట్టుపని క్లాసుకి
సిగరెట్ కొట్టుకి
నగల షాపుకి
కార్ఖానాకు
'జూ' కి
నాట్యాలయానికి
స్వర్గానికి!

అదిగో దారి!



అరిగె రామారావు

తాయారమ్మకు గబుక్కున మెలకువ వచ్చింది. పక్కింటి చిట్టెమ్మగారి గొంతు తారా స్థాయిలో వినిపిస్తోంది. పాత పేపర్లు కొనేవాడినట్లుంది. దబాయించి పారేస్తోంది. చిట్టెమ్మ భర్త రోజూ ఇంగ్లీషు పేపరు తెప్పిస్తాడు. ఏరోజు పేపరును ఆరోజు దాచిపెట్టి, ఏనెలకో రెండు నెలలకో పాతపేపర్లు కొనేవాడికి అమ్ముతుంది. అలా అమ్మినప్పుడల్లా ఇదే గొడవ. ఈమె వీశకు రెండురూపాఖలు కావాలంటుంది. వాడందుకు వప్పుకొని తూస్తే, తూకం సరిలేదంటుంది. వీశ రెండు రూపాయిలకు కొంటూ తూకం సరిగ్గా తూస్తే వాడికి గిట్టేదేమిటి?....



ఈయనగారు అదేంమనిషో. పేపరు అయినా చదవరూ. ఎంతసేపూ ఆయనేమిటో, ఆయనగారి ఆఫీసు దస్త్రాలేమిటో. ఎప్పుడన్నా ఇంట్లోపని తొందరగా తెమిలి, తీరికగా వున్నప్పుడు ఏ పుస్తకమన్నా చదువుకుందామంటే, పాడు కొంపలో ఏ పుస్తకమూ వుండిచావదు. తీరికగావున్నప్పుడు చదువుకుంటానికి ఏ వారపత్రికలో కొనకూడదండీ అంటే, అదోలాగాచూచి, కథల పుస్తకాలు చదవటానికి నీవేం చిన్నపిల్లవటే అంటారు. అంతా విడ్డూరంకాకపోతే కథలపుస్తకాలు చిన్నపిల్లలే చదవాలికాబోలు. కాకపోయినా, తనేం పుస్తకాలు చదవకూడనంత పండుముత్తైదా? ఈయనదంతా చాదస్తం......

తాయారమ్మ ఆవలించి లేచి కూర్చోబోయి మళ్ళీ బద్ధకంవేసి అలాగే పడుకుంది. దొడ్లో బాదంచెట్టు నీడన పిల్లలు ఆడుకుంటున్నారు. ఎదురుగుండా గదిలో పెద్దపిల్ల సరోజ ఏదో సవరిస్తూ, కూనిరాగం పాడుకుంటూ అటూ ఇటూ తిరుగుతుంది.

తాయారమ్మ కళ్ళు మూసుకుని పడుకుంది. చిట్టెమ్మగారి పేపర్లబేరం అయిపోయిందట్లుంది. అటునుంచి మాటలేమీ వినిపించటంలేదు. చిట్టెమ్మ మళ్ళీ నీళ్ళు పోసుకుంది. ఈనెల నాల్గురోజులు ఎడం అయ్యేసరికి తనకీ నెల తప్పిందనుకుంది. ఈ సంగతీ ఆయనతో అంటే, చిరాగ్గా మొగంపెట్టి, పెద్దపిల్లకూడ పెళ్ళి కేదుగుతే ఇంకా నీకు నెలతప్పటమేమిటి నాతలకాయ అన్నారు. మొన్న సాయంకాలం శివాలయాని కెళ్ళితే జయలక్ష్మమ్మగారు కనిపించి మళ్ళీ నీళ్ళు పోసుకున్నారా అని అడిగింది. తను నవ్వి, ఆఁ ఏం నీళ్ళులెద్దురూ మా [illegible]ద్దమ్మాయి పెళ్ళీడుకొస్తే - అంది. [illegible]తే మీరు మా ముసలివగ్గు అయిపోయా [illegible]

అని అంది ఆవిడ. ఆ జయలక్ష్మమ్మగారికి తెలిసినంతకూడ ఈయనకు తెలిసిచావదు. ఓన్న దీపాలుపెట్టింతర్వాత ఆయన ఆఫీసు నుండి వచ్చేసరికి తాను వాకిట వుండటం చూచి ఆయన ముసిముసి నవ్వులు నవ్వారు. ఆయన అలా నవ్వేసరికి తనకు తలకొట్టేసినంత పనయింది. పొద్దుటమటుకు పొద్దుట చెంబులో నీళ్ళుపోస్తూ, పిల్లలెవరూ చూడకుండా, 'నెల తప్పిందనుకున్నావుకదే.' అని వెటకారంగా అన్నారు. ఆమాటకు తనకు మండుకొచ్చింది. ఈయన పయికి ఇట్లా వుంటారుగాని, ఈయనగారి దగ్గర ఎంత జాణతనం వుందనుకోవాలి....

తాయారమ్మ లేచి కూర్చుని, 'అమ్మాయి సరోజా, నో రెండి పోతోంది. కాసిని మంచి నీళ్ళు పొయ్యవే-' అంది. సరోజకు వినిపించిందో వినిపించలేదోగాని గదిలోంచి బయటికి రాలేదు. డ్రాయరుమీద అద్దం పెట్టుకుని కుర్చీలో కూర్చుని తల దువ్వుకుంటోంది. ఇంకా వచ్చి మంచి నీళ్ళు పోస్తుందని కూర్చుంటే సరోజ ఎంతకీ బయటికి రాదు. సన్నగా ఏదో పాటపాడుకుంటూ, అద్దంలో తన అందాన్నిచూచి మురిసిపోతోంది.

తాయారమ్మకు ఎక్కడలేని కోపం వచ్చింది బిగ్గరగా, 'ఒసేయ్ సరూ!' అని అరిచింది. ఆ అరుపుకు సరోజ వులికిపడి బయటికి వరండాలోకి వచ్చింది.

'ఏమిటే అమ్మా పిలిచావు?' తలంటుకున్న తల చిక్కుతీసుకుంటూ అడిగింది.

'హూఁ. ఇప్పటికి వినిపించిందా? నోరెండుకు పోతోంది కాసినిమంచినీళ్లు పొయ్యవే అని జామునేపునుంచి అరుస్తుంటే—'

"వినిపించలేదే—" అని ముందుకేసుకున్న జుట్టునంతా వెనక్కి లాక్కొని, మంచినీళ్ళు తీసుకురావటానికి వంటింటి వయిపు నడిచింది.

నల్లటిమేఘాలు లాగా పిరుదులు దాటి క్రిందకు వ్రేలాడుతున్నజుట్టు, సరోజ నడుస్తున్నంతమేర వెనుకభాగాన చిమ్మచీకట్లను కల్పిస్తుంది. సరోజ విరబోసుకున్న వెంట్రుకలను చూడగానే తాయారమ్మ చేయి అప్రయత్నంగా పిడికెడుకూడా లేని తనముచ్చట ముడి పయిన పడింది.

సరోజ వయస్సంత వున్నప్పుడు తనకు ఇంతకు రెట్టింపుజుట్టువుండేది. జడవేస్తే అరచేతి వెడల్పున పట్టాలాగా ఇంతబారున వుండేది. అమ్మమ్మ తనకు మల్లెపూల జడవేస్తే ఇంట్లో అందరికని కొన్న మల్లెపూలు తన జడ వక్కదానికి సరిపోయేవి కావు. అమ్మమ్మ అనేది- మా అమ్మ ఇదేంజడే తల్లీ! వెనకటికి మామేనత్తకే చూశా. నేటికి నీకే చూశా. మా చిన్నతనంలో వేణుగోపాల స్వామి గుళ్ళో పుట్టలోవుండే సుబ్రమన్నెస్వామి అంతబారు వుంది కదే—. తనకు తలంటవల్సి వస్తే ఇక ఆరోజు అదొక పెద్ద పని. అమ్మమ్మ ఒకవయిపు ఇంత సందెగు జుట్టు వేసుకుని గూడలన్నీ పడేదాకాఅంటే వారు...ఎక్కడిపాతో ఎందుకు? తనకు పెళ్ళయి కాపురాని కొచ్చేవరకు ఆ జుట్టు వుంది. క్రొత్తలో తనజుట్టుచూచి ఆడబిడ్డల మూతులు, తోటికోడళ్ళ మూతులు వంకర్లుపోయేవి వుక్కురోషంలో. ఎటొచ్చీ ఈ పెద్దది కడుపునపడ్డ తర్వాత, టైఫాయిడ్ వచ్చి అంతజుట్టూపోయి ఆఖరికి ఇంతముడి మిగిలింది. ఇంక ఏనాటికి వచ్చేను అంత జుట్టు....

సరోజ, వంగుని తాయారమ్మ పట్టిన గ్లాసులోకి నీళ్ళు పోస్తుంటే జుట్టంతా ముందుకుపడి గ్లాసును తాకింది. తాయారమ్మ కస్సున లేచింది.

'ఏమిటాజుట్టు ముడేసుకోకూడదు? అంబశక్తిలాగా విరబోసుకున్నావు. నాకే గండా ఓ ఇంతజుట్టు వుందని అందరికీ తెలియాలనా? మిట్ట మద్దేనంపూట తలంటుకున్న జుట్టు అలాగే విరబోసుకుంటే ఏ దయ్యమన్నా పట్టేను—.'

పాపం, సరోజ తల్లి అన్నమాటలకు చిన్నబుచ్చుకుంది.

● సర్కస్ కంపెనీ మేనేజరు దగ్గిరికి ఒకడు ఉద్యోగానికి వెళ్ళాడు.

"ఏమేం చెయ్యగలవోయ్ నువ్వు" అని మేనేజరు అడిగాడు.

అభ్యర్థి తన ప్రజ్ఞా విశేషాలన్నీ ప్రదర్శించాడు. సింహంలా గర్జించాడు. పులిలా గాండ్రించాడు. ఏనుగులా ఘీంకరించాడు. పందిలా ఘుర్ఘురించాడు. నక్కలా ఊళపెట్టాడు. ఇంకా రకరకాల జంతువుల, పక్షుల అరుపులు, కూతలు వినిపించాడు.

"బాగానే వుందిగాని, మా దగ్గిర ఆ జంతువులన్నీ వున్నాయి. మాకు ఇమిటేషన్లు అక్కర్లేదు. సొంతంగా ఏమైనా చెయ్యగలిగితే చెయ్యి" అన్నాడు మేనేజరు.

అభ్యర్థి దిగులుగా వెళ్ళిపోయాడు. ఒక ఏడాది అయిన తర్వాత మళ్ళీ వచ్చాడు.

"ఏమోయ్, మళ్ళీ వచ్చావు ?" మేనేజరు అడిగాడు.

"కొత్త విద్య నేర్చుకున్నానండి"

"ఏమిటది ?"

అభ్యర్థి చేతులు రెక్కల్లా చాచి పక్షిలా గాలిలోకి ఎగిరాడు. సర్కస్‌డేరాలో ఏ ఆధారం లేకుండా చుట్టూ పాతికసార్లు ప్రదక్షిణం చేశాడు; గాలిలో పల్టీలు కొట్టాడు. మొత్తం పావుగంటసేపు నేలమీదికి దిగకుండా ఎగిరాడు.

చిరాగ్గా మొహంపెట్టి ఇదంతా చూస్తున్న మేనేజరు విసుగుతో అన్నాడు : "ఇదివరకే చెప్పానుగదుటయ్యా, మాకు ఇమిటేషన్లు అక్కర్లేదని"

"చిక్కు తీసుకుందామని—" మెల్లగా గొణిగింది. ఇది జరిగి పదిరోజులు దాటింది.

ఒక శుక్రవారంనాటి సాయంత్రం సరోజ తన స్నేహితురాంద్రతో కలసి కనకదుర్గ గుడి కెళ్ళటానికి బయలుదేరింది. అల మరలోవున్న దాపుడు బట్టల్లోంచి సిల్కు బట్టలుతీసి కట్టుకుంది. జడ సగం అల్లి వది లేసింది. దొడ్లోపూసిన మల్లెపూలతో దండ అల్లుకుని జడతో పెట్టుకుంది. కళ్ళనిండా ఒత్తుగా కాటుక పెట్టుకుంది. పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకుంది. సుతారంగా కణతల మీదకు ముంగురులను లాగింది. మాటిమాటికి జారిపోతున్న సిల్కు పమిటను పయికి లాక్కుంటూ, జడను ముందుకేసుకుని స్నేహితురాంద్రకోసం ఇంట్లోకి బయటికి తిరుగుతోంది

సాయంకాలపు వంటపనిలో మునిగివున్న తాయారమ్మ ఏదో పనిమీద హాలులోకి వచ్చి కూతురును చూచింది. తన కూతురు సరోజ ఇంత అందగత్తా అనిపించింది తాయారమ్మకు. సరోజ నడిచినంత మేర వెలుగులు పారాడుతున్నాయి. అనుకోకుండా హాలులోని నిలువుటద్దంలో తన రూపాన్ని చూసుకుంది తాయారమ్మ. పీక్కుపోయిన దవడలు, లోతుకుపోయిన కళ్ళు, చెమటలు కారుతున్న వళ్ళు. అసహ్యంగా జారిపోయిన పొత్తికడుపు, లూజుగా జారిపోతున్న మెడ కండరాలు, మోటుగా జారిపోయిన చేతిజబ్బలు, బిగుతు సడలిన రొమ్ములు. . . తాయారమ్మకు ఏడుపువచ్చినంత పనయింది. కోపం విసుగు చిరాకు.

మళ్ళీ కూతురు వంక చూచింది. వయ్యారంగా గొలుసులుపట్టుకుని కూర్చుని, వుల్లాసంగా కాళ్ళు వూపుతూ వుయ్యాలబల్ల మీద వూగుతోంది. కూతురు వెలమదొరసాని లాగా వుంది. తాను పనిచేసే దాసికంటె కనా కష్టంగా వుంది. కూతురు అప్పుడే రేకులు విచ్చుకున్న గులాబీ పువ్వులాగా వుంది. తాను, వడిలి, వాడి, నల్లపడిపోయిన ముద్దచింకలాగా వుంది. తాయారమ్మకు తన కూతురు గర్భవిరోధి లాగా కనిపించింది. తన ఆస్తిని కొల్లగొట్టి తనను బికారినిచేసి తన కళ్ళముందే అందలమెక్కి కులుకుతున్న ప్రత్యర్థినిలాగా వుంది. తనను వెక్కిరిస్తున్నట్లనిపించింది. తాయారమ్మ మాతృహృదయంలో—"ఆడమనసు" అసూయతో కుతకుతలాడింది. విల విల లాడింది. ఆ సమయంలో సరోజ తన కడుపునపుట్టిన కూతురు కాదు. ఆడబిడ్డ, తోడికోడలు, సవతి, గయ్యాళి అత్త, గయ్ గయ్ మనే ఇంటావిడ.

"ఏమే! నేను వంటపనితో సతమతమవుతుంటే, సాని పాపలాగా సింగారించుకుని తీరిగ్గా కూర్చున్నావు? కాస్త నాకు సాయం రాకూడదు."

సరోజ వెల వెల పోయింది.

"నీవేకదమ్మా, దుర్గగుడికెళ్ళటానంటే సరే వెళ్ళమన్నావు"

"వెళ్ళమంటే మరింకా ఇక్కడే వున్నావేం?"

"వరలక్ష్మి వాళ్ళకోసం చూస్తున్నా—"

"వెళ్ళమ్మా వెళ్ళు. నీవు నీయిష్టమొచ్చినట్లు గుళ్ళు, సినిమాలు, పేరంటాలు, స్నేహితురాళ్ళ యిళ్ళు అన్నీ చక్కపెట్టు. నేను మీఅందరికి వండివార్చిపోస్త. వున్నానుగా, నేనొక దాసీముండను. . . మిగిలిన మంద ఎక్కడికిజేరింది? ఆడుకోటానికా? వాళ్ళకేమన్నా నీళ్లు పోసి వుతికిన గుడ్డలు తొడిగేనా? తొడగలా—తొడగవ్ ఎందుకు తొడుగుతావ్. అద్దంలో చూసుకుని మురిసిపోవటమే సరిపోతుందాయె నీకు. నీవు సినిమాస్టారులాగా సింగారించుకు కూర్చో. మిగిలిన చిన్నపిల్లలు ఎడ్డిమడ్డిగా వుంటే నీకేం? అయ్యో, అమ్మ ఇంటిపనితో ఇదవుతుంటే ఆ చిన్న పిల్లలకు నీళ్లూ నిప్పులూ చూద్దామే అన్న ధ్యాస నీ కుంటేగా. ఎంత సేపూ నీవళ్ళు—నీ సింగారం—నీ అద్దం. నీవు. . ."

పెట్టవలసిన నాలుగూ పెట్టి తాయారమ్మ విసురుగా లోపలికి పోయింది. పాపం, సరోజ గ్రుడ్ల నీళ్ళు గ్రుడ్లనింపుకుని ఏడుపు మొగం వేసుకుకూర్చుంది.

* * *

తాయారమ్మ వంటపని తెముల్చుకునే సరికి వీధిలోకి ఆటలు ఆడటానికి పోయిన పిల్లలందరూ బిలబిలవచ్చి పడ్డారు. "సరక్క ఏది"—"సరక్కేది" అని గంతులేశారు. గుళ్ళోకెళ్ళిందని చెప్పేసరికి, మాకు చెప్ప కుండా వెళ్ళిపోయిందని అనిరాగాలు మొదలు పెట్టారు. అలా నాల్గు తగలనిచ్చి వాళ్ళకు నీళ్ళుపోసింది. తనూ రెండుచెంబులు నీళ్ళు పోసుకుని, వుతికిన చీర కట్టుకుంది. బొట్టు పెట్టుకుందామని అద్దంలో మొగం చూసుకుంది. అద్దంలో తన మొగానికి బదులు ఇందాకటి సరోజ అందమయిన మొగం కనిపించి మాయమయింది. . . .మళ్ళీ తన మొగం. రక్తంలేక తెల్లగా పాలిపోయిన దిగాలు మొగం. . . .వంట్లోని రక్తమంతా మొగంలోకి పారినట్లు మొగమంతా పచ్చగా కళ కళలాడుతూంది. కళ్ళల్లోకి వెలుగులు వూరుతున్నాయి. పెదాలమీద చిరునవ్వులు జారుతున్నాయి. బుగ్గల్లో కెంపులు చిట్లుతున్నాయి. తాను ఇప్పుడు "తాయారు". 20 సంవత్సరాలకు మునుపు. 16 సంవత్సరాల "తాయారు." పేరంటానికెళ్ళివచ్చి అష్టమ్మ చేత దిష్టితీసి పోయించుకునే "తాయారు." కరణంగారి అబ్బాయి, నాయుడమ్మ ఇల్లరికపుటల్లుడు, బస్తీలో చదువుకుంటూ శెలవులకొచ్చిన బావ, స్కూలుకు కొత్తగావచ్చిన సైన్సు కుర్ర మాష్టరు, వూరు తనికీ చేయటానికి వచ్చినప్పుడల్లా తండ్రి యింట్లో మకాంచేసే ఆర్. ఐ.—తమకంగా, వళ్ళంతా కళ్ళు చేసుకుని చూచే "తాయారు." అవతల పదివేలు కట్నం యిస్తామన్నా పెళ్ళి కొడుకును అయిదువేల కట్నానికే వప్పించగల అందంగల "తాయారు." సానికొంపల

"రామాయణకాలంలో జెట్ విమానాలుండేవి,"
"రుజువేమిటి ?"
"జటాయువు లేదూ ? జెట్ + ఆయువు"
"కాని, ఆయువు అంటే ఎగిరేది అని అర్థమా ?"
"కాక ? ప్రాణాలెప్పటికైనా ఎగిరిపోవా ?"

—మంత్రవాది ఉమాశంకర్

వెంట తిరిగే పెద్దన్నగారు క్రొత్తగా కాపురానికొచ్చిన తన భార్యవంక కోరచూపులు చూస్తున్నాడని భయపడి, పేచీపడిన భర్తచే వేరుకాపురం పెట్టించిన తాయారు. . . . అలాటి "తాయారు" ఈనాడు "తాయారమ్మ" అయి కన్నకూతురు అందచందాలముందు తీసికట్టుగా, ఆయింటికి దిష్టిబొమ్మగా, ఈ "మంద"కు వెట్టిచాకిరిచేసే దాసీదానిగా మిగిలిపోయింది.

ఈ ఆలోచనలతో తాయారమ్మ రోజుకంటె కాస్త ఎక్కువగా మొగానికి పౌడరు కోటా పట్టించింది. ఎప్పుడో వేడిచేసి కళ్లమంటలు పుట్టినప్పుడు పెట్టుకునేది. ఆవాళ కళ్ళకు కాటుక పెట్టుకుంది. కడగొట్టుది కడుపున పడ్డప్పుడు మానేసిన బాడీ..మళ్ళీ పాతగుడ్డల మూటనుండి ఒకబాడీని తీసింది. సైజు సరిపోలేదు. ఎలాగోబిగించి ముడేసింది. ఏమూలనో పడి దుమ్ముకొట్టుకుని వున్న సవరాన్ని వెదికితీసి, దానికి నూనెరాని చిక్కుదీసి, దువ్వి, విడికెడుకూడలేని తన జుట్టుపాయలతో కలిపి జడ అల్లి ముడిచుట్టింది. ఇంధాక సరోజ పెట్టుకోగా మిగిలిన మల్లెపూలను దండకట్టి, ఆ ముడిచుట్టూ చుట్టింది. జోఖునయేసు తమ్ముడి పెళ్ళికెళ్ళినప్పుడు తల్లిచేత కోరి పెట్టించుకున్న కాశ్మీరు సిల్కుచీరను, లంగా (సరోజది) పయిన కట్టింది. రోజూ సరోజ తల దువ్వుకున్న తర్వాత వెంట్రుకలను రేపుకునే పద్ధతిలో చెంప వెంట్రుకలను రేపింది.

ఇంతసేపు అమ్మ, గదిలో ఒక్కత్తే ఏం చేస్తోందా అని చూడటానికి వచ్చిన తాయారమ్మ రెండోకూతురు వనజ, తల్లిని ఎగాదిగా చూచి గబ గబ పరుగెత్తుకుంటూ హాలులోకి వెళ్ళింది. హాలులో ఆడుకుంటున్న తమ్ముళ్ళతోను, చెల్లెళ్ళతోనూ లోపలికెళ్ళి చూడండి బలేగమ్మత్తు వుందని చెప్పింది. ఒకళ్ళతర్వాత ఒకళ్ళు లోపలికెళ్ళి తాయారమ్మనుచూచి నవ్వుకుంటూ వస్తున్నారు. అందరికంటె ఆఖరివాడు లోపలికి తొంగిచూచివచ్చి, వంటింటి గుమ్మంలో నిలబడి—"అమ్మా, మనింటికి ఎవరో వచ్చారే. ఆగదిలోవుంది." అని అరిచాడు, తల్లి వంటింట్లోవుందని—అమాయకంగా.

అద్దంలో మొగం చూచుకుంటున్న తాయారమ్మ కొడుకుమాటవిని, ఎవరోవచ్చారనుకొని హాలులోకి వచ్చింది. హాలులోకి వచ్చిన తల్లిని ట్యూబులైటు కాంతిలో క్షుణ్ణంగాచూచి పిల్లలు నవ్వులు మొదలుపెట్టారు. "అమ్మ గమ్మత్తుగావుంది—అమ్మ గమ్మత్తుగావుంది" అనిఅరుస్తూ చుట్టూ తిరగటం మొదలు పెట్టారు.

అప్పుడే బయటనుండి లోపలికొస్తున్న తాయారమ్మ భర్త, హాలులోవున్న తాయారమ్మనుచూచి ఎవరో బయట ఆడవాళ్ళు వచ్చారని, ఒక అడుగు వెనక్కువేశాడు. అదిచూచి రెండోకూతురు వనజ నవ్వుతూ వచ్చి, 'ఎవరను కుంటున్నావు నాన్నా—అమ్మే—' అని తండ్రి చేయి పట్టుకుని లోపలికి తీసికొచ్చింది. తాయారమ్మ మొగుడు భార్యచుట్టూ తిరుగుతూ పరీక్షగా చూశాడు సీరియస్‌గా మొగంపెట్టి. పరీక్ష పూర్తిచేసి పక పక నవ్వి, 'ఓర్నీ, మీ అమ్మేరా గోపీ!' అన్నాడు.

'అమ్మకాదు నాన్నా, బొమ్మ.' వనజ అంది.

'ఏం బొమ్మా?'—ఏం పేరు పెట్టినామూ అని సాలోచనగా అడిగాడు తండ్రి.

అందుకు గోపి సమాధానం యిచ్చాడు:

'దసరా బుట్టబొమ్మ.'

'వెరీగుడ్. దసరా బుట్టబొమ్మ'

"అమ్మ—అమ్మ—దసరా బుట్టబొమ్మ" తండ్రితోకలసి పిల్లలు చుట్టూ తిరగటం మొదలుపెట్టారు.

ఇక తాయారమ్మ అక్కడ వుండలేకపోయింది. గదిలోకివెళ్ళి తలుపులు బిడాయించుకుంది. అలంకరణ అంతా తీసిపారేసి మంచంమీద బోర్లాపడుకుంది. బయట పిల్లలూ, తండ్రీకలసి అగంచేస్తున్నారు.

ఇంతలో సరోజ గుడికెళ్ళివచ్చిందట్లుంది. పిల్లలు "సరక్క" అంటూ చుట్టూమూగి తల్లిని గురించి చెప్పుకున్నారు. తాయారమ్మ బయట గొడవంతా వింటూ పడుకుంది.

"అబ్బ, ఇవాళ సరక్క బలేవుంది" అంటున్నాడు శేషు.

"ఎలావున్నానేం?"

"మోతగావున్నావు" రాజు అన్నాడు. వెంటనే వాడివీపుమీద ఎవరో మోత పుట్టించారు.

"ఇవాళ అమ్మకూడా నీలాగే వుందే సరక్కా—"

"సరక్కలాగా వుండాలని అమ్మ అలా షోకు చేసుకుంది." వనజ అంటోంది.

"దానిమొగం సరూలాగా వుండాలంటే మళ్ళీ మరోజన్మ ఎత్తాలి." భర్తకంఠం.

నిజమే—మళ్ళీ ఇంకోజన్మ ఎత్తాలి. ఆ అందం, ఆ లేతదనం రోజు రోజుకి పుడిగిపోయేవేకాని మళ్ళీవచ్చేవికావు. ఇక ఈ జన్మలో మళ్ళీ "తాయారు" కాలేదు. "తాయారమ్మే!" ఇంకా నాల్గురోజులుపోతే "తాయారు మామ్మ" అవుతుంది.

సరోజ తండ్రితో ఫిర్యాదుచేస్తోంది తనమీద.

"నాని పాపలాగా సింగారించుకున్నానని ఇందాక అమ్మ నన్ను తిట్టింది నాన్నా—"

"ఏడ్చిందిలే. ఇప్పుడు తను చేసిన పనేమిటో? అమ్మ అలాగే అంటుందిలే తల్లీ. నీకేమమ్మా, లక్ష్మీదేవిలాగా వుంటావు. నీవు యింట్లోవుంటే చాలు లక్ష్మి తాండవమాడుతుంది."

కుమార్తెను తండ్రి బుజ్జగిస్తున్నాడు.

"ఏవయస్సుకు తగ్గముచ్చట ఆవయస్సుకుండాలి, ఎందుకే పిచ్చిపిల్లా. కళ్ళనీళ్లు పెట్టుకుంటావు. లేలే, భోజనాలు చేద్దాం."

ఆయనకు తెలిసినంత తనకు తెలియకపోయింది. ఏవయస్సుకు తగ్గ ముచ్చట ఆ వయస్సులోనే జరగాలి. తనకు ఇంకా వచ్చే వయస్సేకాని, పోయేవయస్సు కాదుగా.

"అన్నాలు పెట్టటానికి రావే" అని పిల్లలు తలుపుకొట్టారు. తాయారమ్మ లేవలేదు.

"సరక్క పెడుతుందిలే పదండర్రా"

అంతా వంటింట్లోకి పోయారు. సరోజ,

మడిచీరకోసం అమ్మఎక్కడపెట్టిందో అని వెతుకుతోంది. మడిచీర కట్టుకుని వడ్డన చేస్తుంది కామాలు.

"ఇప్పుడు సరక్క అమ్మలాగావుంది." గోపి అంటున్నాడు.

"సరక్క ఎప్పుడూ సరక్కలాగే వుంటుందేరా? అమ్మగూడ అవుతుంది-రేపు పెళ్ళి చేసుకుంటే."

"షో నాన్నా-"

నిజమే. సరుకూడా రేపు పెళ్ళయి పిల్లలు పుట్టితే తనలాగే తయారవుతుంది. అదికూడ ఒక నాడు ముసలిదయిపోతుంది.

తాయారమ్మకు గుండెలమీదనుండి బరువు దింపినట్లయింది.

తాయారమ్మలోని "ఆడమనసు" మెల్ల మెల్లగా ప్రక్కకు వొదిగింది. 'తల్లిమనసు' నిండుగా పొర్లింది.

ఏమిటో పాపం చిన్నపిల్ల. ఇందాక దాన్ని అడ్డమయిన తిట్లూతిట్టింది. అదిఎల్లకాలమూ ఈ యింట్లో వుండబోయి వుంటుందా? రేపు పెళ్ళయితే దానిదార్ని అది పోతుంది. నిజంగా సరూ ఎంత అందంగావుంటుంది. అమ్మలక్కలంతా నీ కూతురుకేవమ్మా బంగారపు బొమ్మ అంటారు. తన కడుపున పుట్టిన కూతురు అందంగా, ఆకర్షణీయంగా వుంటే తనకు మాత్రం అందంకాదా? అందరూ ఫలానమ్మ కూతురమ్మా అంటారు. మొన్న వర్ధనమ్మగారు పేరంటానికి పిలవటానికని వచ్చి సరూను చూచి. నీ నోట్లోంచి వూడిపడ్డట్టు వుండే నీ కూతురు; తల్లుల అందం కూతుర్లకు రాక ఇంకెవరికి వస్తుంది అంది. పెద్దమ్మాయిని చూస్తుంటే క్రొత్తగా కాపురానికొచ్చిన రోజుల్లో నీవు ఎలా వుండే దానివో గుర్తుకువస్తుందే-అని వాళ్ళనాన్న అన్నారు ఒకసారి. నిజంగా తన అందమంతా కూతురుకే వచ్చింది. సరూను ఎవరన్నా అందగత్తె అన్నారంటే అది తనను అన్నట్లే....

అందరూ అన్నాలు తిని చావిట్లోకి వచ్చారు. పిల్లలు పుస్తకాలు ముందేసుకుని పాఠాలు చదువుతున్నారు. తాయారమ్మ మెల్లగా లేచి తలుపు తీసుకుని వంట్లోంటికి వెళ్ళింది. వంటింట్లోంచి 'అమ్మాయి సరూ!' అని కేకేసింది. తల్లి పిలుపు విన్న సరోజ హాలులోంచి వంటింట్లోకి వచ్చింది. తాయారమ్మ గుప్పెడు మిరపకాయలు కూతురు చుట్టూ గిరగిర తిప్పి దిష్టితీసి పొయ్యిలో పడేసింది.

"ఎందుకే అమ్మా ఇదంతా ?"

"ఎందుకేమిటే పిచ్చిపిల్లా. ఇందాక గుళ్ళో కెళ్ళావా ? అందరి పాపిష్టికళ్ళు నీమీదే వుంటాయి. దిష్టి తగలదే ? ఎంత వంచి మాశారో. ఏమిటో. ఒక్కొక్కళ్ళ కళ్ళు వుంటాయి—ఆ ళ్ళతో చూశారా. నల్లరాయంటిది ఫెళ్ళున పగిలి పూరుకుంటుంది"



కాయద ఖాతాఖానీ


ప్రొదుక మహాశయులారా !

ఈ మిధ్య మా పత్రికలో మచ్చుతప్పులు కోగుల్లలుగా పుట కరుస్తున్నవి. వాటిని కారణ భూతాలుగా చూపెంచి ఒక పావక మహాశనుడు ఈ నిద్రారాక్షసాలకు ఒక పేచీ కాటాయించ నక్కరలే దంటున్నాడు. ఆ తుప్పులు మేము వాంచించని క్షుద్రా రాక్షసాలు. ఇవి కోవాలని పచనము చేస్తున్నవి :

కుషితో నాస్తి దుర్భిక్షం
ఆశ లావు పీక సున్నం

కొంతమంది ఉద్యోగులు ఒక లంచంలో తినే మితుర్లు.
వడగళ్ళవాన పిల్లలకు హర్షఋతువు.
దొంగ భక్తులు కామనామ స్మరణచేస్తారు.
అప్పులవాళ్ళ నోటీసులు ఉత్త రాలు.
నెహ్రూగారి దయవెల్ల కాంగ్రెసువాళ్ళ పాపాలు తెల్లబొరుతాయి.

సశ్లేషము
ప్రాపులీడరు.



నిదుర లేవని దేవుడు

కె.వి.ఎస్. అచ్యుతవల్లి

వసంతోదయం. చల్లగాలికి మామిడి పూత రాలుతున్నది. ఉషఃకన్య, ఉజ్వల ప్రతాపుని ఆగమనాన్ని చూసి, లజ్జతో కందిపోతూ, ఉన్నత పర్వతశ్రేణి మాటుకు సంభ్రమంగాతప్పుకుంటోంది. శీతల నదీజలాల్లో సుస్నాతుడై పైకి లేస్తున్న సూర్య భగవానుడు ఆకాశం మీద అరుణిమను చూసి, అది తన అనురాగమా ఉషో దేవి నుదుటి కెంపుల కుంకుమా? అని తెలియక విభ్రమచేతస్కుడౌతున్నాడు.

నది వొడ్డునున్న దేవాలయ ప్రాంగణంలో, కాషాయాంబరాలు ధరించిన భిక్షువుల గుంపు బరువుగా కదుల్తున్నది. దేవాలయంలోంచి సుప్రభాత గానం సమస్త సుప్త ప్రకృతిని చైతన్య పరిచేలా, ఉచ్చస్వరంలో నలుమూలలా శ్రవ్యమవుతున్నది. దేవతా విగ్రహం ముందర నున్న బంగారపు ప్రమిదలో ఆవునేతిని ఆవిరి చేస్తూన్న దీపపు వత్తి నిశ్చలంగా నిద్రపోతున్నట్లు నిలబడ్డ నిలువెత్తు నల్లరాతిలో మలచబడ్డ దేవప్రతిమ వైపు నిర్ఘాంతపోయి చూస్తున్నది. దేవ ప్రతిమ కళ్ళు బంగారపు రేకుతో తాపటం చేయటంవల్ల దీపపు క్రీనీడలు ప్రతిఫలిస్తూ భయంకరమైన వింతకాంతితో వెలుగుతున్నది.

జనం ఎడతెరిపి లేకుండా లోపలకు వస్తున్నారు. తోసుకుంటున్నారు. ఒకరి కాళ్ళు ఒకరు తొక్కుకుంటున్నారు. ప్రక్కన నడిచే వారిమీద విసుక్కుంటున్నారు. తడి బట్టలతో లోపలకొచ్చిన వారిని చూసి, పట్టు బట్టలు కట్టుకొన్నవారు మూతులు ముడుచుకుంటున్నారు. అందమైన యువతుల ముఖాల కోసం కళ్ళజోడుల్లోంచి నడివయసుకళ్ళు, క్రాపింగ్ కొసలోంచి యువకుల కళ్ళు చికిలించి చూస్తున్నాయి. ఖరీదైన నగల మెడలకోసం జేబుదొంగల కళ్ళు వెదుకుతున్నాయి.

తన ముందు దృశ్యమానమవుతున్న ఇంత కోలాహలాన్ని గమనించలేని దేవుడు నిశ్చలంగా నుంచునే నిద్రపోతున్నాడు. పూజారులు ఎదుట నిలబడి మైకులో గొంతులు చించుకుని సుప్రభాతం చదువుతూంటే కూడా మేలుకోని దేవుడు ఎక్కడనో మైళ్ళ దూరంలో ఒక అట్టముక్కకి దీప ధూప నైవేద్యాలు పెట్టి మేలుకొమ్మంటే ఆ స్వామికి నిద్ర మెలుకువ వస్తుందా? దేవాలయంలో ఏకధాటిగా మ్రోగిస్తున్న జే గంటకి గాలిగోపురంలోని పావురాలు ఆకాశంలోకి ఎగిరిపోతున్నాయి.

"అమ్మా !" అన్నది ఆరేళ్ళ ఆశ జన సమూహంలో నలిగిపోతూ.

"ఏమిటి !" అన్నది తల్లి.

"ఏమిటమ్మా ! ఈగోల" అన్నది ఆశ.

"తప్పు తల్లీ ! గోలకాదు. దేముడికి పూజ" అన్నది తల్లి.

"పూజంటే. నువ్వు వంటింట్లో ఫొటోకి చేస్తావ్ అదేనా !"

"ఆఁ అదే" కూతురి తెలివికి మెచ్చుకుంది తల్లి.

"ఎందుకమ్మా పూజ ?"

ఏమని చెప్పాలో తోచలేదు తల్లికి. యుగయుగాలుగా పండితుల మొదలు, పాషండులదాకా ఎదుర్కొనే జటిల ప్రశ్న !

"చెప్పవేఅమ్మా ! ఎందుకు పూజ ? పూజంటే ఏమిటి !" పట్టినపట్టు విడువదు ఆశ.

"కోరికలు నెరవేరటానికి పూజలు చేస్తారు. పూజంటే పూవులతో అలంకరించటం. ఫలహారాలు నైవేద్యం పెట్టటం" ఎంతో వివరంగా చెప్పాననుకున్నది తల్లి.

"అమ్మా !" అన్నది ఆశ.

"ఏమిటి ?"

"కోరికలంటే ఏమిటి ?" అని మళ్ళ వేసింది. దాని ప్రశ్నలకి జవాబులు చెప్పటం రానురానూ అసాధ్యమౌతున్నది తల్లికి. అయినా తనకాలం గడవటానికి వేరుగత్యంతరంలేదు తల్లికి. అంచేత సంభాషణ కొనసాగించింది.

"కోరిక అంటే ఏదైనా కావాలనుకోవటం. నీకు బిళ్ళలూ. బిస్కట్లు తినాలనుంటుందా ? అది కోరికన్నమాట"

"అవి తీరటానికి పూజ చేస్తారా అమ్మా! అయితే నా పుట్టింరోజున నువ్వు నాకు పూజ చేస్తావెందుకన్నీ ?"

"ఛీ ! నీ ముఖం ! నీకు నేను పూజ చేయటమేమిటి ?"

"అబద్ధం చెప్పకు అమ్మా ! అరోజు నువ్వు నాకు జడలో పూలుకట్టి, బొట్టెట్టి నైవేద్యం పెట్టలేదా !"

కూతురి జ్ఞాపకశక్తికి ఆశ్చర్యపడింది తల్లి. దాని తార్కికశక్తికి విస్తుపోయింది కూడా.

"అయితే నీ కోరికలు నేను తీర్చానా అమ్మా ?" తల్లి తనకి పూజచేసి, నైవేద్యం పెట్టింది మరి. తను తల్లికోరిక తీర్చిందో లేదో మరి ఆపిల్లకి తెలియదా !

తల్లి కళ్ళవెంట ఆనందబాష్పాలు జలజల రాలాయి.

"నా కోరికలు నువ్వు పెద్దయింతర్వాత తీరుస్తావు తల్లీ" అన్నది ఎత్తుకుని ముద్దు పెట్టుకుంటూ.

"పెద్దంటే ఎంతమ్మా ! నీ అంతా?" అన్నది ఆశ.

"అవును తల్లీ ! చప్పున పెద్దదాన వవ్వాలని దేముడికి దండం పెట్టుకో" అన్నది తల్లి.

"అమ్మా ! దేముడు మాట్లాడడేం ! ఇంత గొడవ గొడవగా వున్నా. చెత్తలు గింగుర్లు పెట్టుతోన్నా, అల్లాగే నించున్నాడేం ? అదే మా మాష్టరయితే గట్టిగా మాట్లాడే పిల్లని బెంచీ ఎక్కించి, రోజంతా నించోపెట్టేస్తారు" అన్నది.

"దేముడు నిద్రపోతున్నాడు తల్లీ !" అన్నది తల్లి.

"నిద్రపోతేమటుకు ఇంత గొడవకి మెలుకువ రాదేం మరి ! అయితే మనలాళ్ళ నిద్రా !"

ఆశ నాలుగేళ్ళ పిల్లగా వున్నప్పుడు వాళ్ళ అమ్మమ్మ చనిపోయింది. ఎంత పిలిచినా పలకదేమని ఆశ ఏడవటం ప్రారంభించింది. ఆవిడ నిద్రపోతోందని, మనలాళ్ళు నిద్రపోతే మరి లేవరనీ చెప్పి తల్లి సముదాయించింది. అది జ్ఞాపకాని కొచ్చింది ఆశకి.

"ఛీ ! తప్పు ! దుడుకుపిల్లా !" విసుక్కుంది తల్లి.

"ఆఁ ! అన్నీ అబద్ధాలేనీవి! అమ్మమ్మ లాగే దేముడుకూడా నిద్రపోతున్నాడు. అమ్మమ్మకూడా ఇల్లాగే కళ్ళు తెరిచి నిద్రపోయింది. దేముడూ అంత ధగధగా మెరిసే కళ్ళెట్టుకుని చూస్తూనే నిద్రపోతున్నాడు"

"వూరుకోవే దరిద్రపుపిల్లా !" కోపంగా అన్నది తల్లి. ఆశ ముఖం చిన్నబోయింది.

మృగరాజసం

అప్పుడే నిద్రలేచిన సింహం అలా షికారుగా తిరిగొద్దామని బయలుదేరింది. దోవలో ఒక పెద్దపులి ఎదురైంది. సింహం దాన్ని నిలేసి "నే నెవరో తెలుసా ?" అని అడిగింది.

"ఎవరేమిటిసార్. తమరు మృగరాజులు. పంచాననులు. హర్యక్షులు" అని భట్రాజులా పొగిడింది పెద్దపులి.

"సరే పో" అని, సింహం ముందుకు సాగింది. కొంతదూరం పోయాక తోడేలు ఎదురైంది. దాన్నికూడా సింహం అడిగింది "నే నెవరో తెలుసా ?"

తోడేలు నక్కలా వణికిపోతూ "త-త-తమరు తెలియకేమండి. పలినోరు, దొడ్డ పెబువులు రచ్చించాలి" అంది.

"అంచేత వెళ్ళొ నీదారి న్నువ్వు"అని సింహం ఇంకా ముందుకు పోయింది.

దారికడ్డంగా ఒక ఏనుగు నుంచుంది. సింహం దాని దగ్గిరకెళ్ళి "నే నెవరో తెలుసా ?" అంది.

ఏనుగు దానికేసి ఓరగా చూసింది. తొండంతో లుంగచుట్టి సింహాన్ని ఎత్తి గిరాటేసింది.

సింహం ఒళ్ళు దులుపుకుంటూ లేచి "తెలియకపోతే తెలియదనచ్చుగా ? ఎత్తి పడెయ్యాలేమిటి బడాయిగా ?" అని లీవిగా వెళ్ళిపోయింది.

అయినా దాని ఆలోచన ఆగిపోలేదు. బహుశా దేముడికి దెముడేమో! అవును మామ్మాటికీ దేముడికి దెముడొచ్చి వుంటుంది. తమ ఇంటిదగ్గర బటాణీలూ వేరుశనక్కాయలు అమ్మే మామ్మకి బ్రహ్మ దెముడు.

"కాణీ బటాణీ లియ్యి మామా!" అంటుంది తను.

"అరువియ్యను" అంటుంది ఆముసల్ది. ఇంక నోరెట్టుకుని ఈ పూజారులకన్న ఎక్కువగా అరుస్తుంది ఆశ.

"కాణీ ఇదుగో మామ్మా! బటాణీలు ఇయ్యి" అంటుంది గట్టిగా రెండు నయాపైసల నాణెం ఇస్తూ. కాని ఆచిన్న నాణెం అంటే ఒక శతాబ్దిని పూర్తిచేసిన ఆ ముసలమ్మకి నమ్మకం వుండదు.

"చిన్నకాణీకి ఇయ్యను. పెద్దకాణీ తెచ్చుకో! చిల్లిది తెచ్చావా అసలు ఒక్కగింజకూడా ముట్టుకోనియ్యను" అంటుంది ఆ ముసల్ది. రెండు నయాపైసల నాణెంకన్న, చిల్లికాణీకన్న పూర్వకాలపు పెద్ద రాగి కాణీ మంచిది అని దాని దృఢ విశ్వాసం.

కాని ఆ కాణీలు ఆశకి ఇంట్లో దొరకవు. అలవాటుగా "కాణీయ్యవే అమ్మా!" అని గునిస్తే తల్లి రెండునయాపైసల నాణెం పడేస్తుంది ఈమామ్మ ఇక్కడపేచీ.

"అమ్మా! పెద్దకాణీయ్యవే!" అంటుంది తల్లితో. పెద్దకాణీ అంటే తల్లికి అర్థంకాదు అంచేత మళ్ళీ ఇంకోరెండు నయాపైసల నాణెం పడేసి ఆశా గొడవ వదిలించుకుంటుంది. ఆశా మంచిచురుకైనది. అన్నమాటలకి అతుకులు పెట్టి పొడిగించుకుంటుంది. అంచేత మళ్ళీ మామ్మ దగ్గరికి వెళ్ళి—

"మామ్మా! ఇదిగో ఇంకో కాణీ తెచ్చాను. పెద్ద కాణీకి ఈ చిన్న కాణీలు రెండట! అమ్మ చెప్పింది" అంటుంది. తన తెలివితేటలతో మామ్మని బోల్తాకొట్టించానని మురిసిపోతుంది ఆశా. ఇంక అసలు బేరంలోకి వస్తుంది మామ్మ.

"ఏమిటి అంటావు? ఈచిన్న కాణీలు పెద్దకాణీకి రెండన్నమాట. నిజమే అన్నమాట! అయితే మరి మరమరాలు ఇవ్వేళ తేలేదే అమ్మాయ్!" అంటుంది.

"సిబోడి మరమరా లెవరికి కావాలే మహాతల్లీ! చప్పగా ఏడుస్తాయ్! వెధవ మరమరాలు" అనుకుని.

"బటా లియ్యి మామ్మా" అని గట్టిగా అరుస్తుంది ఆశా.

అయినా వినబడితేగా!

"వేరుశనక్కాయలు ఈ కాణీ దొక్కులో నాలగుకూడా పట్టవే పిల్లా! బటాణీలు కొలుస్తాను" అని చిన్న సీనారేకు దొక్కుతో, ఆశా గౌనువడిలో బటాణీ గింజలు పోసి, అమాయకులైన పిల్లల్ని మోసపుచ్చటం తనకి యిష్టంలేనట్లు ముఖం పెడుతూ ఒక వేరుశనక్కాయ కూడా కొసరు వేస్తుంది మామ్మ. దెముడుమామ్మ. దానిదగ్గర సీనారేకు దొక్కులు మూడున్నాయి. కాణీ దొక్కు, అర్థణా దొక్కు, అణా దొక్కు. అణా దొక్కుతో తనెప్పుడూ కొనుక్కోలా! "మర్చిపోయా కోరికలు దేముడు తీరుస్తాడన్నది కదూ అమ్మ. ఏదన్నా అడగాలి దేముణ్ని. దెముడు దేముణ్ని" అనుకుంది ఆశ. మళ్ళీ మెరుపులా ఇంకో ఆలోచన వొచ్చింది ఆశాకి.

"అమ్మా! దేముడికి పూజచేస్తావేమిటే?" అన్నది ఆశ.

"అయిపోయిందమ్మా పూజ," అన్నది తల్లి.

"ఏం నైవేద్యం పెట్టావే!"

"కొబ్బరికాయి కొటాను తల్లీ." అన్నది తల్లి. తల్లిచేతిలో సగం కొబ్బరి చిప్పని చూసింది ఆశా.

"అమ్మా! కాయకొట్టితే, సగం చిప్పే ఇచ్చేదేమే దేముడు?"

"పూజారి సగం తీసుకుంటాడు."

"ఇక్కడ చేయొద్దు పూజ అమ్మా ఇక్కడ పూజచేస్తే కాణీలు, కొబ్బరి చిప్పలూ పూజారి తీసుకుంటాడు. ఇంట్లోనే చేసుకుందాం ఏమ్మా" అన్నది. "అల్లాగేలే: వూరుకో" అన్నది తల్లి విసుగా. ఆశా చుట్టూ చూసింది అంతా అమ్మంత మనుష్యులు తను తల్లి మోకాలిదగ్గర కొచ్చింది. అమ్మంతయితే కాని తను తల్లి కోరికలు తీర్చలేదు.

"అమ్మా! దేముడు నిద్రపోతున్నాడన్నావు. నిద్రపోటంకాదే! బహుశా దెముడొచ్చి వుంటుంది" మళ్ళీ మొదలెట్టింది.

"తప్పు. నీ కిల్లాంటి పాడుమాటలు వస్తున్నాయేమి టివ్వాళ?"

"పోన్లే అమ్మా! నీకంతా కోపమే. నా మాట అబద్ధం అయితే నువ్వే దేముడితో మాట్లాడు. చూద్దాం"

"ఇంతమందిలో మాట్లాడదు తల్లీ!"

"ఏం మాట్లాడితే? భయమా!"

"దేముడికి భయమేమిటే వెర్రితల్లీ! పద బయటికి" అన్నది తల్లి. తల్లితో నడుస్తూందన్న మాటేకాని దాని మనస్సుకి తృప్తిలేదు. ఏవో సంశయాల వలలో ఆ పసి మనస్సు పరిభ్రమిస్తున్నది. ఆలయ ప్రాంగణందాటి బయటకు వచ్చారు తల్లీ, కూతురూ. రోడ్డు కిరుప్రక్కలా బారులుతీరి కూర్చున్న ముష్టివాళ్ళని చూసింది ఆశ.

"అమ్మా ధర్మం! బాబూ! నాల్రోజుల బట్టి అన్నం లేదు బాబయ్యా!" అంటూ వచ్చేపోయే వాళ్ళ కాళ్ళకి అడ్డంగా చేతులు చాపుతూ దీనంగా అరుస్తున్నారు. ఆశా తల్లి ఒక రెండు నయాపైసల నాణెం ఒకడికి ముష్టి వేసింది. దానితో మిగిలిన ముష్టివాళ్ళు ఒక్కసారిగా. "తల్లీ ధర్మం" అంటూ ఆశా తల్లిని పోనీకుండా చేతులు చాపటం మొదలెట్టారు.

"ఎందుకే మన్ని ఇల్లా అడుక్కుంటున్నారు. మన్ని అడిగేబదులు దేముణ్ని అడుక్కుంటే పోలా! దేముడు కోరికలు తీరుస్తాడన్నావు కదా" అన్నది ఆశా.

"అతిగా మాట్లాడకు" అన్నది తల్లి.

ఆశా మాట్లాడలేదు. దానికి బాగా కోపం వచ్చింది. అమ్మ అన్నీ అబద్ధాలు చెప్తుంది. ఎందుకన్నో. అసలు అందరూ అబద్ధాల పుట్టలే. మాష్టారుమటుకు రాముడు దేముడు అన్నారు. మరి దేముడయితే హాయిగా కోవెల్లో కూర్చోలేక, అడవుల్లోకి పోవటమెందుకు? పోతేమటుకు అక్కడ పెద్ద మేడ కట్టుకుని వుండకుండా, చెట్లక్రిందా పుట్లపైనా వుండటమేం! సీతని రావణాసురుడెత్తుకొనిపోతే సుగ్రీవుడిని, ఆంజనేయుడిని బ్రతిమాలుకుని సైన్యాన్ని తయారు చేసుకుంటే కాని యుద్ధంచేయలేకపోయాడు. మేష్టారు ఇన్ని సందేహాలూ తీర్చలేరు.

వుత్తినే "రాముడు దేముడు అంటారు. "రామనామతారకం భక్తిముక్తిదాయకం"అని ప్రతీ ఆదివారం భజన చేస్తారు. తన ప్రక్క ఇంటి దేవానందం "ఏసుప్రభువు భగవంతు" డంటాడు. ఆయన ఎల్లాంటి రోగులైనా చేతితో తాకగానే వాళ్ళ రోగాలన్నీ మటు మాయమయ్యేవిట ! మరి తన కుంటికాలు మామూలు కాలుగా చేయమని అడక్కా డడూ ! ఏమిటో వాళ్ళకి ఏమీ జ్ఞాపకాలు వుండవు కాబోల్ను. ఆ దేముడు మాట్లాడే ప్పుడే అన్నీ అడిగి తీసుకోవాలి. మళ్ళీ నిద్రలో పడితే ఎంతకీ లేవడు. అమ్మ నిద్రపోకుండానే తనకి కావల్సినన్ని చేగోడీలు అడిగి దాచుకోవటంలా ? అల్లాగే దేముడు మెలుకువగా వున్నప్పుడే మనకి కావల్సినవన్నీ అడిగి తీసుకోవాలి. కోరిక లన్నీ తీరుస్తాడన్నదిగా అమ్మ ! ఇంటికి వచ్చాక ఆశా అరుగుమీద నించుంది. తల్లి లోపలికిపోయి పని చూసుకుంటున్నది. ఆక లిగా వున్న సూర్యుడు ఆకాశంమీదికి తొం దర తొందరగా పరుగెడుతున్నాడు. పోస్టు మేన్ ఒక కవరు ఆశా నించున్న అరుగు మీదకు గిరాటెట్టి సైకిలుమీద తుర్రుమని వెళ్ళిపోయాడు. కవరు చేతిలో పుచ్చుకుని లోపలికి పరుగెత్తింది ఆశా.

"అమ్మా! అమ్మా! ఉత్తరం వచ్చిందే" అన్నది. తల్లి ఆత్రంగా కవరువిప్పి చదువు కుంది. సంతోషంతో ఆమె కళ్ళు మెరిశాయ్.

"ఎవరు వ్రాశారే ఉత్తరం ?"

"మీనాన్న !"

ఆశాకి జ్ఞాపకం వచ్చింది. ఒకరోజు తెల్లవారకట్టే లేచి నాన్న ఎక్కడికో వెళ్ళి పోయాడు. నాన్న వెళ్ళిపోతుంటే అమ్మ నాన్న కాళ్ళకు వంగి దండం పెట్టింది.

"నాన్న ఎక్కడికెళ్ళారే ?"

"యుద్ధం చేయటానికి వెళ్ళారు తల్లీ !" అన్నది. తల్లికి వంట చేయటం అయిపో యిందని గమనించింది ఆశా. ఇంక తీరి కగా మాట్లాడుతుంది.

"రామరావణ యుద్ధం అయిపోయింది కదే ? ఇంకా యుద్ధం ఎక్కడ ?"

"ఆ యుద్ధాలు మనం పుట్టకముందే అయిపోయాయి తల్లీ ! ఇది ఇంకోటి. మన ప్రాణాలమీదకు వచ్చిపడింది"

యుద్ధాలెప్పుడూ రాక్షసులకీ, దేవతలకీ అవుతాయని ఆశా బళ్ళో మేష్టారు చెప్పారు. అందేత దానికింకో సందేహం వచ్చింది.

"అమ్మా ! మనం రాక్షసులమా, దేవ తలమా !"

"ఎందుకు !" నిర్ఘాంతపోయింది తల్లి.

"దేవతలమైతే, యుద్ధంలో జయం వస్తుంది"

"మనం దేవతలమే తల్లీ ! ఆ చైనా వాళ్ళే రాక్షసులు" అన్నది.

"చైనావాళ్ళంటే మామయ్యా?" అన్నది ఆశా. పట్నంనించి వచ్చే మామయ్య పొట్టిగా, లావుగా, తెల్లగా వుండేవాడు. చీమ లాంటి సన్నటి కళ్ళు ! చైనావాడిలా వుం టాడు. "మీ పట్నం మామయ్య" అనే వాడు నాన్న. అయితే మామయ్య మంచా డేనే. వచ్చినప్పుడల్లా బోలెడన్ని చాకలెట్లు తెచ్చేవాడు ? ఎగరుకని నాన్న యుద్ధానికి వెళ్ళినట్టు !"

"ఛీ ఛీ ! మామయ్యకాదమ్మా ! చైనా వాళ్ళు. మన శత్రువులు. హిమాలయాలని మంచుకొండలున్నాయి. అక్కడకొచ్చి పోట్లాడుతున్నారు"

"ఓ ! హిమాలయాలా! నాకు తెలుసు లేవే. శివుడి అత్తారిల్లు కదూ" పెద్ద తెలు సున్నదానిలా అన్నది ఆశా.

"అవును"

"అయితే నాన్న ఎందుకు ? అక్కడ బోలెడంతమంది ఋషులూ, దేవతలూ, శివుడూ వున్నారుగా !"

"నాన్న ఒక్కరేకాదమ్మా ! నాన్న లాంటి వాళ్ళు చాలామంది వెళ్ళారు"

"నాన్నకూడా రాముడులాగే వుట్టి పిరికి అన్న మాట. అంత దేముడైన రాముడు రావ ణుడిమీద యుద్ధం చేయటానికి కోతుల్ని సాయం తీసుకువెళ్ళాడు. అమ్మా ! కోతు లయితేనేనయం. మనుష్యులపై కెగిరి కళ్లూ ముక్కూ పీకేస్తాయ్. మనుష్యులేం చేయ లేరు. అందులో మన రిక్షా వీరాయి అయితే ముందే పడిపోతాడు. మొన్న రిక్షా వీరాయిని, ఆ దుండుముక్క భాగవతారు ఇలా తోసే సరికి అల్లా పడిపోయాడు వీరాయి. తల దగ్గిర రక్తం కారింపికూడా. అమ్మా ! చైనా వాళ్ళు భాగవతారులా వుంటారు కదూ"

"అల్లాగే వుంటారు"

"ఆ మంచుకొండల్లో ఎల్లా వుంటారే వాళ్ళు. ఐస్ ఫ్రూట్ ముక్క కాలిమీద పడితే తిమ్మిరెక్కిపోతుంది కదా !" నాన్న మీద జాలివేసింది ఆశాకి.

"వున్నిరగ్గులు కప్పుకుంటారమ్మా వాళ్ళు !"

"అక్కడున్న దేవతలూ, శివుడూ, పార్వతీ కూడా వున్నిరగ్గులు కప్పుకుని స్వెట్టర్లు తొడుక్కోవాలి కాదుటే మరీ"

"కప్పుకుంటారులేవే !"

"అయితే తన కళ్ళముందు ఇంత యుద్ధం జరుగుతున్నా చూస్తూ వూరుకుంటా డేమే శివుడు ? తన మూడోకన్ను తెరిస్తే. వాళ్ళంతా కాలి మసైపోతారు కదే" దాని ప్రశ్నలకి జవాబులు చెప్పటం సామాన్యం కాదు. చెప్పినకొద్దీ అడుగుతుంది.

"అందుకనే తల్లీ ! ఈ పూజలన్నీ, గాఢనిద్రలో వున్న భగవంతుని మేల్కొల్ప టానికే ఈ ఆవేదనా, ఈ ఆరాధనా" ఓహో బాధతో అన్నది తల్లి.

"అయితే శివుడుకూడా నిద్రపోతు న్నాడా ?"

"అవును తల్లీ !"

"శివుడు వెచ్చని రగ్గులో దూరి నిద్ర పోతున్నాడన్నమాట. వెచ్చగా కప్పుకుంటే లేవబుద్ధవుతుందా అమ్మా ! నాకయినా అంతే. బడికి టైమయిపోతున్నా లేవబుద్ధ వదు. ఈ దేముళ్ళందరూ వుట్టి బద్ధకస్తులే బాబూ ! శివుడు యుద్ధం జరుగుతోన్నా, నిద్రలేవడు. మన కోవెల్లో దేముడు పూజార్లు ఎంత గొంతులు చించుకుని పద్యాలు చదివినా నిద్రలేవడు. దేవానందం వాళ్ళ ఏసు ప్రభువుకూడా ప్రతి ఆదివారం గట్టిగా పాటలు పాడినా నిద్రలేవడు"

"తప్పమ్మా ! నిష్ఠగా మనం దేముణ్ణి ప్రార్థించితే తప్పకుండా నిద్రలేస్తాడు. అడి గినవన్నీ ఇస్తాడు" అన్నది ఆశా తల్లి.

"నిజంగానా !"

"నిజం"

ఆశా ఆలోచించింది. తను నిష్ఠగా ప్రార్థించాలన్నమాట. వాకిట్లోకి పోయి నిం చుంది. దేవాలయంలోంచి భక్తులు ఇళ్ళకు పోతున్నారు. చేతుల్లోని పళ్ళేరాల్లో, అరటి పళ్ళు కొబ్బరి చిప్పలూ వున్నాయి. ఆశా కళ్ళు మూసుకొని రెండుచేతులూ జోడిం చింది.

"భగవంతుడా ! త్వరగా నిద్ర లేచిరా ! అక్కడ నాన్న చైనావాడిని చావగొట్టేటట్లు చెయ్యి ! తర్వాత దేవానందం కుంటికాలు బాగుచెయ్యి. మరేమో బళ్ళోని మాష్టారు దేముడుకూడా నయంచెయ్యి ! ముష్టివాళ్ళకి

"నాలుగు కాళ్ళుండి నడవలేని దేది ?"

"కుర్చీ."

దరికీ అన్నాలు పెట్టు ! దేముడా నిద్ర లేచిరా !" అని భక్తిగా ప్రార్థించింది. "ఇవ్వాళ ఒక్కరోజు. రేపు తెల్లవారేసరికి దేముడు నిద్రలేచి, తను కోరిన కోరికలన్నీ తీర్చేస్తాడు" అని అనుకుంది ఆశా. ఆ నిశ్చింతతో ఆరాత్రి హాయిగా నిద్రపోయింది చిన్నారి ఆశా.

మర్నాడు ప్రాతఃకాలం దేవాలయం లోని జేగంటల గణ గణలకి వులిక్కిపడి లేచింది ఆశా. కళ్ళు నులుముకుంటూనే రోడ్డు మీదకు వచ్చింది ఆశా. దేవానందం కుంటు కుంటూ బజారుకు కాబోల్ను పోతున్నాడు అరే ! వాడికాలు బాగుచెయ్యలేదే దేముడు? చూసి ఆశ్చర్యపోయింది ఆశా. తెల్లవారి నందుకు సూచనగా చెట్లమీద పక్షి పిల్లలు ఆకలితో కిచకిచమంటున్నాయి ఆశా గబ గబా పోయి దేవాలయం ఎదుట నించుంది. దేవాలయం సందడిగా వుంది. వచ్చేవాళ్ళు వస్తున్నారు. పోయేవాళ్ళు పోతున్నారు. బిచ్చగాళ్ళు యథాప్రకారం "అమ్మా ధర్మం! బాబూ ధర్మం !" అంటూ అడుక్కున్నారు. వాళ్ళముందు పరిచిన గుడ్డల్లోకి పరీక్షగా చూసింది ఆశా. అన్నం కాదుకదా గుప్పెడు బియ్యమైనా లేవు. గిరుక్కుమని వెనక్కి తిరిగింది ఆశా. ఇంటికి వచ్చేస్తూంటే చెట్టు క్రింద మామ్మ, బలా జీల గంప క్రిందికి దించుకుంటున్నది. ఆశా మనస్సులో ఆఖరి ఆశ మెరిసింది. గబగబా ముసలమ్మ దగ్గరి కెళ్ళి "మామ్మా ! వొచ్చాను" అన్నది మెల్లిగా.

మామ్మ మాట్లాడలేదు.

"నేను వొచ్చాను మామ్మా !" గట్టిగా అరిచింది ఆశా.

"అల్లాగా ; ఎవరూ ? కళ్ళు అనటం లేదే పిల్లా ! అంది మామ్మ. నిర్ఘాంత పోయింది ఆశా. చెముడుతోపాటు గుడ్డి తనంకూడా వచ్చిందన్నమాట. మూగగా ఇంటికి వెళ్ళేసరికి తల్లి వెతుక్కుంటూ గుమ్మంలో నించుంది. ఆశాని చూడగానే-

"ప్రొద్దుటే ఎక్కడికెళ్ళావే తల్లీ ! పాలైనా త్రాగలేదు. ముఖం కడుక్కున్నావా ?" అన్నది ప్రేమగా.

తల్లి కాళ్ళని చుట్టేసుకుని బావురుమన్నది ఆశా. తల్లిని చూడగానే ఎక్కడలేని దుఃఖం వొచ్చింది ఆశాకి. తల్లి తను నిష్ఠగా ప్రార్థిస్తే దేముడు లేచి, అడిగినవన్నీ ఇస్తాడన్నది. అదంతా అబద్ధం అని తేలిపోయింది. అందరికీ తనంటే ముద్దు వస్తుందే ! ఇంటికెవరు వచ్చినా "చిన్నారి ఆశా !" అంటూ తన నెత్తుకుని ముద్దులాడుతూ చేతిలో బోలెడన్ని పిప్పరమెంట్లు పోస్తారే. అల్లాంటి తను దేముడి కెందుకు ముద్దు వేయలేదు. తన కన్న నిష్ఠగా ప్రార్థించిన వాళ్ళెవరు ?

"ఏమిటే తల్లీ ! ఏమయింది ?" గాబరాగా తల్లి ఆశాని ఎత్తుకుని హృదయానికి హత్తుకుంటూ అడిగింది.

ఆశా తల్లి కంఠాన్ని కౌగలించుకుని,

"అమ్మా ! దేముడు నిద్ర లేవలేదే ! నేను పిలిచినా నిద్ర లేవలేదే !" అంటూ బిగ్గరగా ఏడిచేసింది. ●

వసంతోదయం. చల్లగాలికి మామిడి పూత రాలుతున్నది. ఉషఃకన్య, ఉజ్వల ప్రతాపుని ఆగమనాన్ని చూసి,లజ్జతో కందిపోతూ, ఉన్నత పర్వతశ్రేణి మాటుకు సంభ్రమంగాతప్పుకుంటోంది. శీతల నదీజలాల్లో సుస్నాతుడై పైకి లేస్తూన్న సూర్య భగవానుడు ఆకాశం మీద అరుణిమను చూసి, అది తన అనురాగమా ఉషో దేవి నుదుటి కెంపుల కుంకుమా ? అని తెలియక విభ్రమచేతస్కుడౌతున్నాడు.

నది వొడ్డునున్న దేవాలయ ప్రాంగణంలో. కాషాయాంబరాలు ధరించిన భిక్షువుల గుంపు బరువుగా కదుల్తున్నది. దేవాలయం లోంచి సుప్రభాత గానం సమస్త సుప్త ప్రకృతిని చైతన్య పరిచేలా, ఉచ్చస్వరంలో నలుమూలలా శ్రవ్యమవుతున్నది. దేవతా విగ్రహం ముందర నున్న బంగారపు ప్రమిదలో ఆవునేతిని ఆవిరి చేస్తూన్న దీపపు వత్తి నిశ్చలంగా నిద్రపోతున్నట్లు నిలబడ్డ నిలువెత్తు నల్లరాతిలో మలచబడ్డ దేవప్రతిమ వైపు నిర్ఘాంతపోయి చూస్తున్నది. దేవ ప్రతిమ కళ్ళు బంగారపు రేకుతో తాపటం చేయబంవల్ల దీపపు క్రీనీడలు ప్రతిఫలిస్తూ భయంకరమైన వింతకాంతితో వెలుగుతున్నది.

జనం ఎడతెరిపి లేకుండా లోపలకు వస్తున్నారు. తోసుకుంటున్నారు. ఒకరి కాళ్ళు ఒకరు తొక్కుకుంటున్నారు. ప్రక్కన నడిచే వారిమీద విసుక్కుంటున్నారు. తడి బట్టలతో లోపలకొచ్చిన వారిని చూసి,పట్టు బట్టలు కట్టుకొన్నవారు మూతులు ముడుచుకుంటున్నారు.అందమైన యువతుల ముఖాల కోసం కళ్ళజోడుల్లోంచి నడివయసుకళ్ళు, కాప్రిపింగ్ కొనలోంచి యువకుల కళ్ళు చికిలించి చూస్తున్నాయి. ఖరీదైన నగల మెడలకోసం జేబుదొంగల కళ్ళు వెదుకుతున్నాయి.

తన ముందు దృశ్యమానమవుతున్న ఇంత కోలాహలాన్ని గమనించలేని దేవుడు నిశ్చలంగా నుంచునే నిద్రపోతున్నాడు పూజారులు ఎదుట నిలబడి, మైకులో గొంతులు చించుకుని సుప్రభాతం చదువుతూంటే కూడా మేలుకోని దేవుడు ఎక్కడనో మైళ్ళ దూరంలో ఒక అట్టముక్కకి దీప ధూప నైవేద్యాలు పెట్టి మేలుకొమ్మంటే ఆ స్వామికి నిద్ర మెలుకువ వస్తుందా ? దేవాలయంలో ఏకధాటిగా మ్రోగిస్తున్న జే గంటకి గాలిగోపురంలోని పావురాలు ఆకాశంలోకి ఎగిరిపోతున్నాయి.

"అమ్మా !" అన్నది ఆరేళ్ళ ఆశ జన సమూహంలో నలిగిపోతూ.

"ఏమిటి !" అన్నది తల్లి.

"ఏమిటమ్మా ! ఈగోల" అన్నది ఆశ.

"తప్పు తల్లీ ! గోలకాదు. దేముడికి పూజ" అన్నది తల్లి.

"పూజంటే, నువ్వు వంటింట్లో ఫొటోకి చేస్తావ్ అదేనా !"

"ఆఁ అదే" కూతురి తెలివికి మెచ్చుకుంది తల్లి.

"ఎందుకమ్మా పూజ ?"

ఏమని చెప్పాలో తోచలేదు తల్లికి. యుగయుగాలుగా పండితుల మొదలు, పామరులదాకా ఎదుర్కొనే జటిల ప్రశ్న !

"చెప్పవేఅమ్మా ! ఎందుకు పూజ ? పూజంటే ఏమిటి !" పట్టినపట్టు విడువదు ఆశ.

"కోరికలు నెరవేరటానికి పూజలు చేస్తారు. పూజంటే పూవులతో అలంకరించటం. ఫలహారాలు నైవేద్యం పెట్టటం" ఎంతో వివరంగా చెప్పాననుకున్నది తల్లి.

"అమ్మా !" అన్నది ఆశ.

"ఏమిటి ?"

"కోరికలంటే ఏమిటి ?" అని మళ్ళీ వేసింది. దాని ప్రశ్నలకి జవాబులు చెప్పటం రానురానూ అసాధ్యమౌతున్నది తల్లికి. అయినా తనకాలం గడవటానికి వేరుగత్యంతరంలేదు తల్లికి. అంచేత సంభాషణ కొనసాగించింది.

"కోరిక అంటే ఏదైనా కావాలనుకోవటం. నీకు బిళ్ళలూ, బిస్కట్లు తినాలనుంటుందా ? అది కోరికన్నమాట"

"అవి తీరటానికి పూజ చేస్తారా అమ్మా! అయితే నా పుట్టినరోజున నువ్వు నాకు పూజ చేస్తావెందుకని ?"

"ఛీ ! నీ ముఖం ! నీకు నేను పూజ చేయటమేమిటి ?"

"అబద్ధం చెప్పకు అమ్మా ! ఆరోజు నువ్వు నాకు జడలో పూలుకట్టి, బొబ్బట్లు నైవేద్యం పెట్టలేదా !"

కూతురి జ్ఞాపకశక్తికి ఆశ్చర్యపడింది తల్లి. దాని తార్కికశక్తికి విస్తుపోయింది కూడా.

"అయితే నీ కోరికలు నేను తీర్చానా అమ్మా ?" తల్లి తనకి పూజచేసి, నైవేద్యం పెట్టించి మరి. తను తల్లికోరిక తీర్చిందో లేదో మరి ఆపిల్లకి తెలియదూ !

తల్లి కళ్ళవెంట ఆనందబాష్పాలు జలజల రాలాయి.

"నా కోరికలు నువ్వు పెద్దయింతర్వాత తీరుస్తావు తల్లీ" అన్నది ఎత్తుకుని ముద్దు పెట్టుకుంటూ.

"పెద్దంటే ఎంతమ్మా ! నీ అంతా?" అన్నది ఆశ.

"అవును తల్లీ ! చప్పున పెద్దదాన వవ్వాలని దేముడికి దండం పెట్టుకో" అన్నది తల్లి.

"అమ్మా ! దేముడు మాట్లాడడేం ! ఇంత గొడవ గొడవగా వున్నా, చెవులు గింగుర్లు పెట్టుతోన్నా, అల్లాగే నించున్నాడేం ? అదే మా మాష్టరయితే గట్టిగా మాట్లాడే పిల్లని బెంచీ ఎక్కించి, రోజంతా నించోపెట్టేస్తారు" అన్నది.

"దేముడు నిద్రపోతున్నాడు తల్లీ !" అన్నది తల్లి.

"నిద్రపోయేమటుకు ఇంత గొడవకి మెలుకువ రాదేం మరి ! అయితే ముసలాళ్ళ నిద్రా !"

ఆశ నాలుగేళ్ళ పిల్లగా వున్నప్పుడు వాళ్ళ అమ్మమ్మ చనిపోయింది. ఎంత పిలిచినా పలకదేమని ఆశ ఏడవటం ప్రారంభించింది. ఆవిడ నిద్రపోతోందని, ముసలాళ్ళు నిద్రపోతే మరి లేవరనీ చెప్పి తల్లి సముదాయించింది. అది జ్ఞాపకాని కొచ్చింది ఆశకి.

"ఛీ ! తప్పు ! దుడుకుపిల్లా !" విసుక్కుంది తల్లి.

"ఆఁ ! అన్నీ అబద్ధాలేనీవి! అమ్మమ్మలాగే దేముడుకూడా నిద్రపోతున్నాడు. అమ్మమ్మకూడా ఇల్లాగే కళ్ళు తెరిచి నిద్రపోయింది. దేముడూ అంత ధగధగా మెరిసే కళ్ళెట్టుకుని చూస్తూనే నిద్రపోతున్నాడు"

"పూరుకోవే దరిద్రపుపిల్లా !" కోపంగా అన్నది తల్లి. ఆశ ముఖం చిన్నబోయింది.

మృగరాజసం

అప్పుడే నిద్రలేచిన సింహం అలా షికారుగా తిరిగొద్దామని బయలుదేరింది. దోవలో ఒక పెద్దపులి ఎదురైంది. సింహం దాన్ని నిలేసి "నే నెవరో తెలుసా ?" అని అడిగింది.

"ఎవరేమిటిసార్. తమరు మృగరాజులు. పంచాననులు. హర్యక్షులు" అని భట్రాజులా పొగిడింది పెద్దపులి.

"సరే పో" అని, సింహం ముందుకు సాగింది. కొంతదూరం పోయాక తోడేలు ఎదురైంది. దాన్నికూడా సింహం అడిగింది "నే నెవరో తెలుసా ?"

తోడేలు నక్కలా వణికిపోతూ "త-త-తమరు తెలియకేమండి. ఏలినోరు, దొడ్డ పెబువులు రచ్చించాలి" అంది.

"అంచేత వెళ్ళొచ్చు నీదారి న్నువ్వు" అని సింహం ఇంకా ముందుకు పోయింది.

దానికడ్డంగా ఒక ఏనుగు నుంచుంది. సింహం దాని దగ్గిరకెళ్ళి "నే నెవరోన్నా తెలుసా ?" అంది.

ఏనుగు దానికేసి ఓరగా చూసింది. తొండంతో ఉండచుట్టి సింహాన్ని ఎత్తి గిరాటేసింది.

సింహం ఒళ్ళు దులుపుకుంటూ లేచి "తెలియకపోతే తెలియదనచ్చుగా ? ఎత్తి పడెయ్యాలేమిటి బడాయిగా ?" అని తీవిగా వెళ్ళిపోయింది.

అయినా దాని ఆలోచన ఆగిపోలేదు. బహుశా దేముడికి చెముడేమో ! అవును ముమ్మాటికీ దేముడికి చెముడొచ్చి వుంటుంది. తమ ఇంటిదగ్గర బఠాణీలూ వేరుశనక్కాయలు అమ్మే మామ్మకి బ్రహ్మ చెముడు.

"కాణీ బఠాణీ లియ్యి మామా !" అంటుంది తను.

"అరువియ్యను" అంటుంది ఆముసల్దీ. ఇంక నోరెట్టుకుని ఈ పూజారులకన్న ఎక్కువగా అరుస్తుంది ఆశ.

"కాణీ ఇదుగో మామ్మా ! బఠాణీలు ఇయ్యి" అంటుంది గట్టిగా రెండు నయాపైసల నాణెం ఇస్తూ. కాని ఆచిన్న నాణెం అంటే ఒక శతాబ్ధిని పూర్తిచేసిన ఆ ముసలమ్మకి నమ్మకం వుండదు.

"చిన్నకాణీకి ఇయ్యను. పెద్దకాణీ తెచ్చుకో ! చిల్లిది తెచ్చావా అసలు ఒక్కగింజకూడా ముట్టుకోనియ్యను" అంటుంది ఆ ముసల్ది. రెండు నయాపైసల నాణెం కన్న, చిల్లికాణీకన్న పూర్వకాలపు పెద్ద రాగి కాణీ మంచిది అని దాని దృఢ విశ్వాసం.

కాని ఆ కాణీలు ఆశకి ఇంట్లో దొరకవు. అలవాటుగా "కాణీయ్యవే అమ్మా !" అని గునిస్తే తల్లి రెండునయాపైసల నాణెం పడేస్తుంది ఈమామ్మ ఇక్కడపేచీ.

"అమ్మా ! పెద్దకాణీయ్యవే !" అంటుంది తల్లితో. పెద్దకాణీ అంటే తల్లికి అర్థంకాదు అంచేత మళ్ళీ ఇంకోరెండు నయాపైసల నాణెం పడేసి ఆశా గొడవ వదిలించుకుంటుంది. ఆశా మంచిచురుకైనది. అన్నమాటకి అతుకులు పెట్టి పొడిగించుకుంటుంది. అంచేత మళ్ళీ మామ్మ దగ్గరికి వెళ్ళి—

"మామ్మా ! ఇదిగో ఇంకో కాణీ తెచ్చాను. పెద్ద కాణీకి ఈ చిన్న కాణీలు రెండట ! అమ్మ చెప్పింది" అంటుంది. తన తెలివితేటలతో మామ్మని బోల్తాకొట్టించానని మురిసిపోతుంది ఆశా. ఇంక అసలు బేరంలోకి వస్తుంది మామ్మ.

"ఏమిటి అంటావు ? ఈచిన్న కాణీలు పెద్దకాణీకి రెండన్న మాట. నిజమే అన్నమాట ! అయితే మరి మరమరాలు ఇవ్వేళ తేలేదే అమ్మాయ్ !" అంటుంది.

"నీబోడి మరమరా లెవరికి కావాలే మహాతల్లీ ! చప్పగా ఏడుస్తాయ్ ! వెధవ మరమరాలు" అనుకుని.

"బఠా లియ్యి మామ్మా" అని గట్టిగా అరుస్తుంది ఆశా.

అయినా వినబడితేగా !

"వేరుశనక్కాయలు ఈ కాణీ డొక్కులో నాలుగుకూడా పట్టవే పిల్లా ! బఠాణీలు కొలుస్తాను" అని చిన్న సీనారేకు డొక్కుతో. ఆశా గౌనువడిలో బఠాణీ గింజలు పోసి. అమాయకురాలైన పిల్లల్ని మోసపుచ్చటం తనకి యిష్టంలేనట్లు ముఖం పెడుతూ ఒక వేరుశనక్కాయ కూడా కొసరు వేస్తుంది మామ్మ. చెముడుమామ్మ. దానిదగ్గర సీనారేకు డొక్కులు మూడు న్నాయి. కాణీ డొక్కు. అర్ధణా డొక్కు. అణా డొక్కు. అణా డొక్కుతో తనెప్పుడూ కొనుక్కోలా! "మర్చిపోయా కోరికలు దేముడు తీరుస్తాడన్నది కదూ అమ్మ. ఏదన్నా అడగాలి దేముణ్ని. చెముడు దేముణ్ని" అనుకుంది ఆశ. మళ్ళీ మెరుపులా ఇంకో ఆలోచన వొచ్చింది ఆశాకి.

"అమ్మా ! దేముడికి పూజచేస్తావేమిటే ?" అన్నది ఆశ.

"అయిపోయిందమ్మా పూజ." అన్నది తల్లి.

"ఏం నైవేద్యం పెట్టావే ?"

"కొబ్బరికాయి కొట్టాను తల్లీ." అన్నది తల్లి. తల్లిచేతిలో సగం కొబ్బరి చిప్పని చూసింది ఆశా.

"అమ్మా ! కాయకొట్టితే. సగం చిప్పే ఇచ్చేడేమే దేముడు ?"

"పూజారి సగం తీసుకుంటాడు."

"ఇక్కడ చేయొద్దు పూజ అమ్మా ఇక్కడ పూజచేస్తే కాణీలు, కొబ్బరిచిప్పలూ పూజారి తీసుకుంటాడు. ఇంట్లోనే చేసుకుందాం ఏమ్మా" అన్నది. "అల్లాగేలే: పూరుకో" అన్నది తల్లి విసుగా. ఆశా చుట్టూ చూసింది. అంతా అమ్మంత మనుష్యులు తను తల్లి మోకాలిదగ్గర కొచ్చింది. అమ్మంతయితే కాని తను తల్లి కోరికలు తీర్చలేదు.

"అమ్మా ! దేముడు నిద్రపోతున్నాడన్నావు. నిద్రపోటంకాదే ! బహుశా చెముడొచ్చి వుంటుంది" మళ్ళీ మొదలెట్టింది.

"తప్పు. నీ కిల్లాంటి పాడుమాటలు వస్తున్నాయేమి టివ్వాళ ?"

"పోన్లే అమ్మా ! నీకంతా కోపమే. నా మాట అబద్ధం అయితే నువ్వే దేముడితో మాట్లాడు. చూద్దాం"

"ఇంతమందిలో మాట్లాడడు తల్లీ !"

"ఏం మాట్లాడితే ? భయమా !"

"దేముడికి భయమేమిటే వెర్రితల్లీ ! పద బయటికి" అన్నది తల్లి. తల్లితో నడుస్తూందన్న మాటేకాని దాని మనస్సుకి తృప్తిలేదు. ఏవో సంశయాల వలలో ఆ పసి మనస్సు పరిభ్రమిస్తున్నది. ఆలయ ప్రాంగణందాటి బయటకు వచ్చారు తల్లీ, కూతురూ. రోడ్డు కిరుప్రక్కలా బారులుతీరి కూర్చున్న ముష్టివాళ్ళని చూసింది ఆశ.

"అమ్మా ధర్మం ! బాబూ ! నాల్రోజుల బట్టి అన్నం లేదు బాబయ్యా !" అంటూ వచ్చేపోయే వాళ్ళ కాళ్ళకి అడ్డంగా చేతులు చాపుతూ దీనంగా అరుస్తున్నారు. ఆశా తల్లి ఒక రెండు నయాపైసల నాణెం ఒకడికి ముష్టి వేసింది. దానితో మిగిలిన ముష్టివాళ్ళు ఒక్కసారిగా. "తల్లీ ధర్మం" అంటూ ఆశా తల్లిని పోనీకుండా చేతులు చాపటం మొదలెట్టారు.

"ఎందుకే మన్ని ఇల్లా అడుక్కుంటున్నారు. మన్ని అడిగేబదులు దేముణ్ని అడుక్కుంటే పోలా ! దేముడు కోరికలు తీరుస్తాడన్నావు కదా" అన్నది ఆశా.

"అతిగా మాట్లాడకు" అన్నది తల్లి.

ఆశా మాట్లాడలేదు. దానికి బాగా కోపం వచ్చింది. అమ్మ అన్నీ అబద్ధాలు చెప్తుంది. ఎందుకనో, అసలు అందరూ అబద్ధాల పుట్టలే. మాష్టారుమటుకు రాముడు దేముడు అన్నారు. మరి దేముడయితే హాయిగా కోవెల్లో కూర్చోలేక, అడవుల్లోకి పోవటమెందుకు ? పోతేమటుకు అక్కడ పెద్ద మేడ కట్టుకుని వుండకుండా. చెట్లక్రిందా పుట్లపైనా వుండటమేం ! సీతని రావణాసురుడెత్తుకొనిపోతే సుగ్రీవుడిని, ఆంజనేయుడిని బ్రతిమాలుకుని సైన్యాన్ని తయారుచేసుకుంటే కాని యుద్ధంచేయలేకపోయాడు. మేష్టారు ఇన్ని సందేహాలూ తీర్చలేరు.

పుత్తినే "రాముడు" దేముడు అంటాడు. "రామనామతారకం భక్తిముక్తిదాయకం"అని ప్రతీ ఆదివారం భజన చేస్తారు. తన ప్రక్క ఇంటి దేవానందం "ఏసుప్రభువు భగవంతు" డంటాడు. ఆయన ఎల్లాంటి రోగులైనా చేతితో తాకగానే వాళ్ళ రోగాలన్నీ మటుమాయమయ్యేవిట ! మరి తన కుంటికాలు మామూలు కాలుగా చేయమని అడక్కూడదూ ! ఏమిటో వాళ్ళకి ఏమీ జ్ఞాపకాలు వుండవు కాబోల్ను. ఆ దేముడు మాట్లాడేప్పుడే అన్నీ అడిగి తీసుకోవాలి. మళ్ళీ నిద్రలో పడితే ఎంతకీ లేవడు. అమ్మ నిద్రపోకుండానే తనకి కావల్సినన్ని చేగోడీలు అడిగి దాచుకోవటంలా ? అల్లాగే దేముడు మెలుకువగా వున్నప్పుడే మనకి కావల్సినవన్నీ అడిగి తీసుకోవాలి. కోరికలన్నీ తీరుస్తాడన్నదిగా అమ్మ ! ఇంటికి వచ్చాక ఆశా అరుగుమీద నించుంది. తల్లి లోపలికిపోయి పని చూసుకుంటున్నది. ఆకలిగా వున్న సూర్యుడు ఆకాశంమీదికి తొందర తొందరగా పరుగెడుతున్నాడు. పోస్టుమేన్ ఒక కవరు ఆశా నించున్న అరుగు మీదకు గిరాటెట్టి సైకిలుమీద తుర్రుమని వెళ్ళిపోయాడు. కవరు చేతిలో పుచ్చుకుని లోపలికి పరుగెత్తింది ఆశా.

"అమ్మా! అమ్మా! ఉత్తరం వచ్చిందే" అన్నది. తల్లి ఆత్రంగా కవరువిప్పి చదువుకుంది. సంతోషంతో ఆమె కళ్ళు మెరిశాయ్.

"ఎవరు వ్రాశారే ఉత్తరం ?"

"మీనాన్న !"

ఆశాకి జ్ఞాపకం వచ్చింది. ఒకరోజు తెల్లవారకట్టే లేచి నాన్న ఎక్కడికో వెళ్ళిపోయాడు. నాన్న వెళ్ళిపోతుంటే అమ్మ నాన్న కాళ్ళకు వంగి దండం పెట్టింది.

"నాన్న ఎక్కడికెళ్ళారే ?"

"యుద్ధం చేయటానికి వెళ్ళారు తల్లీ !" అన్నది. తల్లికి వంట చేయటం అయిపోయిందని గమనించింది ఆశా. ఇంక స్థిమితంగా మాట్లాడుతుంది.

"రామరావణ యుద్ధం అయిపోయింది కదే ? ఇంకా యుద్ధం ఎక్కడ ?"

"ఆ యుద్ధాలు మనం పుట్టకముందే అయిపోయాయి తల్లీ ! ఇది ఇంకోటి. మన ప్రాణాలమీదకు వచ్చిపడింది"

యుద్ధాలెప్పుడూ రాక్షసులకీ, దేవతలకీ అవుతాయని ఆశా బళ్ళో మేష్టారు చెప్పారు. అంచేత దానికింకో సందేహం వచ్చింది.

"అమ్మా ! మనం రాక్షసులమా, దేవతలమా !"

"ఎందుకు !" నిర్ఘాంతపోయింది తల్లి.

"దేవతలమైతే, యుద్ధంలో జయం వస్తుంది"

"మనం దేవతలమే తల్లీ ! ఆ చైనా వాళ్ళే రాక్షసులు" అన్నది.

"చైనావాళ్ళంటే మామయ్యా?" అన్నది ఆశా. పట్నంనించి వచ్చే మామయ్య పొట్టిగా, లావుగా, తెల్లగా వుండేవాడు. చీమలాంటి సన్నటి కళ్ళు ! చైనావాడిలా వుంటాడు. "మీ పట్నం మామయ్య" అనేవాడు నాన్న. అయితే మామయ్య మంచాడే. వచ్చినప్పుడల్లా బోలెడన్ని చాకలెట్లు తెచ్చేవాడు ! ఎందుకని నాన్న యుద్ధానికి వెళ్ళినట్లు !"

"ఛీ ఛీ ! మామయ్యకాదమ్మా ! చైనా వాళ్ళు. మన శత్రువులు. హిమాలయాలని మంచుకొండలున్నాయి. అక్కడకొచ్చి పోట్లాడుతున్నారు"

"ఓ ! హిమాలయాలా! నాకు తెలుసులేవే. శివుడి అత్తారిల్లు కదూ" పెద్ద తెలుసున్నదానిలా అన్నది ఆశా.

"అవును"

"అయితే నాన్న ఎందుకు ? అక్కడ బోలెడంతమంది ఋషులూ, దేవతలూ, శివుడూ వున్నారుగా !"

"నాన్న ఒక్కరేకాదమ్మా ! నాన్నలాంటి వాళ్ళు చాలామంది వెళ్ళారు"

"నాన్నకూడా రాముడులాగే వుట్టి పిరికి అన్నమాట. అంత దేముడైన రాముడు రావణుడిమీద యుద్ధం చేయటానికి కోతుల్ని సాయం తీసుకువెళ్ళాడు. అమ్మా ! కోతులయితేనేనయం. మనుష్యులపై కెగిరి కళ్ళూ ముక్కూ పీకేస్తాయ్. మనుష్యులేం చేయలేరు. అందులో మన రిక్షా వీరాయి అయితే ముందే పడిపోతాడు. మొన్న రిక్షా వీరాయిని ఆ దుండుముక్క భాగవతారు ఇలా తోసేసరికి అల్లా పడిపోయాడు వీరాయి. తల దగ్గిర రక్తం కారింది కూడా. అమ్మా ! చైనా వాళ్ళు భాగవతారులా వుంటారు కదూ"

"అల్లాగే వుంటారు"

"ఆ మంచుకొండల్లో ఎల్లా వుంటారే వాళ్ళు. ఐస్ ఫ్రూట్ ముక్క కాలిమీద పడితే తిమ్మిరెక్కిపోతుంది కదా !" నాన్న మీద జాలివేసింది ఆశాకి.

"వున్నిరగ్గులు కప్పుకుంటారమ్మా వాళ్ళు !"

"అక్కడున్న దేవతలూ, శివుడూ, పార్వతీ కూడా వున్నిరగ్గులు కప్పుకుని స్వెట్టర్లనీను తొడుక్కోవాలి కాదుటే మరీ"

"కప్పుకుంటారులేవే !"

"అయితే తన కళ్ళముందు ఇంత యుద్ధం జరుగుతున్నా చూస్తూ వూరుకుంటాడేమే శివుడు ? తన మూడోకన్ను తెరిస్తే, వాళ్ళంతా కాలి మసైపోతారు కదే" దాని ప్రశ్నలకి జవాబులు చెప్పటం సామాన్యం కాదు. చెప్పినకొద్దీ అడుగుతుంది.

"అందుకనే తల్లీ : ఈ పూజలన్నీ. గాఢనిద్రలో వున్న భగవంతుని మేల్కొల్పటానికే ఈ ఆవేదనా, ఈ ఆరాధనా" ఎంతో బాధతో అన్నది తల్లి.

"అయితే శివుడుకూడా నిద్రపోతున్నాడా ?"

"అవును తల్లీ !"

"శివుడు వెచ్చని రగ్గులో దూరి నిద్రపోతున్నాడన్నమాట. వెచ్చగా కప్పుకుంటే లేవబుద్ధవుతుందా అమ్మా ! నాకయినా అంతే. బడికి టైమయిపోతున్నా లేవబుద్ధవదు. ఈ దేముళ్ళందరూ పుట్టి బద్ధకస్తులే బాబూ ! శివుడు యుద్ధం జరుగుతోన్నా, నిద్రలేవడు. మన కోవెల్లో దేముడు పూజార్లు ఎంత గొంతులు చించుకుని పద్యాలు చదివినా నిద్రలేవడు. దేవానందం వాళ్ళ ఏసు ప్రభువుకూడా ప్రతి ఆదివారం గట్టిగా పాటలు పాడినా నిద్రలేవడు"

"తప్పమ్మా : నిష్ఠగా మనం దేముణ్ణి ప్రార్థించితే తప్పకుండా నిద్రలేస్తాడు. అడిగినవన్నీ ఇస్తాడు" అన్నది ఆశా తల్లి.

"నిజంగానా !"

"నిజం"

ఆశా ఆలోచించింది. తను నిష్ఠగా ప్రార్థించాలన్నమాట. వాకిట్లోకి పోయి నిలుచుంది. దేవాలయంలోంచి భక్తులు ఇళ్ళకు పోతున్నారు. చేతుల్లోని పళ్ళెరాల్లో, అరటి పళ్ళు కొబ్బరి చిప్పలూ వున్నాయి. ఆశా కళ్ళు మూసుకొని రెండుచేతులూ జోడించింది.

"భగవంతుడా ! త్వరగా నిద్ర లేచిరా ! అక్కడ నాన్న చైనావాడిని చావగొట్టేటట్లు చెయ్యి ! తర్వాత దేవానందం కుంటికాలు పోగొట్టు. మరేమో బట్టల మాష్టు చెముడుకూడా నయంచెయ్యి ! ముష్టివాళ్ళకు

"నాలుగు కాళ్ళుండి నడవలేనిదేది ?"

"కుర్చీ."

దరికీ అన్నాలు పెట్టు ! దేముడా నిద్ర లేచినా !" అని భక్తిగా ప్రార్థించింది. "ఇవ్వాళ ఒక్కరోజు. రేపు తెల్లవారేసరికి దేముడు నిద్రలేచి. తను కోరిన కోరికలన్నీ తీర్చేస్తాడు" అని అనుకుంది ఆశా. ఆ నిశ్చింతతో ఆరాత్రి హాయిగా నిద్రపోయింది చిన్నారి ఆశా.

మర్నాడు ప్రాతఃకాలం దేవాలయం లోని జేగంటల గణ గణలకి వులిక్కిపడి లేచింది ఆశా. కళ్ళు నులుముకుంటూనే రోడ్డు మీదకు వచ్చింది ఆశా. దేవానందం కుంటు కుంటూ బజారుకు కాబోల్ను పోతున్నాడు అరే ! వాడికాలు బాగుచెయ్యలేదే దేముడు? చూసి ఆశ్చర్యపోయింది ఆశా. తెల్లవారి నందుకు సూచనగా చెట్లమీద పక్షి పిల్లలు ఆకలితో కిచకిచమంటున్నాయి ఆశా గబ గబా పోయి దేవాలయం ఎదుట నిలుచుంది. దేవాలయం సందడిగా వుంది. వచ్చేవాళ్ళు వస్తున్నారు. పోయేవాళ్ళు పోతున్నారు. బిచ్చగాళ్ళు యథాప్రకారం "అమ్మా ధర్మం! బాబూ ధర్మం !" అంటూ అరుస్తున్నారు. వాళ్ళముందు పరిచిన గుడ్డల్లోకి పరీక్షగా చూసింది ఆశా. అన్నం కాదుకదా గుప్పెడు బియ్యమైనా లేవు. గిరుక్కుమని వెనక్కి తిరిగింది ఆశా. ఇంటికి వచ్చేస్తూంటే చెట్టు క్రింద మామ్మ. బరువు జోలె గంప క్రిందికి దింపుకుంటున్నది. ఆశా మనస్సులో ఆఖరి ఆశ మెరిసింది. గబగబా ముసలమ్మ దగ్గరి కెళ్ళి "మామ్మా ! వొచ్చాను" అన్నది మెల్లిగా.

మామ్మ మాట్లాడలేదు.

"నేను వొచ్చాను మామ్మా !" గట్టిగా అరిచింది ఆశా.

"అల్లాగా ; ఎవరూ ? కళ్ళు ఆనటం లేదే పిల్లా ! అంది మామ్మ. నిర్ఘాంత పోయింది ఆశా. చెముడుతోబాటు గుడ్డి తనంకూడా వచ్చిందన్నమాట. మూగగా ఇంటికి వెళ్ళేసరికి తల్లి వెతుక్కుంటూ గుమ్మంలో నించుంది. ఆశాని చూడగానే-

"ప్రొద్దుటే ఎక్కడికెళ్ళావే తల్లీ ! పాలైనా త్రాగలేదు. ముఖం కడుక్కున్నావా ?" అన్నది ప్రేమగా.

తల్లి కాళ్ళని చుట్టేసుకుని బావురుమన్నది ఆశా. తల్లిని చూడగానే ఎక్కడలేని దుఃఖం వొచ్చింది ఆశాకి. తల్లి తను నిష్ఠగా ప్రార్థిస్తే దేముడు లేచి. అడిగినవన్నీ ఇస్తాడన్నది. అదంతా అబద్ధం అని తేలిపోయింది. అంద రికీ తనంటే ముద్దు వస్తుందే ! ఇంటికెవరు వచ్చినా "చిన్నారి ఆశా !" అంటూ తన నెత్తుకుని ముద్దులాడుతూ చేతిలో బోలెడన్ని పిప్పరమెంట్లు పోస్తారే. అల్లాంటి తను దేముడి కెందుకు ముద్దు వేయలేదు. తన కన్న నిష్ఠగా ప్రార్థించిన వాళ్ళెవరు ?

"ఏమిటే తల్లీ ! ఏమయింది ?" గాబ రాగా తల్లి ఆశాని ఎత్తుకుని హృదయానికి హత్తుకుంటూ అడిగింది.

ఆశా తల్లి కంఠాన్ని కౌగలించుకుని,

"అమ్మా ! దేముడు నిద్ర లేవలేదే ! నేను పిలిచినా నిద్ర లేవలేదే !" అంటూ బిగ్గరగా ఏడిచేసింది.

మహామహుల మొదటి మాటలు

పువ్వు పుట్టగానే పరిమళించవచ్చు గాని, గొప్పవాళ్ళు పుట్టగానే వారి గొప్పదనం గుబాళిస్తుందా ?

గొప్పవాళ్ళు పుట్టగానే మాట్లాడగలిగితే ఏం మాట్లాడి వుంటారో, అలాగే వాళ్ళు చనిపోయేక్షణంలో ఏం మాట్లాడి వుంటారో ఊహించి వ్రాయడం ఒక సారస్వతక్రీడ. దీన్ని కొంతకాలం క్రిందట "సూటేట్స్ మన్" వారపత్రిక పోటీగా నిర్వహించింది.- ఈ క్రీడలో విశేషమేమిటంటే; ఒక్క వాక్యంలో ఆ ప్రముఖుల జీవితంలోని విశే షమంతా వ్యక్తంకావాలి.

తెలుగు రచయితలలో ప్రసిద్ధులైన కొం దరి మొదటి మాటలను బుచ్చిబాబుగారు ఊహించి వ్రాశారు. (కొందరి చివరి మాట లుకూడా వారు వ్రాశారు, ఉదాహరణకు : కందుకూరి వీరేశలింగం : "ఒక్క వెధవని వుండనివ్వను—స్వర్గంలో." గిడుగు రామ మూర్తి : "నేను మరణించుచుంటినని ఏ ప్రజయున్ దలంపనవసరంబులేదు' అని అనను నే చస్తున్నా. దగ్గరగారా. చెవులో చెప్పు. పైన అరసున్న లుంటాయా ?"— అడివి బాపిరాజు : "కథ కంచికి, మనమిం టికి.")

ఇక కొందరి మొదటిమాటలు. రాయ ప్రోలు సుబ్బారావు ; "అ-ఆ-ఇ-ఈ-ఉ-ఊ-" (పుట్టగానే ఆయన ఏడుపు.)

దీని కాధారం :

"ఏ ప్రఫుల్ల పుష్పంబుల నీశ్వరునకు-పూజసల్పితినో యిందు పుట్టినాడ - కలద యేని పునర్జన్మ కలుగుగాక- మధుర మధు రంబయిన తెన్గు మాతృభాష"

విశ్వనాథ సత్యనారాయణ : (మంత్ర సానిని సంబోధిస్తూ,)

"ఓహో కిన్నెరసాని !"

(జననం శీతాకాలంలో అయితే)

"హా హా హూహూ"

ముని మాణిక్యం : "మనం ఇంకా ఇరవై యేళ్ళదాకా చీర కొనక్కర్లేదు.— కాంతానికి."

చలం ; (మంత్రసానితో) పో, లేచి పో. డాక్టర్‌తో

మొక్కపాటి ; "బార్ - బార్ - బార్" (అని ఏడుపు) మూలం ; బారిష్టర్ పార్వ తీశం.

నండూరి సుబ్బారావు : "ఎనక జల్మ ములో ఎవరమో"

ఉన్నవ లక్ష్మీనారాయణ ; (చుట్టూ చూసి) "ఏమిటీ మాలపల్లి ?"

భమిడిపాటి కామేశ్వరరావు :

"ఎప్పుడూ ఇంతే."

కృష్ణశాస్త్రి : "వెక్కి వెక్కి రోదిం తును విసుపులేక — ఏడ్వలేక ఏడ్వలేక ఏడ్చుచుంటి."

* * *

ఇంతకీ బుచ్చిబాబుగారు పుట్టినప్పుడు ఏమని వుంటారు?:(అప్పటికి రేడియో వుండి వుంటే) "ఏమిటీ కాకి గోల ?"



చావు

కె. వివేకానందమూర్తి

శ్రీనివాసులుకి చచ్చిపోదా మనిపించింది. ఇదివరకు ఇలా చాలాసార్లు అనిపించింది. కష్టమొచ్చి నప్పుడల్లా శ్రీనివాసులు చచ్చి పోదామనుకుంటాడు. అతనికి కష్టాలు చాలాసార్లు వచ్చాయి. అందుకని చాలాసార్లు చచ్చిపోదా మనుకున్నాడు.

శ్రీనివాసులు మానసికంగా చచ్చిపోయి నప్పుడు. శారీరకంగా చచ్చిపోదామను కుంటాడు. కష్టాలొచ్చి నప్పుడల్లా శ్రీనివాసులు మానసికంగా చచ్చిపోతాడు. చావు మీది కోరికని అతనికి మనస్సు నేర్పింది. శ్రీనివాసులి మనస్సుని అస్తమానం కష్టం భయపెడుతూ వుంటుంది. కష్టంపెట్టే కష్టాలు భరించలేక అతని మనస్సు పరిష్కారం వెదుక్కున్నప్పుడు శ్రీనివాసులికి 'చావు' సమాధానంగా నిలుస్తుంది.

శ్రీనివాసులికి ఇప్పుడు బ్రతుకు చావులా వుంది. అతనికి చచ్చిపోవాలని లేదు. బ్రతకాలని వుంది. బ్రతుకుతుంటే చచ్చిపోయినట్టు వుంది కనుక చచ్చిపోతే బ్రతకవచ్చు ననిపించింది శ్రీనివాసులికి.


శ్రీనివాసులుకి చిన్నప్పట్నుంచీ డాల్ఫిన్స్ నోస్ కొండ మీదినుంచి ఒకసారి సరదాగా దూకాలని. సినిమా రిజర్వుడు క్లాసుకి ఒకసారి వెళ్ళాలని, ముష్టివాడి వేషం వెయ్యాలని, 'షాంపేన్' తాగాలని, రాజకీయ నాయకుడు అవ్వాలని కోరికలుండేవి. పెళ్ళవక మునుపు రెండోదీ, మూడోదీ తీర్చేసుకున్నాడు. భయంవేసి నాలుగోపని చెయ్యలేదు. ఆఖరిపనికి అందుబాటులో లేదు కనుక ఆశ అనుకున్నాడు - తీరేవన్నీ కోరికలు, తీరనివన్నీ ఆశలు - అనుకుంటాడు శ్రీనివాసులు ఎప్పుడూ.

మొదటిది మాత్రం ఆలోచించవలసిన విషయం అనుకుని జ్ఞాపకంగా అట్టేపెట్టుకున్నాడు.

శ్రీనివాసులు చాలాసార్లు శవాల్ని, శవాలుగా మనుష్యుల్ని తయారుచేసే డాక్టర్లనీ, శవాలుమోసే వాళ్ళని చూశాడు. అలా చూడగా చూడగా అతనికో ఆలోచన తట్టింది. శవాలు రాజకీయ నాయకులైనట్టు, అవి సప్తకట్ల సవారీ అనబడే పల్లకీలో పడుకున్నట్టు. వాటిని మోసేవాళ్ళు రికమెండేషన్లు స్వంతం చేసుకున్న చుట్టాలు, దగ్గిర మిత్రులు అయినట్టు - వాటిని తయారుచేసే డాక్టర్లంతా కాబోయే రాజకీయ నాయకులైనట్టూ తోచింది అతనికి. అందుకని చచ్చిపోతే చివరి ఆశ నెరవేరుతుంది అనిపించింది. మొదటికోరిక తీర్చుకుంటే చివరి ఆశ, కోరికగా మారిపోతుందని కూడా తోచింది. చివరి ఆశ ఫలిస్తే ఇక నాలుగో దానికి లోటులేదు. అలా అతని జీవితం కోరికలనేవి మిగలకుండా హాయిగా అంతమవుతుందని కూడా అనుకున్నాడు.

నిశ్చయంగా శ్రీనివాసులు చచ్చిపోవాలనుకున్నాడు. లేక నిశ్చయంగా శ్రీనివాసులు బ్రతుకు ప్రారంభించా లనుకున్నాడు.

పదేళ్ళ క్రితంనుంచీ అతని జీవితంలో చావు' అన్న పదానికి 'ప్రాముఖ్యత' ఎక్కువైంది. దానికి కారణం-పదేళ్ళ క్రితం శ్రీనివాసులికి పెళ్ళయింది. ఇలా పదేళ్ళుగా అతన్ని కష్టాలు. మనస్సు. చావు మీది కోరికా క్షోభపెడుతున్నాయి. వీటిల్లో ఏ వొక్కటి చంపుకోవాలన్నా తను చచ్చిపోవాలి. ఈ పదేళ్ళ జీవితం శ్రీనివాసులికి చెప్పిన నిర్వచనం యిది : పెళ్ళితో ఆడదాని జీవితము, మగవాడి కష్టములు ప్రారంభమగును అని. అతని కష్టాలు ఎప్పుడూ అతని సహనాన్ని కొలుస్తాయి. సహనం ఆవి



వాళ్ళకంటె ఎక్కువగా మగవాళ్ళకే ఖంసని నిరూపించగలడు శ్రీనివాసులు.

శ్రీనివాసులి భార్య పేరు జానకి. సన్నంగా, అల్పంగా, ఎండుటాకులా వుంటుంది. కుంపటి అంటించడంలో సర్వస్వం తగులబడి ఖర్చయిపోయిన కాగితపు అవశిష్టంలా ఉంటుంది- పదేళ్ళ సంసారం వెలిగించడంలో, పిల్లల్ని కనడంలో ఖర్చయిపోయిన జానకి. ఎవరో పేరు తెలియని వ్యక్తి, ఓ పన్నటి కర్రస్టాండు మీద చీరా, రవికా పారేసుకుపోయినట్టు ఉంటుంది. శ్రీనివాసులి భార్య జానకి, పదేళ్ళ సంసారంలో ఆమె ఎనిమిదేళ్ళ తొమ్మిదిమంది పిల్లల్ని కనడానికి, మిగిలిన రెండేళ్ళ రోగాల్ని భరించడానికి వాడుకుంది. ఎప్పుడేనా రోచనప్పుడు దేవుడు, శ్రీనివాసులి కష్టాల్లో ఓ కష్టాన్ని పిలిచి "కష్టమా ! కష్టమా ! ఆ తొమ్మిదిమంది పిల్లల్ని శ్రీనివాసులి పెళ్ళాం ఆ జానకే కన్నదా ?" అని అడిగితే — కష్టం 'దేవుడితో' "నీకేం మతిలేదా ? సన్నంగా, అల్పంగా, ఎండుటాకులా దాజకీయ వాయకుడి మంచితనంలా ఉన్న జానకి తొమ్మిదిమంది పిల్లల్ని కంటుందని ఎలా ఊహించావ్ ? ఆ పిల్లల్ని శ్రీనివాసులే కన్నాడు" అంటుంది. ఇవేం పట్టని శ్రీనివాసులు వాళ్ళ అవిణ్ణి చూసుకొన్నప్పుడల్లా ప్రత్యేకం దూరప్రయాణాల కోసం గవర్నమెంటు వారు డీలక్స్ బస్సుని కేటాయించినట్టు, ప్రత్యేకం పిల్లల్ని కనడంకోసం వాళ్ళావిణ్ణి దేవుడు ఈ భూమ్మీద పుట్టించా

డని అనుకుంటాడు. వాళ్ళ పెరట్లో నంది వర్ధనం మొక్క పువ్వుల్ని పూసినట్లు, ఎడ మధ్యాహ్నవేళ నడినెత్తిని సూర్యుడు నిలబడి ఎండకాసినట్లు తన భార్య రోగాలమధ్య నిలబడి పిల్లల్ని కంటోంది అని కూడా అనుకుంటాడు.

శ్రీనివాసులు గుమాస్తా. శ్రీనివాసులు గుమాస్తా అవడంకంటే, శ్రీనివాసులి పేరు గుమాస్తా అంటే బాగుంటుంది. గుమాస్తా పేరు శ్రీనివాసులు అంటే ఇంకా బాగుంటుంది. ఇట్లు గుమాస్తా అయిన శ్రీనివాసులికి రక్తం మాంసం లేవు. వాటిని అతని టేబులుమీద రోజూ ప్రత్యక్షమయ్యే కాగితాలు, అతని హెడ్ గుమాస్తా కలిసిస్వాహా చేశాయి. ఇప్పుడు శ్రీనివాసులుకి మిగిలినవి ఒక ఎముకల బోగు, ఒక గుండె.

శ్రీనివాసులికి పెళ్ళాం, పిల్లలూ తప్ప మరెవ్వరూ లేరు. రెండు నెలల క్రితం వరకూ అతనికి ఒక ముసిలి అమ్మమ్మగారు, ఒక పడుచు మరదలు ఉండేవారు. రెణ్ణెళ్ళక్రితం ముసిలి అమ్మమ్మగారు రోగం బాధ పడలేక ప్రాణాలు తీసుకుని చచ్చిపోయింది- పడుచు మరదలు పడుచు తనం బాధపడలేక ప్రాణాలు తీసుకుంటానని యింట్లో చెప్పి ప్రకాశాన్ని తీసుకుని లేచిపోయింది. పదేళ్ళక్రితం ఆలోచన తన భార్యకు కలగలేదని శ్రీనివాసులు వాపోయాడు. ఇక ఇప్పుడు శ్రీనివాసులు, రోగిష్టి పెళ్ళాం, తొమ్మిది మంది పిల్లలూ తప్ప ఎవ్వరూ లేరు ఆ కొంపలో.

* * *

తెల్లవారింది. క్రితం రాత్రి శ్రీనివాసులి భార్య సన్నంగా, అల్పంగా, ఎండుటాకులా వున్న జానకి పడే ప్రసవ వేదన చూసి ఆకాశం గుండె పగిలేలా ఏడిచింది.

రాత్రంతా కుంభవృష్టి కురిసింది.

ఈరోజు — నిన్న పన్నెండు దాటిం తర్వాత-పదోసారిగా నొప్పులుపడి చచ్చిన పిల్లవాణ్ణి కని, చచ్చిపోయింది జానకి. శ్రీనివాసులి భార్య. భార్య బ్రతికున్నప్పుడల్లా అతనికి నిండుతనం తెలిసేది కాదు. ఇప్పుడు భార్య పోయింతర్వాత అతనికి నిండుతనం అర్థం తెలుస్తోంది. మనస్సు వెలితిని గుర్తు చేస్తోంది.

పదహారేళ్ళ సిగ్గుపడే జానకి అతని కళ్ళ ముందు మెదిలింది. కార్యంనాడు ఊపిరి సలపనివ్వకుండా కళ్ళల్లో కళ్ళు, మొహంలో మొహం పెట్టి కౌగలించుకొన్నప్పుడు—సంతోషం, తృప్తి, కృతజ్ఞతా, అనురాగం, మేళవించిన నవ్వు గుండెల్లోకి విసిరిన జానకి నొప్పుల్తో బాధపడుతూ తనకేసి పొడి పెదవులతో జాలిగా చూసిన జానకి, తనకి టైఫాయిడ్ వచ్చినప్పుడు నిద్రకి దూరమయిపోయిన జానకి, ఎప్పుడూ —ఏమీ, కనీసం మల్లె పువ్వులైనా కొనిపెట్టమని అడగని జానకి, నిన్నరాత్రి కన్నీరు, కష్టాలు తనకు మిగిల్చి పోతున్నానని బాధపడిన జానకి, తెల్లవారకట్ల చచ్చిన పిల్లవాణ్ని చూసినప్పుడు మాతృహృదయం పగిలిపోగా ఏడవడానిక్కూడా ఓపిక లేక ఎండిన కళ్ళతో జాలి చూపు చూసిన జానకి, సుఖం అంటే తెలియని జానకి, సన్నంగా, అల్పంగా, ఎండుటాకులావున్న జానకి, పదేళ్ళ తనతో కలిసి బ్రతికిన జానకి, తన



జానకి ఇక లేదు. తన భార్య, తన సర్వస్వం తనకు తృప్తినిచ్చిన కష్టం ఇకలేను. నిన్నటి అనుభవం ఈరోజు చావు లేని ఓ బలమైన పెద్ద జ్ఞాపకమైపోయింది. కంటి ముందు కనిపించేది మనస్సులో మిగిలిపోయింది. జానకి చావులో ఇంత బలం వుందా? అనిపించింది శ్రీనివాసులికి.

శ్రీనివాసులు తెల్లవారేవరకూ, వర్షం వెలిసేవరకూ భోరున ఏడిచాడు. తెల్లవారింది. వర్షం వెలిసింది. శ్రీనివాసులు ఏడుపు మానేశాడు. ఒకసారి వీధి అరుగు మీదికొచ్చి చుట్టూ చూశాడు. అప్పుడే తలంటుపోసుకుని, జుట్టు విరబోసుకుని వొళ్ళు విరుచుకున్న స్త్రీలా వుంది ఊరు. పెళ్ళయిన కొత్తలో ఒక్కసారి మాత్రం వాళ్ళావిడ అలా కనిపించింది. మనిషిగా శ్రీనివాసులు సంతోషపడిన రోజు అదొక్కటే.

శ్రీనివాసులి గుండె పగిలింది.

లోపలికివెళ్ళి పెళ్ళాం శవంమీద పడి మళ్ళా భోరు భోరున ఏడిచాడు. సాయంకాలమైంది. అంతా అయిపోయింది.

పిల్లలు ఏడుస్తున్నారు హృదయవిదారకంగా.

శ్రీనివాసులు చచ్చిపోదామనుకున్నాడు. నిజంగా చచ్చిపోదామనుకున్నాడు. నిన్న రోగిష్టి పెళ్ళాం బాధచూసి చచ్చిపోదామనుకున్నాడు. ఇప్పుడు బ్రతకలేక చచ్చిపోదామనుకుంటున్నాడు. తనొక్కడూ తొమ్మిది మంది పిల్లల్తో. నెలకు డెబ్భై అయిదు రూపాయల జీతంతో సంసారాన్ని ఎలా నెట్టుకురావడం? తను బ్రతకలేక చావాలి. అందుకని చచ్చిపోయి బ్రతుకుదామనుకుంటున్నాడు.

చచ్చిపోయేముందు ఎప్పుడూ కాఫీ త్రాగి చచ్చిపోవాలనుకుంటాడు శ్రీనివాసులు. అలాంటి చావుకాఫీలు శ్రీనివాసులి గొంతులో పదేళ్ళుగా పాతబడిపోయాయి.

కొచ్చిన్ కేఫ్‌లో స్ట్రాంగ్ కాఫీత్రాగి సముద్రం వొడ్డున నడుస్తున్నాడు.

సముద్రం వొడ్డు వంపరలు ఎప్పుడూ అతనికి భార్య శరీరాన్ని గుర్తుచేస్తాయి. అందుకే అతనికి బీచ్ అంటే ఎంతో ఇష్టం. కెరటాలు వొడ్డుమీద పడుతున్నాయి. రోగాల భార్య మీదపడి వేధించినట్టు మనస్సులో బాధ కదిలి కళ్ళల్లో నిర్వేదం నింపింది. తలెత్తి చూస్తే నల్లటి డాల్ఫిన్స్‌నోస భయానికి ప్రతిరూపంలా, పరాయి లోకానికి హాన్ బోర్డులా కనిపించింది.

డింగీ ఎక్కి, పాయదాటి కొండదిగువ భాగం చేరుకున్నాడు.

గతం మనస్సుని మింగి, కాలాన్ని తినివేసింది. పొద్దు వాలింది. శ్రీనివాసులు శిఖరానికి వచ్చేసరికి లైట్‌హౌస్ తళుక్కున మెరిసింది. ఒక్కక్షణం మనస్సులో పిల్లలు మెదిలారు. జేబులో రూపాయి కాసు. కొంత చిల్లర వుంది. అయ్యో! పిల్లలకేనా యిచ్చాను కాదు అనుకున్నాడు. కొండ అంచుకు వచ్చేశాడు. కళ్ళు మూసుకుని, చిన్నప్పుడు హైస్కూల్లో హైజంపు దూకినట్టు గెంతితే, రెండు నిముషాలు శరీరం పిచ్చిగా పరిభ్రమించి, మరోక్షణంలో కాఫీని, బీచ్‌ని, పిల్లల్ని వదిలిపెట్టేస్తుంది. మరచిపోతుంది. తన మొదటి కోరికకి అవకాశం యిన్నాళ్ళకి. శ్రీనివాసులు నిజంగా చచ్చిపోదామనుకొన్నాడు. మరోక్షణంలో చచ్చిపోతా ననుకున్నాడు.

సన్నటి గాలి రివట రివ్వున వీచి, ఏదేళ్ళ తర్వాత జీవితంలో ఆఖరిసారిగా సుఖాన్ని గుర్తుచేసింది.


ఒక్కక్షణం ఎందుకో తెలియని భయం వేసింది.

శ్రీనివాసులు కళ్ళుమూసుకున్నాడు.

ఉన్నట్టుండి ఓ చల్లటి చెయ్యి మెడ పట్టుకుని వెనక్కిలాగింది.

తను వెనక్కి తూలి నిభాయించుకున్నాడు. ఎదురుగా నెరిసిన తల, మాసిన తెలుపుగడ్డం, నోట్లో చుట్ట, మడిచి కట్టిన పాతపంచెతో ఓ ముసిలివాడు నవ్వుతూ కనిపించాడు.

శ్రీనివాసులు స్తంభించి పోయాడు.



పిడుగుల వర్షం రాబోయి ఆగిపోయినట్టు, ఏదో పేరుతెలియని ప్రపంచ ప్రయత్నం విఫలమయినట్టు, సముద్రం పొంగి దేశాన్ని ముంచేసినట్టు, లేక దేశం చైనా వాళ్ళ హస్తగతమైపోయినట్టు, దేవుడు మరణించినట్టు అయింది శ్రీనివాసులికి ఎవరో తన స్వేచ్ఛన్ని ఉరితీశారు.

మునిలివాడు అద్దంలో మొహం చూసుకున్నట్టు చూస్తున్నాడు తనవైపు మునస్సులోతుల్ని కాలుస్తున్నట్టున్నాయి అతని కళ్ళు.

"ఇలా చెయ్యొచ్చునా బాబూ ?"

కూతురి భర్త కోరికతో తన్ను కౌగిలించుకున్నప్పటి అత్తగారి ప్రశ్నలావుంది. శ్రీనివాసులుకి మునిలివాడి ప్రశ్న. ఆ అనుభవం తనకి తెలుసు. సిగ్గుతో చచ్చిపోయాడు తను — వెధవ 'చావు' మాటల్లోతప్ప పనికి రాదు ఏమీ చెయ్యలేక నిస్సహాయుడై "నన్నెందుకు ఆపావ్ ?" అన్నాడు.

ముసిలివాడు నవ్వాడు.

"పిచ్చిబాబూ !" అని మళ్ళా నవ్వాడు.

శ్రీనివాసులు క్షణంసేపు చిన్నవాడైపోయాడు.

"నాకంటె తర్వాత పుట్టావ్. నాకంటె ముందు ఎలా సచ్చిపోతావ్ ?"

"అలాగని ఎక్కడా రూలు లేదు. కావాలంటే ముందు నిన్ను తోసేసి, తర్వాత నేను దూకేస్తాను నీ తర్వాత నేను, నా ముందు నువ్వు చచ్చిపోవచ్చు"

"నేను పోలీసుని" అన్నాడు ముసిలాడు.

"బెదిరిస్తున్నావా ? నిన్ను తోసేసి దూకటం మానేస్తాను"

"మనసు బాగా లేకపోతే ఎందుకు బాబూ ఊరికే కంగారుపడతావ్ ? ఊళ్లోకి రా. కాసింత కాఫీ తాగితే మనసు కుదుటపడుద్ది"

కాఫీపేరు చెప్పేసరికి శ్రీనివాసులుకి బ్రతుకుమీద ఆశ పుట్టింది. కాని వెంటనే పిల్లలు, సంసారం, జీవితం జ్ఞాపకానికి వచ్చాయి.

"నాకు కాఫీవద్దు. చావుకావాలి"

"రమ్ము కావాలా ?"

వెంటనే శ్రీనివాసులుకి షాంపేన్ మనసులో మెదిలింది. అతనికి ఆ పేరొక్కటే బాగా తెలుసు. తన పాత స్నేహితుడొకడు షాంపేన్ గురించి లెక్చర్లిచ్చేవాడు. షాంపేన్ త్రాగని జీవితం శ్రీనివాసులి చావులో అసమగ్రతని గుర్తుచేసింది.

"రమ్ముకాదు. నాకు షాంపేన్ కావాలి"

ముసిలివాడు పొట్ట చెక్కలయ్యేలా నవ్వి "అలాగే. నడు" అన్నాడు.

"నిజంగా షాంపేన్ తాగిస్తావా ?"

"ఆఁ"

"అది తాగిం తర్వాత చచ్చిపోనిస్తావా?"

"సావనివ్వను. అయినా చాంపేను మొదటిసారి తాగనేక సత్తావ్ ?"

శ్రీనివాసులుకి పౌరుషమండింది.

"చచ్చినాడా ?" అని తిట్టాడు.

"బ్రతికేవున్నాను"

తను కోపంగా చూశాడు. ముసిలాడు గడ్డం ఊడిపోయేలా నవ్వాడు. వాడు నవ్వుతుంటే శ్రీనివాసులికి కోపం రెచ్చిపోతోంది. వాడి నోట్లో విడివిడిగా వున్న రెండు పళ్ళు ఎందుకో తన పూడో కుర్ర వెధవనీ, ఆరో పిల్లముండనీ గుర్తుచేస్తున్నాయి.

"నోయముయ్యి !"

"మరి వత్తావా ?"

"రాను"

ముసిలాడు మళ్ళా నవ్వాడు, వొళ్ళంతా కుదుపుకుంటూ. తనకి మళ్ళీ కోపం వచ్చింది, భయం వేసింది ఆ పళ్ళని చూసేసరికి. దొంగ వెధవ ! తన రహస్యం వాడికి తెలిసిపోయింది. అందుకే నవ్వి సాధిస్తున్నాడు. వీడెవడో తిమ్మరుసులా వున్నాడు రూపులోనూ, చేతల్లోనూ కూడా. కత్తులతోటీ, తుపాకులతోటీ గాక వీడు నవ్వుతో భయపెడుతున్నాడు. ఈ మాత్రందానికి వెధవకొండ ఎక్కలేక చచ్చాను. ఎక్కి బ్రతికాను. ఇప్పుడీ వెధవ చంపేస్తున్నాడు. అనుకుని ముసిలివాడ్ని అనుసరించాడు శ్రీనివాసులు.

బాగా చీకటిపడింది.

నడుస్తూంటే కాళ్ళక్రింద ఎండుపుల్లలు విరుగుతున్నాయి.

"ఎవర్నైనా లవ్ సేసావేటి ?"

"ఏం ?"

"అది సచ్చిపోనా దేటి ?"

"అసలేమిటి నీ ఉద్దేశం ?"

"ఉద్దేశాని కేటుంటది. ఓ రిత్తి సేనా లవ్వూ. ఆపైన గరభం సేసొగ్గేసి నావేమో అది టుపుక్కుమని సచ్చేసరికి నువ్వుకూడా సద్దామనుకున్నావేమో అని."

"అఘోరించినట్టే వుంది."

"మరేటికత—చుట్టకావాలా ?"

"వద్దు"

"మరి సెప్పు."

శ్రీనివాసులి మొహంలో బలహీనత స్పష్టమవుతోంది. ఈ ముసిలివాడు ఎవరు ? తనంటే వీడికెందుకింత తాపత్రయం ? అనుకున్నాడు.

"నీకెందుకు చెప్పాలి. నువ్వు నాకేమవుతావ్ ?"

"ఏటవుతాను ? బతికించినోణ్ణి. రచ్చ కుణ్ని. సెప్పవయ్యా ఎర్రిబాబూ."

"చెప్పేందు కేముంది. నిన్నటివరకూ వున్న పెళ్లాం తెల్లారేసరికి చచ్చిపోయింది. డెబ్బైఐదు జీతం. విశాఖపట్నం ఎల్లా బ్రతకడం ?"

ముసిలాడు మళ్ళా నవ్వాడు. వాడినవ్వుకి ఆ చుట్టుపక్కల పొదల్లోనూ, చెట్లమీదా పాకుతున్న పాములన్నీ పరిగెట్టుకు వచ్చి కిరి చేస్తాయేమోనని భయపడ్డాడు—ఈ వెధవకి నవ్వుతప్ప మరో యావ లేదేవిటి ? తనకి ఉక్రోషం వచ్చింది.

"నువ్వు కనవా పిల్లల్ని ?"

"ఓ సది కాదో వెర్రోడా? సచ్చిపోనాకి యింత సిన్ని కారణమా అని. ఎల్లల్ని పెంచ లేనోడివి ఎందుక్కన్నావ్ మరి ?"

శ్రీనివాసులు వెర్రిమొహం వేసుకుని చూశాడు.

"ఇదుగో అబ్బాయ్—ఓ మాట యిను. మనం బతకలేనప్పుడు సచ్చిపోవాలి. బగమంతుడు మనల్ని సచ్చిపోమని పుట్టించనేదు. బతకడం నేరుచుకోమని పుట్టించాడు. తెలిసిందా ? సావంటే నీకేటి తెల్సు ? సచ్చేసావు—సరేలే నడు." అన్నాడు గంభీరంగా ముసిలాడు.

ముసిలివాడి మాటల్లో శ్రీనివాసులికి వేదాంతం కనిపించింది. ఆశ్చర్యపడ్డాడు. ముసిలి ... మీద ఆప్యాయత, బ్రతుకుమీద ఆశలతో అతడి హృదయం సంత్రస్తమయింది.

కొండదిగి అవతలివైపుకు దాటి మసీదు వీధి కొచ్చేశారు. చలివేస్తోంది. మెదడు వేడెక్కి పోతోంది.

పెద్ద పోస్టాఫీసు దగ్గర పదోనెంబరు చివరిబస్సు హారన్ మోగింది.

హార్బరు రోడ్డులో ముసిలి కుక్క మూలుగు వినిపిస్తోంది.

సోల్జర్ పేట సందులోకి తీసుకు పోతున్నాడు ముసిలివాడు.

ఒక సన్నటి గొందిలోకి నడిచి నాలుగో ఇంటిముందు ఆగి తలుపు తట్టాడు ముసిలివాడు. పెంకుటిల్లు. బాగా శిథిలావస్థలో వుంది. ఇంటి ముందునుండి ఓ పెద్ద మురికి కాలువ పారుతోంది. ఒకనాపరాయి పలక ఇంటి గుమ్మంలో వంతెనగా వేయబడింది.

తలుపు తెరుచుకుంది. ముసిలివాడి వెనకే శ్రీనివాసులు లోపలికి నడిచాడు. పరిహేను కాండిల్సు దీపం వెలుగులో పచ్చటి చీర కట్టుకున్న పద్దెనిమిదేళ్ళ స్త్రీ కనిపించింది. శ్రీనివాసులు ఒక్కక్షణం కన్నార్పలేదు. తను లీలామహల్లో ఇదివరకు చూసిన ఓ పాత ఇంగ్లీషు చిత్రం మనస్సులో మెదిలింది. 'క్లియోపాత్రా' అని గొణుక్కున్నాడు పెదాల వెనుక. ముసిలివాడు పక్క గదిలోకి దారితీస్తూ,

"ఇల్లారా సిన్నోడా !" అని పిలిచాడు.

శ్రీనివాసులు వెళ్ళాడు. ఈ గది ముందు గదికంటె చిన్నదిగా వుంది. ఓపక్కన వాలు మంచం, కొంచెం ఇటుగా రెండు పాతకుర్చీలు, ఒక చిన్న స్టూలు వున్నాయి. మూలగా అల్మైరా వుంది.

కూర్చోమని కుర్చీ చూపించాడు. ఇద్దరూ కూర్చున్నారు. ముసిలివాడు చుట్ట వెలిగించాడు. "అమ్మాయ్, మూల గూట్లో మందు సీసా పట్రా." అన్నాడు.

"ముందు మందు కొట్టేద్దాం ?"

"ఏం మందు ?"

ఖంగున నవ్వాడు. మళ్ళా మూడో వెధవా. ఆరోపిల్లా జ్ఞాపకాని కొచ్చారు.

"ఎర్రోడా—రమ్ము-అదేలే షాంపేను?"

శ్రీనివాసులికి భయం, సంతోషం వేశాయి. ఇందాకటి ఆమె సీసా, రెండు గాజుగ్లాసులు తీసుకువచ్చి స్టూలుమీద పెట్టింది. కొంగో అడవుల్లో గంధర్వకన్యలా కనిపించింది. ఆమెవొంగొన్నప్పుడు పమిట జారి వక్షోజాలు పడమటి కొండల్లా ఏపుగా కనిపించాయి. ఆమె సర్దుకొని గదిలోంచి వెళ్ళింది.

"మా అమ్మాయ్. పేరు రాణి. తల్లి లేదు. ఇంకా పెళ్ళి సెయ్యనేదు." గ్లాసులోకి రమ్ము వంపాడు. శ్రీనివాసులు షాంపేన్ వంపాడు అనుకున్నాడు. ఇప్పుడు కూతురుపెళ్ళి గొడవ చెప్పాల్సినంత అవసరం ఏమొచ్చింది ? ముసిలివాడు. 'ముసిలివాడు' అనుకున్నాడు శ్రీనివాసులు.

నువ్వే కన్నావా ? లేక దొరికిందా ? అని అడగాలనిపించింది. చచ్చిపోయే లోపుగా ఈ పీనుగ ఒక్కమంచి పని చేశాడు అనుకున్నాడు రాణిని చూసిన శ్రీనివాసులు.

"ఈ యిల్లు నీదేనా ?"

"అబ్బే ! అద్దెకొంప. ఈ రొండే గదులు. నలభై అద్దె. మేం యిద్దరవేగా సరిపోతుంది. పట్టించు గిలాసు"

"నువ్వేం చేస్తావ్ ?"

సీసాకేసి చూపించి సీసా పగిలిపోయేలా నవ్వాడు.

శ్రీనివాసులు కొంచెం తాగాడు. గొంతు మండింది. ముసిలివాడు మళ్ళా గ్లాసు నింపాడు. శ్రీనివాసులు ఇక తాగలేకపోయాడు. ఓ క్షణం కడుపులో తిప్పింది. తమాయించుకున్నాడు.

ముసిలివాడు పేలాపన మొదలుపెట్టాడు.

"యమ్టివోడు కుష్నుడు. నాగ్రాపు ఆర్జీసీడు ఏసిన సినిమా చూశావ్ ?" అని అడిగాడు. కాసేపు గవర్నమెంటుని తిట్టాడు. హైద్రాబాదు వెళ్ళిపోయి పబ్లికున మందు కొట్టు తెరిచి మజాకా చేస్తానన్నాడు. ఇంకెంతలే అన్నాడు. శ్రీనివాసులు ఏదో చెప్తున్నాడు. అతని మనస్సు మాత్రం పక్కగదిలో ముసిలాడి కూతురు 'రాణి' మీదే వుంది. విచిత్రం ! తొమ్మిదిమంది పిల్లల్ని కన్నా మనస్సులో వేడి తగ్గలేదు. రాణి ఎంత అందంగా వుంది. ఇంత అందమైన దానికి వాడు పెళ్ళి చేసేస్తాడు! అందంలేని వాళ్ళకిగాని అందమైన వాళ్ళకెందుకూ పెళ్ళి ? ఎవ్వరూ కోరుకోరన్న దావ వున్నప్పుడే పెళ్ళి. అందాన్ని అనుభవించే హక్కు ఒక్కడికేనా ? అది వెన్నెల్లా అందరూ అనుభవించేలా అందుబాటులో వుండాలి. అప్పుడే అందం విలువ. గొప్పతనమూనూ. తనే దేవుడైతే అందమైన వాళ్ళకి పెళ్ళిళ్ళు లేకుండాచేసి. చకోరాలకి వెన్నెలమల్లే ధారపోసేవాడు.

ఏమైనా ఇంత మంచి అంచాన్ని వదిలి పెట్టకూడదు. చచ్చిపోయేది ఎలాగూ చచ్చిపోతున్నాను. బాధపడేందుకు ఇప్పుడు భార్య లేదు. రేపు తనూ ఉండదు. ఆఖరిక్షణాల్లో ఆనందాన్ని నింపుకోవాలి. అసలు ఇందుకేనేమో దేవుడు తన చావుని వాయిదా వేశాడు. తాగిన శ్రీనివాసులి మనస్సు ఇలా ఆలోచనల మధ్య గంతులు వేస్తోంది.

ముసిలివాడు పేలాపన ఆపేశాడు. నిద్ర వస్తున్నట్టుంది. "నడు. మనిద్దరం ఆగదిలో పడుకుందాం"

క్రింద చాపమీద పక్కపరిచింది రాణి. ఇద్దరూ పడుకున్నారు. రాణి చిన్నగదిలోకి వెళ్ళిపోయింది.

శ్రీనివాసులికి నిద్ర రావడంలేదు.

ఊరంతా చీకటి వ్యాపించింది.

నిశ్శబ్దం గుండెమీద చర్చిగంట రెండు నిట్టూర్పుల్ని విడిచింది.

ముసిలివాడు నిద్రలో మునిగిపోయాడు. గుర్రుపెడుతున్నాడు.

చీకట్లో శ్రీనివాసులు పక్కకి తిరిగి ముసిలివాడి ముఖంకేసి చూశాడు. ఇక ఇప్పట్లో వప్పుడే లేవడని నిర్ధారణ చేసుకొన్నాడు. ఏమైనాసరే సాహసం చెయ్యాలి. తర్వాత సంగతి చూసుకోవచ్చు అనుకున్నాడు. మెల్లగా లేచాడు. రాణి గది తలుపు దగ్గరగా చేరవేసి ఉంది. శరీరం వేడెక్కిపోయింది. చెవులోంచి వేడిగాలి వస్తోంది. నెమ్మదిగా నెట్టాడు. లోపలికి ప్రవేశించి తలుపు గడియ పెట్టాడు. మంచంమీద అలికిడయింది. తటాలున వెళ్ళి మంచంమీద కూరికి ఆమెకేసి చూశాడు. "అరవకు." చీకట్లో ఆమె కళ్లు మెరుస్తున్నాయి. చేతుల్తో ఆమె చెంపలు రాసింది. శ్రీనివాసులికి స్వర్గం కనిపించింది. మనస్సు కుదుటపడింది ఆమె నోటిమీద అణచిన చెయ్యి తీసివేశాడు. ఎన్నో గంటల పాటు వాళ్ళిద్దరూ సుఖానికి నిర్వచనా లయ్యారు.

ఇన్నేళ్ళ శ్రీనివాసులి జీవితానికి ఆరాత్రి ఆ క్షణాలు పరాకాష్టలా అనిపించాయి. చావబోయేవాడిని ముసిలివాడు ఆపడం, ఇంటికి తీసుకువెళ్ళి రమ్ము తాగించడం, సుఖం తన్ను వెతుక్కుంటూ రావడం విచిత్ర మనిపించింది శ్రీనివాసులికి. కాసేపు సీజరులా ఫీలయ్యాడు. ముసిలివాడిమీద జాలేసింది. సహాయం చేసినవాణ్ని, అందునా ముసిలివాణ్ని మోసం చేస్తున్నానే అని.

"ఇంకచాలు. లెగండి" అంది రాణి.

తను లేచాడు. ఆమె శ్రీనివాసులి జేబు తడిమింది.

"ఏం కావాలి ?"

"కొత్త పాసింజరుకుమల్లే అడుగుతావేటి ?" అని అతని జేబులోవున్న చిల్లరంతా చొరవగా తీసుకుంది. "జేవార్చు సరుకనుకొన్నావేటి ?"

ఒక్కసారి శ్రీనివాసులు విచలితుడయ్యాడు. నిషా దిగిపోయింది. క్షణంలో పరిస్థితి అర్థమయింది. ఎంత మోసం. ముసిలివాడిమీద కోపంతో శ్రీనివాసులి మనస్సు ఉడికిపోయింది. చావబోతే పాపం వెనక్కి పిలిచింది.

విసురుగా తలుపు తెరుచుకుని ముందు గదిలో కొచ్చాడు. ముసిలివాడు చుట్టకాలుస్తూ నవ్వుతూ కనిపించాడు. దాంతోటి శ్రీనివాసులు అగ్గిబరాటా అయిపోయాడు. మీదికి లంఘించి ముసిలివాడి గొంతు పట్టుకున్నాడు ముసిలివాడు నవ్వు మానలేదు. రాణి వచ్చి లైటు వేసింది.

"మోసం చేశావు." క్రోధ్యం నిండిన కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

"యిదిలి పెట్టోశ్ ! ఎర్రోడా !" శ్రీనివాసుల్ని విదిలించాడు. "నన్ను. నా పిల్లని పోషించుకోడం మోసమా ? నీకుమళ్ళే కడుపున కన్న పిల్లల్ని పోషించుకోలేక సచ్చిపోయి గతిమాలినోన్నవను."

శ్రీనివాసులికి షాక్ తగిలినట్లయింది.

"బతకాలంటే చాలా వున్నయ్ దార్లు. కన్నపిల్లల్ని పోషించుకోడం కాతకాక పోతే సావమనా నదుంకున్న సిన్నోడా ? అడుక్కు తినేనా బ్రతకాలి. నీ కోసరం కాదు. పిల్లలకోసం. తెలిసిందా ? ఏదో బతుకు బతికి జీయితం గడపాలి. దయిర్యం వుండాలి. కావ కావాలి. యెల్లెల్లు. నీకేది మంచిదని తోస్తే ఆరకంగా బతుకు. నాకుమల్లే మందు—పిల్ల ఏపారం పెట్టాలనుకుంటే పెట్టుకో. నేకపోతే ఆ గుమాస్తా పనే సూసుకో. యెల్లెల్లు ! ఎర్రోడా ! అంతేగాని సావమోక. మొగోడివి. ఇంనాక నువు సేసిన గనకార్యానికే మొగోన్ననుకో మాక. నువ్వు సత్తే ఆ పిల్లలేమయిపోతారని ఆలోసించనేదేటి ? యెల్లు !"

ముసిలివాడి ముఖంలో నవ్వు లేదు. చూపుల నైశిత్యం శ్రీనివాసుల్ని వివశుణ్ని చేసింది. అంతే - ఇక మారు మాట్లాడలేదు. రాణికేసి ఒక్కచూపు చూశాడు. వెనక్కి తిరిగి వీధిని పడ్డాడు.

తెల తెల్లావుతోంది. పేరు తెలియని పక్షులు ఆకాశంలో అరుస్తున్నాయి. శ్రీనివాసులి గుండెలో మహారణ్యం తగులబడిపోతోంది.

శ్రీనివాసులు నడుస్తున్నాడు వేగంగా.

దార్లో చంకనిపిల్ల నెత్తుకున్న, వేళాపాళాలేని ఓ ముష్టిది కనిపించి. "బాబూ ! పిల్ల ఆకల్తో మండిపోతోంది. రెండ్రోజులు మట్టి తిండి నేదు. దర్మం సెయ్ బాబూ !" అని అడిగింది.

శ్రీనివాసులు జేబులు తడుముకున్నాడు. ఖాళీ ! ముందుకు నడిచాడు. నడక వేగం మరింత హెచ్చింది.

తను చావబోయి బ్రతికాడు.

తను చావకూడదు. బ్రతకాలి. పిల్లల కోసం—పిల్లలకోసం—శ్రీనివాసులు బ్రతకాలనుకున్నాడు. నిజంగా శ్రీనివాసులు బతకాలనుకున్నాడు. చెంగలావ్రు పేట సందులోంచి ఆత్రంగా ఇంటివేపు పరుగెత్తుకుపోతున్న శ్రీనివాసులు 'పిల్లలు—పిల్లలు' అని గొణుక్కున్నాడు. ఇప్పుడతని కంటిముందు పిల్లలు. మనస్సులో బ్రతుకు మీది ఆశ తప్ప మరేమీ లేవు.

ఉన్నట్టుండి తలమీద వెయ్యి గొడ్డళ్ళతో మోదినట్లయింది.

కంటిముందు చీకటి పేరుకుంది.

వాళ్ళతూలింది.

ఆలోచనలు ఆగిపోయి మెదడు పని చేయడం మానుకుంది.

సృష్టి స్తంభించి నట్టయింది.

అంతేతెలుసు శ్రీనివాసులికి.

* * *

మర్నాడు దేశంలోని వార్తాపత్రిక లన్నిటిలో పేజీ మూలలో, విశాఖపట్నం సందులమధ్య లారీ ప్రమాదంలో శ్రీనివాసులు అనేవ్యక్తి మరణించాడని ప్రకటించబడింది. ఆనవాలు తెలియని శవాన్ని అతని హెడ్ గుమస్తా గుర్తుపట్టి చెప్పాట్ట.

మనిషి ముఖం చీలిపోయి, కళ్ళూ, ముక్కూ మమేకమై పోయినా, తొమ్మిది మంది పిల్లల పోషణ కోసం, పెళ్ళాంరోగాల మందుల కోసం వినయ పూర్వకంగా, శ్రద్ధగా, కష్టించిపని చేసిన చేతివేళ్ళు, పొంగిన నరాలు- అతని హెడ్ గుమస్తాకి బాగా గుర్తు. ●

మానసోల్లాసమ్

వి.ఎ.కె. రంగారావు

ఒకోసారి యెంతో ప్రయత్నం, ప్రయాసల మీదటగాని కోరుకున్న ఆనందం మనవవదు. ఆరుదుగా మరొక సారి ఆనందానుభవం మనసే కోరి వెతుక్కుంటూ వచ్చి వలచి వరిస్తుంది. అదృష్టం అంటే అది.

ఇప్పటికి ఇరవైఅయిదు నెలల క్రిందట ఇంకా సరీగా చెప్పాలంటే 61, జూన్ నెల అయిదవ తేదీని ఒక మధురానుభూతి నన్ను వెతుక్కుంటూ వచ్చింది. మధురోహల డోలికల్లో నన్ను ఊపివేసింది. ఆ తీయని కలతో తీరని ప్రణయం ఇంకా జరుగుతునే వుంది. కాని చివరన చెప్పవలసిన సంగతి ముందు చెబుతున్నాను.


ఆ సంవత్సరం అరవై ఒకటి. నెల జూన్. తేదీ అయిదు. అప్పుడే వేసవికి వేడితగ్గి చల్లదనం పడుతున్న రోజులవి. అప్పట్లో నేనుంటున్నది ఒక చిన్న ఊరి బయట పురాతనమూ, విశాలమూ అయిన ఒక భవంతిలో ఏకాకిగా. విచారాన్ని చిన్న చూపు చూస్తూ, బాధ్యతలను విస్మరిస్తూ, విలాసాన్నే వరించి ఖులాసాగ్గా కాలం గడుపుతున్న రోజులవి. బ్రతుకులో బాధలు రేఖా మాత్రంగా తెలిసినా, అవి రేఖా మాత్రంగానే సుదూరంగా వున్న రోజులవి.

ఆనందమనే పదానికి కొత్త కొత్త నిర్వచనాలు వెతుకుతున్న రోజులవి. పగలంతా మల్లాదివారి కథలు పదే పదే చదవటం. సాయంత్రమంతా సి. రామచంద్ర పాటలు వినటం. రాత్రంతా ఆ రెండిటినీ మననం చేసుకుంటూ, ఆ విరహంలో వేగటం. అప్పుడున్న సమస్యలన్నీ రాకేందువదన కాలిగోటి అందానైనా ఊహించగలనా అనీ. సి. రామచంద్ర పాటల్లో ఒక్క స్వరాన్నైనా పూర్తిగా అనుభవించగలనా అనీ. ఈ సుఖ జాగ్రదవస్థలోనున్న నాజీవన సముద్రములో తనకు తానై ఒక మధుర తరంగం ప్రాణం పోసుకుంది.

దూరంగా, దివాణంలో, తెలిసీ తెలియని ప్రేమాలాపనములా పలుకుతున్న గంటలు. రాత్రి తొమ్మిది. డాబాపై పారిజాతాలు పల్చగా పరచినట్లు మసక వెన్నెల. మల్లె పువ్వులు పేర్చినట్లు దుప్పట్లు వేసిన పరుపులు. మాధవీలత మనసువంటి లేలేత తమలపాకులు. ఆ చిగురుటాకులకు చేదోడు వాదోడుగా పచ్చ కప్పురపు పరిమళాలు. ప్రక్కగదిలో సన్నగా వినవస్తున్న భానుమతి పాట "మనసున మల్లెలమాలలూగెనే" ఆ వెన్నెలల మత్తు, వీస్తున్న చల్లగాలుల మోహం, మల్లెల సౌరభం సొగసు, సగం కూడా జరగని రాత్రి వయసు, భానుమతి కంఠం కైపు, నింగిన తొంగి తొంగి కనుగీటుతూ తారల చూపు, యివన్నీ యేదో మోహన మంత్రం వేసి నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. ముగ్ధుణ్ణి చేయటమే కాదు. ఆవన్నీ కలసి యేకమై నాప్రక్కనే ఒక మోహన మనోరమణ మూర్తిగా మూర్తీభవించాయి.

ఈ ప్రణయరూపం ప్రభావానికి పరిధులు లేవు. ప్రతి హృదయాన్ని తన కోమల పరిష్వంగ సుఖంలో మైమరపింప జేయడమే ఆ మూర్తి జీవన ధ్యేయం. స్త్రీ పురుష విభేదాలు లేవు. ప్రణయసీమల్లో, ప్రేమ పథాల్లో ప్రియతమా అంటూ పయనించటమే అమూర్తి జీవన గమ్యం.

ఆ అందాన్ని భరించలేక, అ సౌందర్యాతిశయాన్ని సహించలేక తలగడలో తల దాచుకుందామని తల ప్రక్కకు త్రిప్పితే పరిమళాలు వెదజల్లే ఆ పెదవులు,



కాదు - సగం నలిగిన మల్లెమొగ్గలు చెంపల్ని తాకి చిరునవ్వులు నవ్వాయి. తల అటు వాల్చితే మాదకతతో మత్తెక్కిన కళ్లు. కాదు - నలిగీ నలగని చిలక మడుపులు నా కళ్ళల్లోకి చూసి కొనగోటి మీటున, మొనపంటి గాటున చెక్కిట చేరిన రంగును చూసి పరిహసించాయి. ఈ విసురు సైప లేక లేచి పోతుంటే ఆ ప్రేమమూర్తి వాంఛావల్లరిలో. కాదు - భానుమతి రాగ వల్లరిలో బంధితమై పోయినవి తనువు. మనసు. ఆక్షణంలో నాకు వినిపించినది ఒక్కటే. ప్రణయానిలంలో పదే పదే సాగిన ప్రేమగీతం. ఆ నిముసంలో నాకు కనిపించినదీ ఒక్కటే : విరహానలంలో వెలుగుతున్న నిర్మల రాగ జ్యోతి. ఆ ఘడియలో అనుభవించినది స్వర్గానికి అందని ఆనందం. కైలాసంలోకూడా కాలూనని సంతోషం. ఆ త్రుటిలో నేను చూసినది ప్రేమకూ, వాంఛకూ ఉన్న ఒకేరూపం.

క్షణక్షణానికి వడివడి. క్షణాలలో ఉధృతమైన ఈ భావన తన బలిమితో నన్ను పిపణ్ణి చేసి, తనవశం చేసుకొని పారవశ్యాన్ని ప్రథమంగా చవిచూపింది.

ఉవ్వెత్తుగా లేచిన మధుర తరంగం మెల్లగా తూలింది. రస సంనిధిలో ఓలలాడించింది. ప్రతి రాగమూ అనురాగానికి అనురూపమని అనుపదించి ఆనందం అందినపుడంతా అనుభవించమని తెలియజేసింది.

ఈ సంఘటన కాదు - కల కాదు - కాదు తీయని ఊహల తేనియవలను అనుభవించి రెండేళ్ళయింది. రెండుయుగాలైనా మరువలేని సురభిళ స్వప్నంలో మనసులో ఒక భాగమయింది. జీవితంలో ప్రతి ఆనందాను భూతినీ కొలిచే కొలమానమయింది. హృదయమందిర రహస్య ప్రాంగణంలో నల్లనివాని మెత్తని పాదాల ప్రక్కన నిలచి వాటికందే కోటిపువ్వుల నిత్యపూజతోపాటు ఒక నవమల్లికా కోరకాన్ని అందుకునే ప్రణయప్రతిమ అయింది.

ఆ తీయని కల గతంలో యెలా జీవితానికి మాధుర్యం ప్రసాదించినదో, వర్తమానంలో యెల్లా మరువరాని వ్యక్తిలా అభివ్యక్త మవుతున్నదో భవిష్యత్తులోనూ అలానే నిరాశా మేఘాలకు జలతారు అంచులు వేస్తూ, మురిపాల పుంతలు చూపిస్తూ ప్రతిలిప్తను రుచిమయం రోచిర్మయం చేస్తుంది.

నా ఊహలకి పరిణతి ఆ స్వప్నం వయసు. ఆ స్వప్నం మఱపు నాజీవన కళకు ముదిమి. ఆ స్వప్నం నిరంతర ధ్యానం. నా జీవితాకాశంలో యెడతెగని వెన్నెల. ఆ స్వప్నమే నేను. కాదు, నేనే ఆ స్వప్నం.

హోదా

రామారావు:-"ఏమోయ్, జలుబుకి ఏం పుచ్చుకుంటున్నావ్?"


సుబ్బారావు:-"ఎంతిస్తావేమిటి ?"

కుడి ఎడమైతే పొరబాటులేదోయ్

పాలు నలుపా ?
చిలిపిగా పిలిచి
చింపని పంచి (లేక) పంచి చింప
తిట్టి కొట్టితి
రాయ నీయరా
రాలేదు లేరా
పలకల కలప
తలలో లత
కానీ నీకా ? (లేక) నీకా కానీ ?
కోసి తీసికో
నాదీ, నీదీనా ?
చంపింపగా పంపించ (లేక) పంపించగా చంపింప
లేత పూతలే !....
దారి వారిదా ?
కాలితే తేలికా ? (లేక) తేలికా కాలితే ?....
కవ్వ మివ్వక
నీడ పడనీ !
కట్ట కట్టక
పిలకలు కలపి-
మురారి రాము (ఒకపేరు)
వాయ తీయవా ?
తాగు ఆగుతా.
వేయ నీయవే !
కాలి వేలికా ?
కడపటి పడక
దూకలేవులే కదూ ?
దాగదు గదా !

"అందే శ్రీనివాస్, సుభాష్"

ప్రమోషన్



మా ఆఫీసులో పనిచేసే సీతారామయ్యగారు ప్రమోషన్ల లిస్టులోకి వచ్చేశారు. ఆయన్ని గురించి పై ఆఫీసర్లందరు అద్భుతంగా రాసేశారు.

"ఇతను కష్టపడి పనిచేస్తాడు. ఒళ్ళు దాచుకోడు. రాత్రి ఒంటిగంటకు నిద్దర్లేపి "అబ్బాయ్! రెండువందల డబ్బయితొమ్మిది కరెంటు ఏమయింది?" అంటే "సార్! రామాయిపాలెం తుమ్మచెట్టు సంగతి కదండి అది వేలం వేసెయ్యమని రాసేశాం. డిస్పాచిలో వుంద"ని కరెక్టుగా చెప్పేస్తాడు. అంతటి అఖండుడు" అని కొంతమంది రాశారు. "ఇతని వినయ విధేయతలు చెప్పుకోతగ్గవి. హనుమంతుడు కనక ఈ కాలంలో వుంటే, ఇతని దగ్గర కనీసం ఆర్నెల్లు ప్రొబేషనరుగా వుండి, కొన్ని కొన్ని విషయాలలో మెళుకువలు నేర్చుకొని తీరేవాడు. సీతారామయ్యగారు అంతటి స్వామిభక్తి పరాయణుడు" అని కొందరు రాశారు. మరికొందరు "మన డిపార్టుమెంటుకు సీతారామయ్యలాంటి ఆఫీసర్లు కనీసం కొందరు అవసరం. త్వరగా యితను పైకి రావాలి" అని రాశారు. తరువాత వాళ్ళు "కొందరేమిటి? నన్నడిగితే అందరూ సీతారామయ్యలాంటి వాళ్ళుండా లంటాను. లాగేయండి పైకి - చూస్తారేం" అంటూ రాశారు. ఇల్లా పై ఆఫీసర్లందరు సీతారామయ్యగారిని గురించి సూటిగా, చక్కగా, నాన్చకుండా బాగా రాసేశారు.

ఇదంతా యింతయిదిగా ఎందుకు చెపుతున్నానంటే ఒక్కొక్కసారి పై ఆఫీసర్లు బాగా రాసినట్టే కనిపిస్తుంది. కాని కొంచెం లోతుకుపోయిచూస్తే అసలు సంగతి అమవుతుంది. ఉదాహరణకు మాకొక ఆఫీసరుగారు వుండేవారు. ఆయన బహు మంచివారు. కుర్చీకి పట్టిన నల్లుల్ని కూడా చంపనిచ్చేవారు కాదు. ఆయన కిందవాళ్ళను గురించి యిల్లా రాస్తుండేవారు కాన్ఫిడెన్షియల్సులో. "ఇతడు యోగ్యుడు. పని బాగా చేస్తాడు. కాని చెప్పిన పని చెప్పినట్లుగా చెప్పినప్పుడు చెయ్యడు" అనో, లేకపోతే "ఇతను నిజాయితీ పరుడు. ఆఫీసుడబ్బు నయాపయిసా ముట్టుకోడు. కాని పదులూ వందలూ డబ్బు యితనికి అందుబాటులో వుండకపోవటం మంచిది" అనో రాస్తుండేవారు. కాని సీతారామయ్యగారి విషయంలో యిలాంటివి యేమీలేవు.

ఆఫీసర్ల లిస్టులో పడేటప్పటికి సీతారామయ్యగారిలో గొప్పమార్పు వచ్చేసింది ఆయనకు ఆఫీసులో ఒక స్థానం వచ్చేసింది. మా ఆఫీసరుగారు సీతారామయ్యగారిని ఎంతో గౌరవంగా చూసేవారు. ఎదట పడగానే వెంటనే కుర్చీ యిచ్చి కూర్చోమనేవారు. ఒక స్నేహితుడి మాదిరిగా సినిమా సంగతులు, యింటి విషయాలు కూడా మాట్లాడేవేవారు. ఇక ఆఫీసు విషయాలు దాపరికం లేకుండా చర్చించి. సీతారామయ్యగారి సలహా తీసుకొనేవారు. ఆఫీసులో జవాన్లు సీతారామయ్యగారిని స్పెషల్‌గా గౌరవించేవారు. మంచినీళ్ళు అందించే సుబ్బయ్య ఆయన అడిగితే ఒకటికి రెండుసార్లు గ్లాసు కడిగి మరీ యిచ్చేవాడు. వెనక నీళ్ళు తాగిన వాళ్ళ సిగరెట్టు వాసన ఆయనకు కొడుతుందేమోనన్నట్లు. ఆయనకు

కె. లక్ష్మీకాంతరావు

యిచ్చేపాట్లు అతిగౌరవంగా టేబులుమీదకు ఖాఖలు చేసేవాళ్ళు. ఆయన పురమాయించిన పని నిమిషాలమీద జరిగిపోయేది. మిగతా వాళ్ళం మేమందరం శీతారామయ్యగారిని కుర్ర ఆఫీసరుగా చూసేవాళ్ళం. ఆయన ఎదురుగా సిగరెట్లు తాగటం మానేశాం. 'సాబ్' అని పిలిచేవాళ్ళం ఆయన్ని. ఆయన ఎదట ఆఫీసరుగారిని గురించి మాట్లాడటం మానేశాం. ఎప్పుడయినా మాట్లాడితే ఆయన వెనకటిలాగా ఒప్పుకునేవారు కారు. "చూడండి. మన ఆఫీసరుగారు వేసిన ఆర్డర్లలో ఏమీ పొరపాటు లేదు. మనం కొంచెం వాళ్ళ బాధ్యతలుకూడా గమనించాలి. కొన్ని కొన్ని విషయాలు పైకి అన్యాయంగా కనిపించినా, జిల్లామొత్తం స్థాయిలో చూస్తే ఎందుకు చేశారో తెలుస్తుంది. "ఇవన్నీ తెలీకుండా ఊరికే మనం ఆయన్ని అనేస్తాం" అంటూ ఆఫీసరుగారిని సపోర్టు చేసేవారు. వెనకటిలాగా మాతో చనువుగా వుండేవారుకారు. మాటలుకూడా ఎక్కువగా మాట్లాడేవారుకారు. ఇల్లా శీతారామయ్యగారు తిమ్మరుసు సినిమా చూసొచ్చిన "స" సెక్షను సుబ్బారావు చెప్పినట్లు మానుండి మా


లేటారు.

ప్రతి ఆయన అతృతగా ప్రమోషను కాగిత ం ఎదురు చూడటం మొదలె . హైద్రాబాద్‌లో తెలిసిన వాళ్ళంటే ళకు కాగితం ఎప్పుడొచ్చేదీ. ఏ స్టేజిలో న్నదీ రాయమని ఉత్తరాలు రాశారు. వాళ్ళందరు "అయిపోయింది. నీను సంత కాల్లో వుంది. ఇంకో వా ష అరరు

రావటం ఖాయం" అంటూ జవాబులు రాశారు. హైద్రాబాద్‌నుంచి వచ్చిన ప్రతి వాళ్ళు "నేను కళ్ళారా నీపేరు చూశాను లిస్టులో. ఇంకో నాలుగయిదు రోజుల్లో ఆర్డర్లు వచ్చేస్తాయి. నీవు వెనకటి శీతారామయ్యలాగా వుంటే లాభంలేదు. సూట్లూ గట్రా కుట్టించు. గెజెటెడ్ ఆఫీసరులాగా మాటా మంచీ అలవాటు చేసుకో" అంటూ పూరించారు.

కాని కొన్ని నెలలు గడిచినా శీతారామయ్యగారికి ప్రమోషను రాలేదు. ఈ లోపల కొన్ని లిస్టులు రావటం, కొంతమంది కుర్రకారు ప్రమోషను అయిపోవటం జరిగింది. కాని శీతారామయ్యగారు మటుకు ఆఫీసు తలుపు కుడిపక్క రెండో నెంబరు "ఎ" సెక్షను సీటులోంచి కదలటంమటుకు జరుగలేదు. దీన్లోవున్న మర్మమేమిటో ఎవ్వళ్ళకూ అంతుపట్టలేదు. అందరూ ఆశ్చర్య పడిపోయారు. పై ఆ సర్లుకూడా "ఏమిటిది ? చాలా తమాషా గా వుందే. నీకు ప్రమోషను ఎప్పుడో రావాలిసింది" అంటూ. ఇది ఎంత చిత్రంగా అనిపించిందంటే శీతారామయ్యగారికి. ప్రమోషనుకు మధ్య ఏద్తో అలౌకిక శక్తి అడ్డుపడుతున్నటు అందరికి అనుమానం వేసింది.

శీతారామయ్యగారి హితు కొంత మంది "అబ్బాయ్, నీవు యిల్లా కూర్చుంటే పన్లు జరుగవు. లే ! సాగిపో ! హైద్రాబాదు రైలెక్కు ! అక్కడకుపోయి స్థిమితంగా వారం పదిరోజులు మైసూరు కేఫ్‌లో మకాం వెయ్యి. చూడాలిసిన వాళ్ళనంతా చూడు. మాట్లాడాల్సినదంతా మాట్లాడు. జర



పాలసినదంతా జరిపించు. ఆర్డరు కాగితం పుచ్చుకు దక్కారా. ఈ వూళ్ళో నీవు— అక్కడ నీ ప్రమోషను కాగితం వుంటే నీ కథ యింకొక బైలామజ్నూ సినిమాలా విషాదాంతం అయిపోతుం" దని సలహా యిచ్చారు.

ఆ ప శ ం గా శీతారామయ్యగారు పది రోజులు సెలవుపెట్టి హైద్రాబాద్ వెళ్ళిపోయారు. అక్కడ ఆఫీసులో తమసంగతి కనుక్కొన్నారు. వాళ్ళు ఈయన్ని గురించి చాలా జాలిపడారు. "మీ విషయంలో అన్యాయం జరిగింది. ఇది నిజం" అని ఒప్పుకొన్నారు. ని ఇప్పుడు మనం చేసేది యేమీ లేదని శ సమరచి చెప్పారు. మళ్ళా కొదిరోజులలో యింకో లిస్టు జన్మిస్తుందని.


దాన్లో మొదటిపేరు శీతారామయ్యగారిది వుండి తీరుతుందని గ్యారంటీగా చెప్పారు. తరువాత వాళ్ళు యీయన యిప్పించిన డిన్నర్లుతిని, చూపించిన సినిమాలు చూసి ఈయన పిల్లల్ని దీవించి యింటికి పంపించేశారు.

కొన్నిరోజుల తరువాత, అంటే ఇంకో మూడు లిస్టులు శీతారామయ్యగారి ప్రసక్తి లేకుండా వెళ్ళిపోయింతర్వాత శీతారామయ్యగారికి జీవితంమీద విరక్తి కలిగింది. వారికి పాడుప్రపంచం ఇంతేనా అనిపించింది. న్యాయం, ధర్మం ఎక్కడ ? అన్న జిజ్ఞాస కలిగింది. ఆయన వెంకటేశ్వరస్వామి వారికి ముడుపుకట్టి, గడ్డం పెంచటం మొదలెట్టారు. శనివారాలు, మంగళవారాలు రాత్రి అన్నం,

వగలు నీచు తింటం మానేశారు. మనిషి సగం అయిపోయారు. కళ్ళు లోతుకు పీక్కుపోయాయి. ఎప్పుడూ దిగులుగా శూన్యంలోకి చూస్తుండేవారు. ఉత్సాహం అనేది మనిషిలో లేకుండా పోయింది. విట మిను 'బి', తక్కువయినట్లు అయిపోయారు. ఆఫీసుపని యిదివరకులాగా చేసేవారుకారు. ఎవరయినా పలకరిస్తే వెర్రినవ్వు నవ్వి హుం అని మెల్లిగా మూలిగేవారు. ఆఫీసరుగారి దగ్గరకు వెళ్ళటం తగ్గించేశారు. ఆయన కూడా యిదివరకల్లే కాకుండా మితంగా భాషించి, యీయన్ని వెంటనే వెనక్కి పంపించేసేవారు.

ఈ వాలకం చూసి మా అందరకూ జాలి వేసింది. తరువాత శీతారామయ్యగారికి పిచ్చి ఎక్కుతుందేమో నని భయం వేసింది. నిజంగా పిచ్చెక్కి ఏదన్నా డబ్బాలాంటిది తీసుకొని వాయించి "సోదర సోదరీ మణు లారా. మనం ఆఫీసర్లు అవాలంటే నీతినిజా యితీ అక్కర్లేదు. పని అంతకంటె అక్క ర్లేదు. సర్వీసుకు అంతకంటె విలువలేదు. వెధవ ఉద్యోగాలు! వెధవ ప్రమోషన్లు వీటికంటే కిళ్ళీ కొట్టెట్టుకుంటే నయం" అంటూ వూరినబడి తిరుగుతే ఎట్లా చెప్పండి? అందుకని పరిస్థితులు చెయిజారి పోకముందే, ఆయన్ని ఓదార్చటం మొదలెట్టాం. "ఈ పాపపు ప్రపంచంలో అన్నీ మన మనుకొన్నట్టు జరగవని. అందుకని బాధపడి మనస్సు చెడకొట్టుకోవటం ధీరుల లక్షణం కాదని. ప్రమోషను తప్పక వస్తుం దని ఎంతో యిదిగా చెప్పేవాళ్ళం. మధ్యా హ్నంపూట ఈయన్ని ఎదురుగుండా వున్న హోటలుకు తీసుకువెళ్ళి మా ఖర్చుతో కాఫీ అది పట్టించేవాళ్ళం. సినిమాలకు తీసుకువెళ్లేవాళ్ళం. ఒంటరిగా దిగులుగా వుండకుండా అతని పక్కని కూర్చుని ఖబుర్లు చెప్పేవాళ్ళం. ఆఫీసు పనిలో సహాయపడుతుండే వాళ్ళం.

దీనికి ఇంకో కారణంకూడా వుంది. ఒకరోజు ఆఫీసరుగారు మాలో కొందర్ని పిలిచి "ఏమండి శీతారామయ్య యిల్లా అయి పోతున్నాడేమండి? హెడ్డాఫీసునుంచి వచ్చిన అర్జంటుకాగితాలు కూడ పెట్టు క్కుచుంటున్నాడు సమాధానాలు రాయ కుండా. పైగా డ్రాఫ్టులో అన్నితప్పులు రాస్తున్నాడు. మళ్ళా నేను రాసుకోవలసి వస్తుంది. చూడండి! ఇల్లా అయితే ఇక్కడనుంచి ట్రాన్స్ఫరు చేసేయమనిరాసే స్తాను. కొంచెం మీరు చెప్పండి. అతనికి ఒంట్లో బాగుండకపోతే సెలవు పెట్టెయ్య మనండి. కాని యిల్లా పనిచెయ్యటం నాకు నచ్చ"దని ఖచ్చితంగా చెప్పారు. అందు కని మేము వరం శీతారామయ్యగారిని కంటికి రెప్పల్లె కాపాడటం మొదలెట్టాం. తరువాత ఆయన ఇంటికి వెళ్ళి శీతారామయ్యగారి భార్యతో రోజులో మూడొంతులు—అంటే ఆయన ఆఫీసుకు వచ్చి మళ్ళా కొంపకు చేరిందాక ఆయన భారం మేము వహిస్తు న్నామని, ఇంటిదగ్గర వున్నప్పుడు ఆయనకు కష్టం కలుగకుండా చూసుకోవాలని ప్రమో షను ఎల్లాగూ కొద్దిరోజుల్లో వస్తుంది కనుక ఈలోపల ఈయన్ని నగలనీ. చీరలని బాధపెట్టొదని. కాస్త ఈయనకు యిష్టమైన కూరలు గట్రా వండిపెట్టమని సలహా



ఇచ్చాప.

శీతారామయ్యగారి గడ్డం. "చిట్టితమ్ము డు"లో శర్మగారి గడ్డం అంతకాక, మదన కామరాజు కథలో హీరో గడ్డమంత పెరి గిన తర్వాత ఒకరోజు ఉన్నట్టుండి ఆయ నకు ప్రమోషను వచ్చినట్టు పైనించి కాగి తం వచ్చేసింది. ఆరోజు మేము పొందిన ఆనందం యింతా అంతా కాదు. ఆయన్ని తెగ అభినందించాం. భుజాలమీద కూర్చో పెట్టుకొని ఆఫీసుఅంతా తిప్పాం. మాకే ప్రమోషను వచ్చినట్లు గంతులేశాం. ఇంకో సంగతేమిటంటే ఆయనకు ప్రమోషను యిచ్చి మా ఆఫీసులోనే మాపై అధికారిగా వేశారు. ఇక మనకు మంచిరోజులు వచ్చే శాయి మన శీతారామయ్యగారే ఆఫీసరు కనుక మనకష్ట సుఖాలు తప్పక ఆలోచిస్తారు అని సంతోషపడ్డాము.

శీతారామయ్యగారు చిరునవ్వుతో మా అభినందనలు స్వీకరించారు. క్లుప్తంగా థ్యాంక్సు. థ్యాంక్సు అని అందరికీ చెప్పారు.

తరువాత వారంరోజులకు ఆయన గౌర వార్థం ఒక పార్టీ ఏర్పాటు చేశాం. పూల దండలూ, ఫోటో వగయిరాలతో డబ్బుకు వెనక్కు తీయకుండా బ్రహ్మాండమైన యేర్పాటు చేసేశాం. శీతారామయ్యగార్ని పొగుడుతూ వుపన్యాసాలు దంచేశాం. మాలో కవిత్వ వాసనలున్న ఒకళ్ళిద్దరు పద్యాలు రాసేసి చదివేశారు. చివరకు ఆయన్ని ఒకటి రెండు ముక్కలు సెలవియ్యమని కోరాము.

శీతారామయ్యగారు గంభీరంగా కుర్చీ

లోంచి తేచారు. ఒక దగ్గు దగ్గి మెల్లిగా ఉపన్యాసం చెప్పటం మొదలెట్టారు. వారు చెప్పిందంతా దీన్లో రాస్తే మీరు ఈ పుస్త కాన్ని బ్రేకు వానులో వేసి తీసుకుపోవలసి వస్తుంది కనుక క్లుప్తంగా మనవిచేస్తాను. మొదట ఆయన మేము చూపిన గౌరవానికి ఎంతో కృతజ్ఞుణ్ణి అన్నారు. టీపార్టీలో ఒసగబడ్డ పదార్థాలు చాలవరకు బాగా వున్నాయని. కారబ్బూందిలో ఉప్పు ఎక్కు వపటం, టీలో కొంచెం పంచదార తక్కు వవటంలాంటివి బహుస్వల్ప లోపాలని, అవి పరిగణింపదగ్గవి కావని చెప్పారు. రెండు గంటలసేపు తమ పుట్టుపూర్వోత్త రాలను గురించి చెప్పారు. ఏవూళ్లో పుట్టింది. ఎక్కడ పెరిగింది. ఎక్కడ చదివింది. ఏ ఏ కోర్సులకు వెళదామనుకొంది ఖర్మ ఎందుకు మా సేసింది. ఉద్యోగంలో ఎల్లా చేరింది మొదలైనవి వివరంగా చెప్పారు. తరువాత ఆఫీసులో ఎల్లా పని చేయాలిసింది విశదీకరించారు. అందరము కష్టపడి పని చేయాలని, ఆఫీసుకు పేరు తేవాలనిఅన్నారు. చీటికిమాటికి సెలవలు పెట్టకూడదన్నారు. మరీ అవసరమైతే తప్ప నాయనమ్మకు తేలు కుట్టిందనో, తాతయ్యకు వాంతులనో సెలవలు పెట్టటం తనకు నచ్చదన్నారు. ఆఫీసుటైము వ్యర్థం చేయటం, ఫైల్సుమధ్య డిటెక్టివు నవలలు చదవటం, బాతాఖానీలు కొట్టటం లాంటివి చేయకూడదు అన్నారు. నాలుగింటినుంచి గడియారం చూస్తూ కూచో కుండా పని బాగా చెయ్యాలన్నారు. మాకు ఏవయినా కష్టాలుంటే, తమకు చెపితే వాటిని గురించి శ్రద్ధగా చూస్తామన్నారు.

ఇహ తాము పరిపాలనలో నూతన శకం ప్రారంభిస్తామన్నారు: జీతాలు, ఇంక్రి మెంట్లు. టి ఏ బిల్లులు లాంటివి చకచకా పంపించే యేర్పాట్లు చేస్తామన్నారు. ఎవరి పరిమితుల్లో వాళ్ళను పుంచుతాముగాని క్రింది వుద్యోగస్తులు. పైవాళ్ళను ఎదురు తిరిగి మాట్లాడటంలాంటివి సహించమన్నారు. అందరికీ న్యాయం కలిగేటట్లు చూస్తా మన్నారు. తమ హయాం కేవలం రామ రాజ్యాన్ని మరిపిస్తుందని. ఇంతెందుకు తాము ముందర జీపు ఎక్కి కూర్చుని. మిగతా తాబేదార్లను చక్రాలమీంచి పాకి ఎక్కి కూర్చోమనటంకూడా జరగదని నొక్కి వక్కాణించి ఉపన్యాసం ముగిం చేశారు. అరువు తెచ్చి ఎరేంజి చేసిన బల్లలు విరిగేలా బాదేసి, చేతులు నొప్పి పెట్టిందాకా చప్పట్లు కొట్టేం.

పదిరోజులకు అనుకోని సంఘటన ఒకటి జరిగింది. మా సీతారామయ్యగారికి షురో చోటుకి ట్రాన్స్ఫరు వచ్చేసింది. మేమందరం విచారసాగరంలో మునిగిపోయాము. కళ్ళ నీళ్ళతో ఆయనకు వీడ్కోలు చెప్పాము. శీతారామయ్యగారు కూడ మమ్మల్ని వదల లేక వదలలేక వదిలి వెళ్ళిపోయారు.

తరువాత కొన్నాళ్ళకు అసలు సంగతి తెలిసింది. తమకు ఇక్కడనుంచే ప్రమో షను అయింది గాబట్టి, ఇక్కడే ఆఫీసరుగా పనిచేయటం చాల కష్టమని, అందరూ తెలి సినవారు కనుక పరిపాలన సాగించటం దుర్లభమని శీతారామయ్యగారే పైకివ్రాసి ట్రాన్స్ఫరు తెప్పించుకొన్నారని.

హాలుని గాథలలో గోపాల బాలుడు

ఆసి దీని నైపుణ్యం నవిసిపోనూ ! ఎంత తెలివితేటలే ! దీనికీకూడా పుట్టిందీ వలపు వెర్రి ? వాణ్ని చూడగానే పూచిన పూవుల గురివిందలాగ ఊగిసలాడి పోతుంది. అంత ఇదవుతుంటే ఈ అపవారితకాలూ, అవహిత్థలూ దేనికి? మాకు లేవూ ప్రేమలు ? వాటిని తెలుపడానికి వేళలూ, పాళలూ లేవూ? ఏమిటో అనుకున్నాను. గడుసుదే !

నర్తనం జరుగుతూందా? జరిగినంతసేపూ ఎక్కడో ఉంది దాని మనసు. పదిమందితోపాటు కృష్ణుడూ చూస్తున్నాడా ! వాడి ఒక్కడి మెప్పే కావలసి వచ్చిందా దీనికి ? చూపంతా వాడిమీదే. ఇక్కడ అడుగులు కలవవే అంటే, వినిపించుకోనక్కరలే ? నర్తనం ముగిసిందా ? అందరూ కరతాళధ్వనులు చేశారు. బాగుంది.

దీని చతురత చట్టుబండలు కానూ. నా దగ్గిరికివచ్చి పొగడి, భుజం తట్టి, వీపు నిమిరి, చప్పున చెక్కిలి ముద్దు పెట్టుకుంది. చెలిమికత్తె సంతోషించిందిలే అనుకున్నాను. అందరినీ వరసగా ముద్దుపెట్టుకుంది. అందరినీ మెచ్చుకుందిలే, వెర్రిబాగులది అనుకున్నాను. దీని నంగనాచితనం ఇంగలంకానూ. పట్టేశాను, ముద్దుపెట్టుకోడానికి కారణం.

నర్తనం ఆగి అందరూ నిలబడ్డారా. అందరి చెక్కిళ్ళు మెరిసిపోతున్నాయి సంబరంతో. అటు తిరిగిచూశానో లేదో, మూడో గోపిక చెక్కిలిమీద ఏదో నీలంగా బొమ్మ కనిపించింది. తేరిపారజూస్తే కృష్ణుని బొమ్మ. ఎవరైనా గీశారా ? నర్తనం కోసం వ్రాయించుకొందా ? అనుకున్నాను. కాదు. అద్దంలో లాగ పడింది అచ్చు. మరొక గోపికను చూశాను. ఆమె చెక్కిలీ అంతే, గట్టుమీద నిలబడ్డ కృష్ణుని బొమ్మే అది. దీని తెలివితేటలు తరగిపోనూ. ఎలా కనిపెట్టిందో ముందుగానే. ముద్దుపెట్టుకుంటూ వెళ్ళుతున్నది. అక్కడే ఉన్నాడుగా. ముద్దుపెట్టుకోకూడదూ ? ఈ వగలూ, వయ్యారాలూ పోవడం కంటె ?

ఎలా వచ్చాయే నీకు ఈ విద్దెలు ? నిన్ను అనడం ఎందుకు ? ఆ మన్మథ మహారాజు ఉన్నాడే. వాడు పూనాడంటే ఇంతే నమ్మా ఇంతే. ఎక్కడ లేని జాణతనమూ వస్తుంది.

ణచ్చణ సలా హణణిహేణ
పాస పరి సంఠి ఆణి ఊణగోలీ!
నరిస గోవిఆణ చుంబఇ
కవోల పడి మాగఅం కణ్హాం. 2—14

(నర్తన శ్లాఘనిభేన - పార్శ్వ పరి సంస్థితా నిపుణగోపీ,
సదృశ గోపీనాం చుంబతి - కపోల ప్రతిమాగతం కృష్ణం.)



సీతాపతి కథ

బాలగంగాధర తిలక్

సీతాపతి తాపీగా కలం తీశాడు. ఒక తెల్ల కాగితం తీసుకున్నాడు. ఇటూ అటూ చూశాడు. ఎవరూ లేరు. సోఫాలో బొచ్చుకుక్క కళ్ళు మూసుకుని పడుకుని వుంది. గోడమీద గడియారం పక్కనే గాంధీగారి బొమ్మా నిర్మలంగా వున్నాయి. బల్లమీద వెండిగిన్నెలో కాఫీ చల్లారిపోతోంది. కాఫీ తాగి రాయనా, రాశాక తాగనా అన్న ఆలోచనతో ఓ నిముషం వుండిపోయాడు.

కనుబొమలు కుంచించి. పెదవులు బిగించి. కాఫీ తాగకుండానే కాగితం మీద యిలా రాశాడు.

"పెళ్ళాన్ని చంపెయ్యాలి."

అమ్మయ్య ! అనుకున్నాడు. స్తిమితంగా కలం టేబిలుమీద పెట్టి వెండిగిన్నె తీసుకుని కాఫీ ఓ గుక్క తాగాడు. అతనికి వొళ్ళు తేలికపడినట్టు అనిపించింది. ఆ ఆలోచన తన మనసులో వుండి తనని బరువుగా అస్తిమితంగా చేసి వేస్తోంది. ఇప్పుడా ఆలోచనని ఎత్తిపట్టుకుని నీట్‌గా కాగితం మీదకి దింపేశాడు.

ఆలోచన వుత్తినే మనస్సులో వుంటే పాదరసంలా పరుగెడుతుంది. కంగారు పెడుతుంది. రూపమూ గుణమూ ఉండవు ఆలోచనకి. ఇప్పుడు కాగితం మీద అక్షర రూపం దాల్చేటప్పటికి ఆలోచనకి ఒక మూర్తీ ఒక ప్రాణమూ ఒక వ్యక్తిత్వమూ వచ్చినట్టు అనిపించింది.

మళ్ళీ ఓ గుక్క తాగాడు. కాగితం మీద మళ్ళీ యిలా రాశాడు.

"బొచ్చుకుక్కని చంపెయ్యాలి."

కొంచెం నవ్వుకున్నాడు. తను కొంచెమే నవ్వుకున్నట్టు తెలుసుకొని తిరిగీ నవ్వుకున్నాడు. కాఫీ తాగడం పూర్తయే సరికి కాగితంమీద అతని ఆలోచనలు ఇలా వ్రాయబడి వున్నాయి.

"పెళ్ళాన్ని చంపెయ్యాలి.

బొచ్చుకుక్కని చంపెయ్యాలి.

పోస్టు మాన్‌ని చంపెయ్యాలి.

డాక్టర్ని చంపెయ్యాలి.

పక్కింట్లో వాళ్ళ అమ్మాయిని చంపెయ్యాలి."

సీతాపతి సంతృప్తిగా పడక కుర్చీలో వెన్ను వాల్చాడు. ఇటువంటి ముఖ్యమైన అయిదు హత్యలను చేసే గురుతర బాధ్యత తనమీద పెట్టుకున్నాడు. సీతాపతి పనిలేని వాడనీ, చాతకాని వాడనీ యింకెవరూ అనుకోరు. పేపర్లో, సినీమాహాళ్ళలో, శృంగాటకాలలో తనని గురించే చెప్పుకుంటారు. "అడుగో వాడే సీతాపతి." అంటూ ఆడవాళ్ళు కిటికీలలోంచి చూసి భయంగా గుసగుస లాడుతారు. మళ్ళీ నవ్వుకున్నాడు.

మనిషి అన్నవాడికి సాహసం వుండాలి. ధైర్యం వుండాలి. కత్తిలా దూసుకుపోవాలి. గుచ్చుకుపోవాలి.

"కాఫీ తాగారా ?"—సన్నని మృదు

వైన కంఠస్వరం గుమ్మంలో తెరవెనుక నుండి.

ఉలిక్కిపడ్డాడు సీతాపతి. తానింకా ప్రథమ కార్యక్రమం అయిన భార్యా హననాన్ని కొనసాగించనేలేదు. ఆమె బతికే వుంది. గుమ్మం తెర చాటునవుంది. భౌతికమైన ఖచ్చితమైన యథార్థమైవుంది. తాను వూరికే ఉత్తి ఆలోచనకే తృప్తిపడి పోతున్నాడు. గర్వపడిపోతున్నాడు.

"అయితే స్నానానికి లేవండి. వేణ్ణీళ్ళు తోలిపి పెట్టాను."

"అబ్బ ! బద్ధకంగా వుందే-"అన్నాడు విసుగ్గా. తన బతుకే ఒక విసుగు, ఒక అర్థంలేని పిచ్చిగీత.

తెర తొలగించుకుని "పోనీ టానిక్కు యివ్వనా. స్నానం తర్వాత చేద్దురుగాని లెండి." అందామె.

సోఫాలో పడుకుని వున్న బొచ్చుకుక్క వైపు చూశాడు—దీనంగా. తన భార్య తననీ ఆ బొచ్చుకుక్కనీ ఒకలాగే పెంచుతోంది. తనకి యిష్టా యిష్టాలు లేవు. వ్యక్తిత్వంలేదు. తన మనస్సునీ శరీరాన్నీ ఆమె ఎప్పుడో వప్పగించేసుకుంది. తనకి విముక్తి లేదు. బొచ్చుకుక్కకీలేదు. కుక్కని చూస్తూన్నకొలదీ తనకి తనే జ్ఞాపకం వస్తాడు. అందుకే తన ఆలోచనలలో రెండవ హత్యకి బొచ్చుకుక్కని లక్ష్యం చేశాడు.

"ఇదిగో తాగండి." పద్మావతి మృదువుగా మందు గ్లాసు నోటిదగ్గర పెట్టింది. లాలనగా తియ్యగా కళ్ళల్లోకి చూసింది. అందులోనూ అందమైన పద్మాలలాంటి కళ్ళతో. సింపిల్‌గా నాజూకుగా టాయిలెట్ అయి, దుస్తులు వేసుకున్న ఆమె వొంటి మీదనుండి యు డి. కలోన్ వాసన సుతారంగా వస్తోంది. ఇక్కడే వచ్చింది గటి చిక్కు. తన భార్య అసహ్యంగా లావు వుండకూడదూ? వెకిలిపి. వెర్రిదీ కాకూడదూ? అప్పుడు తనకి భర్తగా ఒక ప్రావఖ్యం అయినా వుండేది. పేపుకు తనమీద కసికొలదీ ఆమెని అందంగా, పొడుగ్గా చేశాడు. తియ్యగా, హాయిగా మాట్లాడుతుంది. అందరికీ పద్మఅంటే యిష్టం. ఎవరికిష్టంకాదు. పువ్వులతోవున్న పున్నాగ చెట్టూ, నగిషీల దంతపు గిన్నెలోవున్న అగరువత్తుల గుత్తీ, నక్షత్రాలతో మెరుస్తూన్న శరదాకాశమూ ?

మందు తాగాడు. తన జుట్టులోకి వేళ్ళు పోనిస్తూ అంది పద్మ. "వేణ్ణీళ్ళు కాగులో కాగుతూ వుంటాయి. పదిగంటలకి స్నానం చేస్తారా చెప్పండి ? ఈలోగా లైఫ్‌పత్రిక చదువుకోండి ఏం ?"

ఏ పత్రిక ఎప్పుడు చదవాలో కూడా పద్మ చెపుతుంది. చదివిస్తుంది. ఏం - తాను మాంచి డిటెక్టివ్ నవల చదవకూడదా ? పద్మ లైఫ్ పత్రిక అతని చేతికిచ్చింది. విసుగ్గా అంది పుచ్చుకున్నాడు.

"టొమాటో పెరుగుపచ్చడీ, ములక్కాడ సాంబారూ చేయిస్తున్నాను. ఇష్టమే కదూ." అంది పద్మ.

ఎటువంటి బానిస అయినా చరిత్రలో తిరగబడిన ఘట్టాలున్నాయి. చరిత్ర చదివాడు సీతాపతి. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలిచ్చిన మహామహులున్నారు, తాను





మాత్రం !

నాకు టొమాటో వద్దు" అన్నాడు ధైర్యం చేసి.

"మరేం కావాలి ?"

"గోంగూర పచ్చడి."

"గోంగూర పైత్యం. మీ వొంటికసలు పడదు. డాక్టరేమన్నాడో మరచిపోయారా ? అదీకాక టొమాటోలో కాలరీలు వుంటాయి. ఏం, నా బాబుకదూ" గడ్డం పట్టుకుని గోముగా అడిగింది పద్మ.

నేను అన్నమే తినను. విషం మింగి చస్తాను—అని అందామనుకున్నాడు సీతాపతి. కాని పద్మ అంతలో వెళ్ళిపోయింది. బానిస నోరు మూసేసుకోవాలి. లైఫ్‌పత్రిక చదవాలి. టొమాటోలు తినాలి. తప్పదు. రాజ శాసనం.

నీరసంగా వెనక్కి వాలిపోయాడు సీతాపతి. తనకి వివాహం అయిన దుర్ముహూర్తాన్ని నిందించుకున్నాడు. పట్టభద్రుడై, ఆస్తిలేక ఉద్యోగం లేక నా అన్న వాళ్ళు లేక (పెంచిన మేనమామ తప్పించి) ఉన్న తనని చూసి వరించి వలచి పెళ్ళి చేసుకుంది పద్మ. పాతిక ఎకరాల ఆస్తితో పెద్ద మేడతో వచ్చింది. ఇదిగాక యింకో ముప్ఫైవేలు ఆమె పేర బ్యాంకిలో ఉన్నాయి. తను అనుభవించే డబ్బూ తిండీ పద్మవి. ఎప్పుడేనా తనని నీచంగా, లోకువగా చూస్తుందేమో, తన నిరుద్యోగాన్ని హేళన చేస్తుందేమో—సాకుగా తీసుకొని దెబ్బలాడి తన అధికారాన్ని నిరూపించుకోవచ్చుననుకున్నాడు. కాని పద్మ ఏనాడూ పల్లెత్తుమాట అనలేదు. పైగా మీరే నా సర్వస్వం అంటుంది. ఆ యింట్లో అలా తింటూ తానుండడమే ఓ మహద్భాగ్యంగా ప్రవర్తిస్తుంది.

"పోనీ పొలంవెళ్ళి మక్తాలు వసూలు చేసుకురానా" అన్నాడొకసారి తనవల్ల ప్రయోజనం ఉందని తనని తానే నమ్మించుకోవాలని.

"మీరా !" పద్మ నవ్వింది. ఆ నవ్వు అలాగ ఆడవాళ్ళే నవ్వగలరు. ఆ నవ్వులో ఆరుగురు ఆనంద వర్ధనుల ధ్వన్యాలోకాలు ప్రతిధ్వనించాయి.

"ఏం - ఆమాత్రం చాతకాదా నాకు ?" అన్నాడు కోపంగా.

"ఎండలోపడి పొలాలమ్మట ఏం తిరిగి రాగలరు చెప్పండి. అసలే మీరు సుకుమారులాయిరి....పాత బకాయీలుంటాయి. పైగా రైతులు పండలేదనీ ఏదో యిబ్బంది వచ్చిందనీ ఏవేవో చెపుతారు. నిజా నిజాలు

చిక్కుప్రశ్న

"కారు అమితవేగంగా పోతున్నది. రోడ్డు పక్కనగాని, కారుకుగాని దీపాలు లేవు. ఎదురుగా నల్లని మనిషి, పూర్తిగా నల్లని దుస్తులలో వస్తున్నాడు. అతన్ని చూడగానే డ్రైవరు సడెన్ బ్రేకువేసి కారు ఆపేశాడు. డ్రైవరు ఎలా చూడగలిగాడో చెప్పగలవా ?"

"తెలియదు. ఎలా ?"

"ఏం లేదు. అది అట్టపగలే జరిగింది."

—"సురేఖ", రాజమండ్రి.

గ్రహించకలిగి వుండాలి. అవసరమైతే బెదిరించాలి. కొత్త రైతులకి భూములు మానుస్తామనాలి....గోవిందయ్య అనుభవం ఉన్నవాడు. నమ్మకమైనవాడు...."

పద్మ చెప్పుకు పోతూంటే సీతాపతి యింక వినలేకపోయాడు. గోవిందయ్య అంటే గుమాస్తా. నొసటిమీద నామాలూ, భుజంమీద గళ్ళ తువ్వాలూ, చంకలో గొడుగూతో ప్రత్యక్షమయ్యే నడివయస్సు దాటిన యీ గుమాస్తా తనకన్న తెలివైనవాడా ? నమ్మకమైనవాడా ? తన ప్రశ్నల్ని బాధల్ని మాట్లాడకుండా నమిలి మింగేసి ఊరుకున్నాడు సీతాపతి.

మక్తాలు పద్మ వసూలు చేయిస్తుంది. పన్నులు ఆమె కట్టిస్తుంది. కూరలు ఆమె కొంటుంది. ఒక గుమాస్తా, ఒక పాలేరూ ఒక వంటావిడా ఆమె సిబ్బందీ. జమా ఖర్చు ఆవిడ చూసుకుంటుంది. రాత్రి పడుకోబోయేముందు ఇంటి తలుపులన్నీ వేసి ఉన్నాయో లేదో ఆమె చూసుకుంటుంది. తనకి క్లబ్‌లో మెంబరు షిప్పుకి నెల నెలా రెండు రూపాయలు క్లబ్బు కుర్రాడికి ఆమె యిస్తుంది. తను క్లబ్బుకి వెళుతూంటే పేకాడవద్దనీ, అంతగా ఆడితే బ్రిడ్జిలాంటి గేమ్, తక్కువ స్టేక్సుతో వేసుకోమనీ ఓ పదో యిరవయ్యో తన జేబులో పెడుతుంది. తనమందులు ఆమె కొంటుంది. తన ఆరోగ్యాన్ని ఆమె రక్షిస్తుంది. తన అవసరాన్ని ఆమె నిర్ణయిస్తుంది.

తనకి పనిలేదు. బాధ్యతలేదు. తనకి అస్తిత్వంలేదు.

ఒకరోజున దెబ్బలాడి తన ఉనికి స్థిరపరచుకోవా లనుకున్నాడు. క్లబ్బునుండి ఆలస్యంగా రావాలనే వచ్చి, వక్కపొడి నముల్తూ మంచంమీద పత్రికని తిరగేస్తూ కులాసాగా కనపడిన భార్యని చూశాడు.

"నేను రాకుండా అన్నం తినేసి కూర్చున్నావు. నేనంటే కొంచెమైనా విలువ ఉందా నీకు ? ఈ యిల్లు నీది, భూమినీదీ....నేనెవణ్ణి ఉత్తి బానిసని....వెధవని....నా కొక గౌరవమూ గొప్పా యీ యింట్లో...." కోపంతో గటిగా అరిచాడు.

"ఎవరు చెప్పారండీ మీకు. ఈ వేళ శనివారం. నేను భోంచెయ్యనని మీకు తెలుసుగా" అంది పద్మ భర్త కేసి ఆత్రుతగా జాలిగా చూస్తూ.

అతని ప్లానంతా వృథా అయిపోయింది. శనివారం మాట మరచిపోయి ఫూల్ అయిపోయాడు. అయినా ఊరుకోలేదు సీతాపతి.

"అలా జాలిగా మాట్లాడుతావేం ? నేను అనాథ ననుకున్నావా, మతిలేని వాడి ననుకున్నావా ?"

"అ[illegible]తీ, మీరు కోపంతో కేకలు వేస్తూంటే, మీ డైజషన్ అసలే మంచిది కాదు, డాక్టరు చెప్పాడు. జీర్ణశక్తి పాడైపోయినప్పుడల్లా కారణం లేకపోయినా ఫిట్సులాగ యిలాగ కోపం, చిరాకూ వస్తూంటాయని, ఉద్రేకం అసలు పనికి రాదన్నాడు. ఇలాగ మీరు అలిసిపోతే ఎలాగ చెప్పండి. పోనీ, పళ్ళరసం, గ్లూకోజూ కలిపి యివ్వనా. సత్తువ చేస్తుంది."

ఓడిపోయాడు సీతాపతి. ఆమెకి కోపం రాదు. మరి రెచ్చిపోయాడు సీతాపతి. టేబిలుమీద వున్న రాధాకృష్ణ విగ్రహం

పట్టుకొని నేలకేసి కొట్టాడు. రాధా, కృష్ణుడూ ముక్కలు ముక్కలై వియోగం పొందారు.

ఆమె బెదరిపోయింది. భర్త మానసిక స్థితి ఆమెకి ఆందోళన కలిగించింది. అయినా అంతలోనే నవ్వింది.

"ఆ బొమ్మంటే మీకిష్టం లేదని తెలిసీ కూడా కొనడం నాదే పొరపాటు. పోనీ బొమ్మ బద్దలైనంత మాత్రాన వచ్చిన నష్టం ఏవిటీ. ఈసారి మీకు నచ్చినదే కొంటాను" అంది.

సీతాపతి గదిలోకి వెళ్ళిపోయాడు. జుట్టు పీక్కున్నాడు. ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. అనుకుంటూనే నిద్రపోయాడు. ఆమెవచ్చి కాశ్మీర శాలువ కప్పడమూ, కాళ్ళు వొత్తడమూ అతను నిద్రలోకూడా అలవోకగా గుర్తించాడు.

మధ్యాహ్నం భోజనంచేసి తను మంచం మీద వాలగానే వస్తాడు పక్కింటి వాళ్ళ అబ్బాయి. వాడిపేరు రవి. గుర్రపు జూలు లాంటి జుట్టు కళ్ళమీద పడుతూంటుంది. సన్నని పెదాలు హేళన చేస్తూన్నట్టుగా వుంటాయి. చిన్న లోతైన కళ్ళు—తుపాకీ గుళ్ళలా వొంట్లోకి గుచ్చుకుంటాయి. తీరికగా, బద్ధకంగా, రాజకుమారుడిలా వస్తాడు, ఇటూ అటూ చూస్తూ, తన మీద సూపర్వైజింగ్ ఆఫీసర్‌లాగ వచ్చి "హి హి హి" అని పెదవులు మూసి నవ్వుతాడు. నవ్వి "మా అమ్మ నన్ను తిట్టింది" అంటాడు.

"ఏం" అడిగాడు సీతాపతి "ఏఁవనీ ?"

"పనీ, పాటాలేకుండా పద్మమ్మ మొగుడిలా తయారవుతున్నావు వెధవా" అంది అన్నాడు సిచోపమకి బాధపడుతున్నట్టుగా. సీతాపతి కోపంతో "నిద్రవస్తోంది· వెళ్ళు" అన్నాడు.

రవి అక్కడున్న __వ్ పత్రిక తీసి బొమ్మలు చూస్తూ "అస్తమానూ నిద్దరేనా. నిజంగా మీకు పనీ పాటా ఏం లేదా" అన్నాడు.

సీతాపతికి అక్కడున్న సిరాబుడ్డి విసిరి కొట్టాలనిపించింది. "నీకెందుకు. పో కిందకి" అన్నాడు.

"పద్మత్త మీరు నిద్రపోకుండా చూస్తూండమని చెప్పింది. మీ డైజషన్ బాగా లేదట కదూ."

వొళ్ళు మండి మరోవైపు తిరిగి పడుకున్నాడు సీతాపతి. రవి లేచి యిటూ అటూ తిరిగి "రోజూ నడవకూడదూ మీరు ; అన్నం అరుగుతుంది. మా సైన్సు వాచకంలో వాకింగ్ చాలా మంచిదని రాశారు" అన్నాడు.

సీతాపతి జవాబివ్వలేదు. ఈ కుర్ర వెధవకి తనంత లోకువ ఎందుకై పోయానా అనుకున్నాడు.

"మీకు ఉద్యోగం ఎవరూ యివ్వరాండీ. మీకు చాతకాదా ?"


"విసిగించకు. పో" అని గట్టిగా అన్నాడు సీతాపతి. మామూలుగా అడిగితే అంత బాధ లేకపోను. కాని వీడు అడగడంలో, ఆ గొంతులో, ఆ మాటల్ని మెల్లగా, వెడల్పుగా ఉచ్చరించడంలో ఒక

అవహేళన. భరించరాని అసహ్యం ఉన్నాయి.

"మేం రోజూ చెడుగుడు ఆడుకుంటాం. మీరుకూడా వచ్చి ఆడకూడదూ."

సీతాపతి కోపం పట్టలేక మంచంమీద నుంచి దూకడమూ, రవి పారిపోవడమూ ఒకేసారి జరిగాయి.

రవి వచ్చినప్పుడల్లా యీ మాటలే యీ



సీతాపతి కోపంగా చూసి "హుఁ" అన్నాడు.

మళ్ళీ బల్లినవ్వినట్టు నవ్వి "అదీ రాదా. షేమ్ షేమ్" అన్నాడు రవి.

సంఘటనలే పాఠాంతరాలు పొంది ప్రదర్శిత మవుతూంటాయి. మెట్లమీద వాడి అడుగుల చప్పుడు వినపడగానే సీతాపతి హౄళ్ళ భయంతో, అసహ్యంతో ముడు

చుకుపోయింది. వాడు తన మేడ పిట్టగోడ నానుకుని నుంచున్నప్పుడు వెనకాలే వెళ్ళి అమాంతం వాడి రెండుకాళ్ళూ ఎత్తి కిందకి పడవెయ్యాలన్న ఉబలాటాన్ని ఎంతో కష్టంమీద అణచుకొన్నాడు సీతాపతి.

మధ్యాహ్నం కునుకుతీసి లేవగానే పోస్టుమాన్ కేక వినపడుతుంది. సీతాపతి గబగబా మెట్లు దిగుతాడు. అప్పటికే పద్మ కూడా గుమ్మందగ్గరకు వచ్చి నిలుచుంటుంది.

పోస్టుమాన్ సీతాపతిని చూసి నవ్వి "మీకేమీ లేవండి సార్. అన్నీ అమ్మగారికే." అంటూ ఓ దొంతర ఆమెకిస్తాడు.

పద్మ వాలిపోయిన సీతాపతి మొహాన్ని చూసి "అదేమిటోయ్. ఆయన్ని బట్టి గదా నాకీ ఉత్తరాలు వచ్చేది? నే నాయన సెక్రటరీని." అంటుంది.

"ఆయనకేం మహరాజు. హాయిగా తిని పడుకుంటే దొరలా వెళ్ళిపోతుంది. మా దొడ్డ జాతకంలెండి అయ్యగారిది." అని పోస్టుమాన్ చిరునవ్వుతో వెళ్ళిపోతాడు.

అతనెంత మంచి మనస్సుతో అన్నా ఆ మాటలన్నీ ఈటెలై సీతాపతి అభిమానపు గుండెలో గుచ్చుకుంటాయి. గబగబా లోపలికివెళ్ళి సోఫాలో దిగులుగా కూర్చుంటాడు. పద్మ బెదరుగా మెల్లగా లోపలికి వచ్చి "ఏవండీ. వీటికి జవాబులు రాసిపెట్టకూడదూ" అంటుంది అతన్ని సంతోష పరుద్దామని.

"నేను రాయను. రాయాల్సిన అవసరం నాకేమీలేదు. అసలు ఆ ఉత్తరాలెందుకో, సంగతి సందర్భాలేవిటో నాకేం తెలుస్తుంది?" అంటాడు పెడసరంగా సీతాపతి.

అతని కెవరూ ఎందుకు ఉత్తరాలు వ్రాయరో అతనికి అంతు పట్టదు. తాను వ్రాసిన ఉత్తరాలకికూడా భార్యపేర జవాబు వస్తుంది. కర్మ! "మీ ఆయన కోరిన పుస్తకం యీవూళ్ళో లైబ్రరీలోకాని, బుక్ స్టాల్‌లోకాని లేదుఅని చెప్పవలసింది."— ఇలా వుంటాయి ఆ జవాబులు. ఏడాది పొడుగునా అతనెంతమందికి ఎన్ని ఉత్తరాలు వ్రాసినా, ఒక్క యిన్స్యూరెన్సు కంపెనీ వాళ్ళు మినహా అతనిపేరు వ్రాయరు.

ఓసారి పద్మ వచ్చే ఎన్నికలని తలచుకుని "ఏవండీ మీరు ఓటెవరికి వేస్తారు" అంది.

"నాకు ఓటు వుండదు" అన్నాడు మూతి బిగించి సీతాపతి.

"ఏం?"

"నేను మైనరుని. కేరాఫ్ పద్మాదేవి గారిని."

ఫక్కున నవ్వింది పద్మ. అతన్ని పక్షానికి అదుముకొని "ఛ—అలాగ అనొచ్చునా. మిమ్మల్నిబట్టి గదా నాకున్న విలువా, పలుకుబడీ. ఉదయం నుండి రాత్రి వరకూ ఇన్నిపనులు చూసుకో కలుగుతున్నానంటే అదంతా మీరిచ్చిన బలమే కదా!" అంది.

ఆమె కళ్ళల్లో మెత్తని వెలుతురు తడి తడి నేలమీద నీరెండలా మెరిసింది. కాని సీతాపతి అదేమీ గమనించలేదు. ఆ మాటలలోని అర్థమూ, వాటితో వ్యక్తమైన

అపారప్రేమా అతను తెలుసుకొనే స్థితిలో లేడు. విద్రోహబుద్ధితో నిండిపోయింది సీతాపతి మనస్సు. అరబ్ దేశాలలో అర్ధరాత్రికి అర్ధరాత్రి coup (కూప్) జరిపే సేనానాయకుల ప్రవృత్తి అతనిలో భీకరంగా ప్రబలిపోయింది.

అతను కోరినవి తినేందుకు వీల్లేదు. డాక్టరు నిషేధం వుంది. అతని దినచర్య అతని వశంలో లేదు. డాక్టరు అంతా ఏర్పరచి వుంచాడు. దాన్ని తూచా తప్పకుండా పద్మ అమలు జరుపుతుంది. అతనికి తనకేమీ రోగం లేదని గట్టినమ్మకం. కాని పద్మకి నమ్మకం లేదు. అజీర్ణంకాని అస్వస్థతకాని ఏమైనా వుంటే నిర్వ్యాపారత్వం వల్ల కలిగిన ఫలితం మాత్రమే అని అతని ఉద్దేశ్యం. దేశంలో, ఖండాంతరాలలో వ్యాపించే రోగాలన్నీ కూడబలుక్కుని అమాయకుడైన, అందగాడైన తనభర్త దేహంలోకి ప్రవేశిస్తాయేమో అని ఆమె హమేషా కాపలా కాస్తూంటుంది.

ఓసారి అతను క్లబ్బు మిత్రులతో కలకత్తా షికారు వెళ్ళిరావాలి అనుకున్నాడు. ఎంతో ఉత్సాహంతో పద్మతో చెప్పాడు. పద్మ మొహం వెల వెల బోయింది. డాక్టర్ని పిలిపించింది.

"మీ ఆయనకి విశ్రాంతి అవసరం— ఇలాగ ఎండలో ప్రయాణం చేయడం మంచిదికాదు." అన్నాడు డాక్టరు.

సీతాపతికి వొళ్ళు మండిపోయింది. తనకి ఉన్నదే విశ్రాంతి : ఆ విశ్రాంతి బరువుకింద అతను నలిగిపోతున్నాడు. వ్యంగ్యంగా, మంటగా యిలా అన్నాడు.

"డాక్టర్. చేతనత్వం లేకండా వుంటే విశ్రాంతి బాగా లభిస్తుంది. అలా మార్చివెయ్యండి గట్టిమందిచ్చి. మీకూ పద్మకీ కూడా విశ్రాంతి వస్తుంది."

డాక్టరు చనువుగా తెలివిగా నవ్వాడు. "అమ్మాయ్. చూశావా చిరాకు, Nerves : Nerves :— నాకు నీమీద కక్ష ఏముందోయ్ సీతాపతి. అంతగా వెళ్ళాలని వుంటే, అమ్మాయినికూడా తోడు తీసుకువెళ్ళు. ఇవీ అవీ తింటూంటే ప్రయాణంలో చటుక్కున ఏ డయాబిటిస్‌లోకో, గాస్ట్రిక్‌ట్రబుల్ లోకో దింపుతుంది. మన జాగ్రత్తలో మనం వుండాలి. దేశానికీ దేహానికీ ఎప్పుడూ గట్టి డిఫెన్సు వుండాలి." అన్నాడాయన. పద్మకి పదేళ్ళనుండి ఫామిలీ డాక్టరాయన. వయస్సు అరవైదాటడం వలన ఆయన అనుభవజ్ఞుడనీ ఆయన చెప్పిన మాటలకి ప్రత్యేక విలువ ఉందనీ పద్మ నమ్మకం.

తాను మిత్రులతో కూడా కలకత్తా సరదాగా వెళ్ళిరావాలని అనుకుంటూవుంటే భార్యనికూడా తోడు తీసుకు వెళ్ళమన్న డాక్టరు సలహాలోని అవమానమూ, అవహేళనా సూదులు గుచ్చినట్టు బాధించింది సీతాపతిని. అసలు ఈ డాక్టరూ పద్మా కలసి ఏదో కుట్ర చేసి, ముందుగానే పెళ్ళి కాకముందే—నిషేధాలపట్టీ తయారు చేసి—తనమీద ప్రయోగించి తనని అస్వతంత్రుడినీ, అసహాయుడినీ చేసేస్తున్నారని గట్టి శంక కలిగింది సీతాపతికి. ఈ డాక్టర్ని, వృద్ధజంబుకాన్ని — కడతేరిస్తేకాని తన వొళ్ళూ తన మనసూ తనదికాదని నిశ్చయం చేసేసుకున్నాడు.

2

కమ్యూనిజం యొక్క సిద్ధాంతాలు తెలిసిన వాళ్ళకి తెలుస్తుంది. Exploitation — అంటే పరపీడన — అంటే ఏమిటో. చావకుండా బ్రతకకుండా అభ్యుదయమార్గాన్ని నిరోధించడం ఈ పరపీడన సాధనాల్లో ఒకటి. పద్మ ఓవేళ మార్క్సిజం క్షుణ్ణంగా చదివి, దాని నిజా నిజాలు తనమీద ప్రయోగాత్మకంగా రుజువు చేసుకుంటోందా అని సందేహించాడు. అయితే అతనూ నాలుగూ చదువుకున్న వాడూ, నేర్చుకున్నవాడూనూ. ధనిక వాదుల్నీ, సామ్రాజ్య వాదుల్నీ మంచితనం ద్వారా మనసు మార్చలేమని మార్క్స్ తెగేసి చెప్పాడు. దీనికి విప్లవమూ, హింసాయుతమైన తిరుగుబాటు ఒకటే మార్గం.

అందుకే సాహసుడైన సీతాపతి అయిదు హత్యల్ని చేయాలని సంకల్పించాడు. కాని ఏ ఒక్కటీ కూడా చేయలేకపోయాడు. ఇందుకు పిరికితనం మాత్రం కారణం కాదు. రేగిన ముంగురులతో, సోగ కళ్ళతో ఎర్రని రెండు చిన్ని పెదవులతో 'ఏమండీ' అని ఎంతో ముద్దుగా పిలిచే లాలించే భార్యని, మీదికురికి, మెడ వాటేసుకుని, పీక గబుక్కున నొక్కి ఠపీమని చంపివెయ్యడం మరీ ఘోరంగానూ భారతీయ సంప్రదాయానికి సంపూర్ణ విరుద్ధంగానూ అనిపించింది. అందులో పద్మవంటి పద్మాన్ని ఏ కఠోరహస్తం అయినా నలిపి రేకుల్ని తెంపి పారవెయ్య గలదా?

ఈ సమస్యా పరిష్కారం మార్క్సిజంలో లేదని గ్రహించేశాడు సీతాపతి. ఒక్క గాంధీజం ఒక్కటే అటువంటి క్లిష్ట పరిస్థితిలో దారి చూపించగలదు. భారత దేశం ధర్మాన్ని విడిచిపెట్టితే తాను భారత దేశాన్నే విడిచిపెట్టి వెళ్ళిపోతానన్నాడు గాంధీజీ. ఇదే మార్గం ఇప్పుడనుసరణీయంగా తోచింది సీతాపతికి. పద్మనీ, పద్మయిచ్చే సౌఖ్యాన్నీ, భోగాల్నీ, భద్రతనీ విడిచి తన వ్యక్తిస్వాతంత్ర్య రక్షణార్థమై వెళ్ళిపోవాలనుకున్నాడు.

ఆషాఢ శుద్ధ ఏకాదశి సోమవారం నాటి సాయంత్రం పద్మతో క్లబ్బుకి వెళుతున్నానని చెప్పి తిన్నగా రైలు స్టేషనుకి వెళ్ళిపోయాడు సీతాపతి. అంతకుముందు రోజున భార్య తనజేబులో పెట్టిన పది రూపాయల నోటు ఒక్కటే వుంది సీతాపతి దగ్గర, ఏవూరు వెళ్ళాలో ఘుండే ఆలోచించుకున్నాడు. పెళ్ళి కాకముందు విద్యానంతరం, తన సహాధ్యాయుడైన రామ

శ్రీశ్రీ ఉవాచ

ఒక సినిమా నిర్మాత "కథలో" అని గోలెత్తి పోతుంటే వెంటనే కంచికి వెళ్ళమని సలహా చెప్పారట శ్రీశ్రీ.

"ఎందుకూ ?"

"మన ప్రతికథా కంచికే వెళ్ళిపోయి, అక్కడ స్థిరపడుతున్నాయి. మీరు వెడితే అవన్నీ అక్కడ కొల్లలుగా దొరకచ్చు."

—సుకుమార్.

కోటితో కలసి అతనివూరు వెళ్ళాడు. ఎంతో అందమైన వూరది! పెద్ద చెరువూ కొబ్బరితోటలూ, అరటి తోటలూ, స్వచ్ఛమైన పుష్కలమైన గాలీ, ఆ గాలిలాంటి సుఖమైన మనుష్యులూ, పెద్ద కోవెలా, కోవెల నానుకుని వున్న సత్రమూ—ఆ వూళ్ళో ప్రశాంతంగా తన శేష జీవితం గడపాలనుకున్నాడు. రామకోటి ఆ నాడన్నాడు యిలాగ. "ఒరేయ్ సీతాపతీ. ఏదేనా వుద్యోగం దొరికే వరకూ యీ వూళ్ళో వుండి ట్యూషన్లు చెప్పుకోరాదూ. దగ్గర్లో హైస్కూలూ, కాలేజీ లేవు. ఎందరో ధనికుల బిడ్డలు మెట్రిక్కీ బెనారస్ పరీక్షలకీ, ప్రైవేటుగా కట్టాలని వుబలాట పడుతున్నారు. నెలకి రెండువందలు దొరుకుతాయి, నీకు శ్రద్ధవుంటే."

ఇప్పుడైనా తానక్కడ ఆ వూళ్ళో ట్యూషన్లు చెప్పుకొని సుఖంగా జీవించవచ్చు ననుకున్నాడు. రామకోటి ధనవంతుడూ, పలుకుబడి గలవాడూ కూడా. ఈ ఏడెన్మిదేళ్ళల్లోనూ ఆ గ్రామంలో హైస్కూలు వెలిసే దుర్యోగం పట్టి వుండదు. అవూర్లో తనని కాని, తన భార్యని కాని ఎరిగున్న వాళ్ళు లేరు. కాబట్టి తన ఉనికి ప్రసారమయ్యే వీలుండదు. అజ్ఞాతంగా, హాయిగా బతకొచ్చును అని అనుకున్నాడు సీతాపతి.

ఎటొచ్చీ ఆ వూరు రైలు స్టేషనుకి దగ్గర్లో లేదు. ఫలానా స్టేషన్‌లో దిగి కాలినడకనో, బండిమీదనో నాల్గు మైళ్ళు వెళ్ళితే కాని ఆవూరు చేరుకోలేడు. అయితేనేం- రాత్రి పదిగంటలకి ఆవూరు చేరుకుని రామకోటి యింటో హాయిగా పడుకుని……

సీతాపతి మనస్సు చివుక్కుమంది. తను యింట్లో లేకపోవడం, యింటికి రాకపోవడం చూసి పద్మ ఎంత బేజారైపోతుందో, సోగలైన ఆమె కళ్ళనుండి నిరంతరధారగా కన్నీరు కారుతూండగా కిటికీ లోంచి వీధి వైపు తనకోసం రాత్రంతా చూస్తూ నిట్టూర్పులు విడుస్తూ ఉంటుందో తలచుకునేటప్పటికి ఏదో బాధ కలిగింది. వెనక్కి వెళ్ళిపోదామా అనుకున్నాడు ఓ క్షణం. కాని యింతలో హరిశ్చంద్రుడూ, రామచంద్రుడూ, బుద్ధుడూ మొదలైన భార్యల్ని అమ్మేసిన, వదిలేసిన, విడిచేసిన—ఆర్యవీరులందరూ జ్ఞాపకం వొచ్చి అతన్ని కర్తవ్యపరుణ్ణి చేశారు.

రైలు వేగంగా వెళ్ళిపోతోంది. కొత్తగా సంపాదించుకున్న స్వేచ్ఛతో అతనికి రైల్లో మనుష్యులూ ఇటూ అటూ, పొలాలూ, కొండలూ అన్నీ కొత్తగా ఉత్సాహంగా అనిపించాయి. మందు తీసుకోమనీ, కందిపచ్చడి తినకూడదనీ, రాత్రి పది దాటాక మేలుకోకూడదనీ,—ఇలాగ అడుగడుక్కీ అడ్డంకులు, నిషేధాలు లేని స్వర్గంలోకి సజీవంగా ఎగిరిపోతూన్నట్టు అనిపించింది సీతాపతికి. చల్లనిగాలి వొంటికి తగిలింది. ఏవిటా అని ఆకాశంకేసి చూశాడు. మబ్బులు నల్ల నల్లగా, దొంతర్లుగా క్రమ్ముకుంటున్నాయి. గాలి వేగం హెచ్చింది. కోపన అయిన ప్రియురాలు చెంపమీద విసురుగా కొట్టినట్టుగా మొహానికి చురుకుగా తగులుతోంది చల్లగాలి. భావుకుడైన సీతాపతి మనస్సు ఆనందంతో ఆలోచనలతో నిండిపోయింది.

రాత్రి ఎనిమిది గంటలకి ఆగవలసిన స్టేషన్‌లో ఆగింది రైలు. ఊహాలోకంలోంచి చటుక్కున విడివడి సీతాపతి రైలు దిగేటప్పటికి కాని అతనికి వర్షం కురుస్తోన్నట్టు తెలియలేదు. ఆషాఢ మాసంలో మేఘాలు మేఘాల్లా వుండిపోక వర్షం అనే రూపాంతరం పొందుతాయన్న సంగతి అతను యిందాకటి ఉత్సాహంలో మరిచిపోయాడు. స్టేషన్ దాటి వచ్చేసరికి ఉన్న ఒకటి రెండు బళ్ళని ఆడవాళ్ళతో దిగిన ఆసామీలు చటుక్కున కుదిర్చేసుకున్నారు. సీతాపతికేమీ తోచలేదు. ఇంతవరకూ నీడపట్టున ఒకరి సంరక్షణలో తనని గురించి తాను ఆలోచించుకోవల్సిన అవసరం ఏమాత్రమూ లేని ఒక పరిస్థితిలో బతికిన సీతాపతికి ప్రాక్టికల్‌గా బతికే ఆలోచించే అలవాటు పూర్తిగా తప్పిపోయింది.

కొందరు వర్షంలో గొడుగులు వేసుకుని, కొందరు తడుస్తోనూ వెళ్ళిపోయారు. మరికొందరు లోపలే నిలబడిపోయారు. నాలుగుమైళ్ళ దూరం వర్షంలో నడిచి వెళ్ళడం అసాధ్యమూ, అవివేకమూ అనుకున్నాడు సీతాపతి. ఏం చేయాలా అని ఆలోచిస్తూ చూరునుంచి ధారలు ధారలుగా కారుతూన్న వాననీటిని చూస్తూ నిలబడ్డాడు.

"బాబూ, మీరెక్కడికి వెళ్ళాలి?"

ఎవరా అని తిరిగి చూశాడు. తన పక్కనే ఓ కుండలాల బ్రాహ్మణ వృద్ధుడు నిలబడి ఉన్నాడు.

ఫలానా ఊరని చెప్పాడు సీతాపతి.

"నేనూ అక్కడికే వెళ్ళాలి, ఎవరింటికి వెడతారు తమరు?" అన్నాడు వృద్ధుడు. సీతాపతి ధరించిన పల్చని పొందూరు పంచెనీ, తెల్లగా మిస మిసలాడే సిల్కు లాల్చీనీ భక్తియుతంగా చూస్తూ.

"ఒక మిత్రుని యింటికి-" ముక్తసరిగా చెప్పాడు సీతాపతి తన ఆలోచనలు పద్మ వైపు పోతూండగా.

కొంతసేపటికి వాన తగ్గింది. వృద్ధుడు గౌరవంగా "వాన తగ్గింది బాబూ. తుంపరకేం లెండి, ఇలాగ కూర్చుంటే రాత్రంతా యిక్కడే జాగారం చెయ్యాలి. రండి అడుగేస్తూ వుందాం. అరగంటలో మనఊరు వెళ్ళిపోవచ్చును" అన్నాడు.

సీతాపతి సమ్మతించి వృద్ధుడితో బయలుదేరాడు. మబ్బుల మూలాన చీకటి ఎక్కువగా వుంది. వృద్ధుడు తనని గురించి

గిరికథ

ఆదిభట్ల నారాయణదాసుగారు ఒకనాడు హరికథా కాలక్షేపం ప్రారంభిస్తూ "ఇవాళ హరికథ చెప్పనా? గిరికథ చెప్పనా?" అని నవ్వుతూ అడిగారట.

వెంటనే ఒక పెంకిఘటం "గిరికథ చెప్పండి చూదాం" అన్నాడట. దాసుగారు వో చిరునవ్వు విసిరి, "పార్వతీ పరిణయం" కథంతా ఆశువుగా చెప్పడం ప్రారంభించారు.

—సుకుమార్

చెప్పుకు పోతున్నాడు. ఆ ఊరి కోవెలకి తాను పూజారిననీ. కోవెలనే ఆనుకుని వున్న సత్రానికి యాజమాన్యం కూడా తనదేననీ. తనకి పిల్లలు లేరనీ. బంధువుల పిల్ల నొకదాన్ని పెంచుకుంటున్నాననీ. దానికి పెళ్ళి చేయాల్సిన బాధ్యత వొకటి తనమీద ఉందనీ....

సగం దూరం వెళ్ళేసరికి వర్షం దబదబ మొత్తింది. హోరున కురిసే వర్షంలో యిద్దరూ గబగబా నడవడం మొదలు పెట్టారు.



“అనుకున్నంత పనీ అయింది” అని సాగదీశాడు బ్రాహ్మణుడు వానమీద కోప్పడుతూ.

సీతాపతి తడిసిపోయాడు. పూర్తిగా మొత్తంగా, ఘోరంగా తడిసిపోయాడు. పంచె, లాల్చీ వొంటికిపట్టుకుని పోయాయి. పాపం చన్నీళ్ళ స్నానమైనా ఎప్పుడూ అలవాటు లేదతనికి. లోపల్నుంచి చలి గుబులు గుబులుగా బయలుదేరింది. పద్మ కళ్ళు ఆత్రంగా బాధగా చూస్తున్నట్టు అనిపించి చలించిపోయాడు. కాని మళ్ళీ ధైర్యంగా, మొండిగా ఊపిరి బిగించి నడవ సాగాడు.

ముసలాయనికి ప్రతిరోజూ సూర్యోదయాత్పూర్వం ఎంత చల్లని నీళ్ళల్లో అయినా మునిగే అలవాటేమో, ఈ వర్షం పిసరైనా బాధించలేదు. అయితే ఆయన ఆందోళనల్లా చంకలో తడిసిపోతున్న మూట గురించి మాత్రమే.

ఊరు చేరుకునేసరికి వర్షమూ తగ్గింది. విద్యుద్దీపాలు మందకొడిగా మెరుస్తున్నాయి. సీతాపతికి ఉత్సాహం వచ్చింది.

“రామకోటి యిల్లు తెలుసునా తాతగారూ మీకు ?” అని అడిగాడు.

“రామకోటి అంటే ?”

వివరించి చెప్పాడు సీతాపతి.

“అయ్యో నాయనా. ఈఊళ్ళో పొలమూ యిల్లూ అమ్మేసి పట్నం వెళ్ళిపోయాడు. రామకోటి తండ్రి పోగానే. మీకు తెలియదూ బాబూ”

సీతాపతి నెత్తిన పిడుగు పడినట్లయింది. ఏ ఆశతో వచ్చాడో ఆ ఆశ సమూలంగా పెకలింపబడి నట్లయింది. అతనికి కాళ్ళాడలేదు. మళ్ళీ కడుపులోంచి వొణుకు వచ్చింది.

”అయితే ఎలాగ ఈ రాత్రికి ? ఎక్కడ బస చెయ్యాలో ఏమో....” తనలో తనే గొణుక్కున్నాడు సీతాపతి.

“ఎంతమాట ! ఎంతమాట ! మీకు లోటు రానిస్తానా ! సత్రంలో బస చేద్దురుగాని” అన్నాడు పూజారి.

ఆఊరు పల్లెటూరయినా మంచి రోడ్లతో పెంకుటిళ్ళతో అక్కడక్కడ మేడలతో సుఖంగా ధనవంతంగా కనపడింది. విద్యుద్దీపాలు వుండడం వలన ఊరికి ఒక సందడి వచ్చినట్టుంది. పూజారి వెనకనే వొణుకుతూ సీతాపతి సత్రానికి వెళ్ళాడు.

సత్రంలో ఓ గదిలో ఒక పొడుగాటి మొద్దు బల్లమీద పరుపు అని పొరపాటుగా అనుకోనబడే ఒక వస్తువు నొకదాన్ని పరచి, దానిమీద ఓ దుప్పటీ వేసి పక్క తయారు చేశారు పూజారి కుటుంబం. సీతాపతి భోజనం వద్దన్నాడు, కాని వాళ్ళు (భార్యా భర్తా) జమిలిగా బలవంతంచేయగా విధిలేక అంతకుముందే వాళ్ళిచ్చిన బట్టలు కృతజ్ఞతతో ధరించిన సీతాపతి భోజనానికి లేచాడు. మేకులలాంటి ఎర్రన్నమూ, ఊరగాయా, కూరా రుచి చూసేసరికి తాతలు కనిపించారు సీతాపతికి. వాటిని నమలడం ఒక భారీ పరిశ్రమగా, ముద్ద గొంతు దిగడం ఓ గండంగా గడిచింది. నిజానికి అతనికి ఆకలిగాలేదు. అయినా తినకపోవడం -అంత బతిమాలినప్పుడు - బావుండదనుకున్నాడు. ఒకరు చెప్పినట్టు చేసే ప్రకృతి అతనిలో స్థిరపడి పోయింది. భోజనం చేస్తూ సీతాపతి అడిగాడు. “ఈ ఊళ్ళో ట్యూషన్లు ఏమైనా మంచివి దొరుకుతాయాండీ ?”

ముసలాయనా, భార్యా తెల్లబోయి ఒకరినొకరు చూసుకున్నారు. సీతాపతి ధనవంతుడన్న వారి అభిప్రాయాన్ని యీ ప్రశ్న చెదరగొట్టింది. ఇతనివాలకమూ, దుస్తులూ, వొంటి మిస మిసా, వేళ్ళని రాళ్ళుపొదిగిన రెండు ఉంగరాలూ—యివన్నీ బ్రతుకు తెరువులేని ఒక ప్రైవేటు మేష్టారి తాలూకని నమ్మడం కష్టంగా వుంది. అయినా ముసలాయన తిరిగి ప్రశ్నించగా, ట్యూషన్లే యిక తన జీవనాధారం అని జవాబిచ్చాడు సీతాపతి. ముసలాయన మనస్సులో చటుక్కున గొప్పవూహ మెరిసింది. ఇతడు సామాన్యుడే అయితే ఎదిగిన తన కూతురు నిచ్చి పెళ్ళిచేసి యింట్లో వుంచుకుంటే....? ఎదిగిన ఆ పెంపుడుకూతురే యిప్పుడు వడ్డన కావిస్తోంది. పళ్ళు కొంచెం ఎత్తు, కళ్ళు కొంచెం చిన్నవి అయినా భారీగా కన్ను చెదిరేటట్టుగా వుంది. ముసలాయనకీపిల్ల - సుబ్బలక్ష్మి అంటే ఎంతో ప్రేమ.

“ట్యూషన్లా ! వాకబు చేద్దాం నాయనా. నలుగుర్నీ అడిగి తెలుసుకుంటాను. ఇంతకీ మనదేఊరు నాయనా.”

తాపతి సరిగా జవాబివ్వలేదు. మజ్జిగ

చల్లగా కడుపులోపడేసరికి మళ్ళీ ఒణుకు వచ్చింది. ఎలాగో కళ్ళుమూసుకు తినేసి గదిలోకి వెళ్ళి పడుకున్నాడు. సుబ్బలక్ష్మి వచ్చి కంచెంబుతో నీళ్ళు అతని పక్క దగ్గర పెట్టి వెళ్ళిపోయింది.

తెల్లవారి లేచేటప్పటికి సీతాపతికి కళ్ళు మంటలుగానూ, వొళ్ళు నొప్పులుగానూ వుంది. అప్పటికే ముసలాయన మూడు సార్లువచ్చి చూశాడు సీతాపతి లేచాడేమో నని. రాత్రి ఆయన భార్యతో సంప్రతించాడు, సీతాపతిని అల్లుణ్ణి చేసుకునే విషయమై -

"కుర్రవాడు బుద్ధిమంతుడూ, మంచివాడూ, నా అనేవాళ్ళెవరూ లేనివాడూ అయివున్నాడు. కట్నం ఏమీ అడగడు బహుశా. అడిగినా యిచ్చుకొనే స్థితిలో మనం లేంకదా. ఏమంటావ్ ?" అన్నాడు.

"సెబాస్" అంది ముసలావిడ.

చాటుగా యీ సంభాషణని ఆలకించిన సుబ్బలక్ష్మికి వొళ్ళంతా విద్యుత్తు పాకినట్టయింది. సిగ్గు దొంతరలు దొంతరలుగా వొళ్ళంతా వ్యాపించింది. ఈ పెంపుడుతండ్రి తనకింక పెళ్ళి చేయగలడనే నమ్మకమూ, ఆశా లేదు ఆమెకి. దిగులుగావుంది. ఇప్పుడు వయస్సులో కొంచెం పెద్దవాడైనా, అందగాడైనవాడూ, చదువుకున్నవాడూ భర్తగా దొరుకుతాడన్న ఆశ ఆ వర్షాకాలంలో ఆమె గుండెల్లో వసంతాగమాన్ని సూచించింది.

సీతాపతి కళ్ళు తెరచి మళ్ళీ మూసుకున్నాడు. అతనికి వొళ్ళు స్వాధీనంలో ఉన్నట్టు లేదు. ఊరికే కళ్ళుమూసుకుని నిద్రపోవాలని వుంది. ఏదో కొత్తగా, చిరాకుగా వుంది. ట్యూషన్లు మంచివి సంపాదించుకోవాలన్న తహ తహ మనస్సులో ఎక్కువైపోతోంది. గది కిటికీలోంచి ఎండ నేలమీదకి పాకింది.

"నాయనా. లేచావా ?" అన్నాడు నాల్గోసారి వచ్చిన ముసలాయన.

సీతాపతి లేచి కూర్చున్నాడు.

"అమ్మాయి నీకు కావల్సినవన్నీ చూస్తుంది బాబూ. మొహమాట పడకు. ఇది నీ యిల్లే అనుకో." అన్నాడు ముసలాయన.

"అలాగేనండి."

కాసేపట్లో "కాఫీ తీసుకురానాండీ"అన్న సన్నని గొంతుక తలుపుచాటునుంచి వినపడింది. ఉలిక్కిపడి తలెత్తాడు. సుబ్బలక్ష్మి ఎడం జబ్బా, చీర కుచ్చెళ్ళూ కనపడుతున్నాయి.

"ఊఁ" అన్నాడు సీతాపతి.

సుబ్బలక్ష్మి యిచ్చిన కాఫీ నోట్లో పోసుకుని తెల్లబోయి ఆమెకేసి చూశాడు.

నిర్వచనం

రెండవ బహుమతి కథ : పాఠకులదృష్టిలో మొదటిబహుమతికి తగిన కథ.

"ఏమిటిదీ ?" అన్నాడు.

"కాఫీ అండి."

ఈ ద్రవాన్ని ఏమని పిలిచినా అతనికి బాధలేకపోవును. కాని బాధనీ కాఫీనీ గుటక వేశాడు తప్పని సరిగా.

"బావులేదా ?" అంది పెళ్ళికూతురు సిగ్గుగా.

"బావుంది" అన్నాడు. అరుచిని నోట్లో అనుభవిస్తూ-

"మరికాస్త కలిపి తీసుకురానాండీ"

"వద్దు వద్దు" అన్నాడు కంగారుగా.

"ఊఁ...." అన్నాడు సీతాపతి. ఈ కించిత్పరిచిత కన్యమీద అతని హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది.

సీతాపతి ఊళ్ళోకి వెళ్ళి రామకోటిని గురించి, ట్యూషన్ల గురించీ వాకబు చేదామనుకున్నాడు. ఈ పూజారియింట్లో తిష్ఠ వేయడం ఎంత నిర్లజ్జాకరమో అతనికి తెలియకపోలేదు. మంచంమీదనుంచి లేచాడు. గుమ్మం వరకూ వచ్చాడు. తల తిరిగింది. కణతలు టక టక కొట్టుకున్నాయి. ఒళ్ళు వణికింది. వెనక్కి వాలిపోయాడు మంచం



కాఫీ తాగి తలెత్తి చూశాడు. తలుపు చాటునే వుందామె.

"మీరింక బట్టలేమీ తెచ్చుకోలేదా ?"

"లేదు——"సీతాపతికి తన పొరపాటు తెలిసింది. కట్టుబట్టలతో యిల్లువదలి వచ్చేశాడు.

"రాత్రి విప్పేసిన మీ పంచె, లాల్చి ఉతికిపెట్టనా ?" అంది సుబ్బలక్ష్మి సీతాపతి రేగిన జుట్టునీ, తెల్లని వొంటినీ చూస్తూ ఆప్యాయంగా.

మీద. తనకి తీవ్రంగా జ్వరం——రాత్రి వానలో తడిసిన కారణంగా వచ్చిందని తెలుసుకున్నాడు. హతాశుడై పోయాడు. బెదరిపోయాడు కూడా. మెత్తని పరుపులతో మంచమూ, డాక్టర్లూ, నౌకరూ, వీళ్ళందరిపైనా వేయికళ్ళతో కనిపెట్టే పద్మా మనసులో మెదిలారు. అయితే తన ఈ పరిస్థితికి పద్మే కారణం అని తీర్మానించుకున్నాడు. అతనిలో పద్మ మీద కసి విపరీతంగా పెరిగిపోయింది. రాత్రి జేబులోనే తడిసిన డైరీ తలవేపునుంచి తీశాడు.

తెరిచాడు. తడి తడిగావున్న ఒక పేజీ మీద యిలా రాశాడు.

"పద్మ రాక్షసి."

అతని మనస్సులో ఒక్కసారిగా అతనికే జాలి కలిగింది. అతనికి చచ్చిపోవాలనిపించింది. అప్పటికి కాని పద్మకి పశ్చాత్తాపం కలగదు. పశ్చాత్తాపం ఎందుకు కలగాలో అతను స్పష్టంగా ఆలోచించలేదు. కాని కలగాలని మాత్రం అనుకున్నాడు. అతని కళ్ళు తడి అయాయి. సీతాపతి అనే ఉత్తముడికి కలగవల్సిన కష్టాలు కావు. యిటువంటివి అని నచ్చ చెప్పుకున్నాడు. మళ్ళీ డైరీలో యిలా రాశాడు

"ఒకవేళ నేను చచ్చిపోతే—కాకినాడ సూర్యారావుపేటలో వున్న నా భార్య అనగా పద్మాదేవి యింటో వున్న నా తాలూకు స్వంత ఆస్తి అయిన పుస్తకాలు ఏదేనా గ్రంథాలయానికి నా పేర నివ్వవల్సింది."

భోజనం వేళకి పూజారి వచ్చిచూశాడు. సీతాపతి అస్వస్థతకి ఎంతో ఆత్రుత కనపరిచాడు. భార్యతో కలిసి ఆలోచించి సుబ్బలక్ష్మిచేత మిరియం, వాము మొదలైన వాటితో కషాయం తీయించి ముగ్గురూ సీతాపతి దగ్గరకు వెళ్ళి తాగమని బలవంతం చేశారు. దీనంగా చూశాడు సీతాపతి దేవుడి దిక్కువైపు. తేనె, గ్లూకోజూ, పళ్ళరసం లాంటి అనుపానాలు లేకుండా అతను తలనొప్పి మాత్ర అయినా మింగలేదు. ముసలాయన ఆదేశంతో. సుబ్బలక్ష్మి తలాపి దిక్కున కూర్చుని సీతాపతి తల ఎత్తి నోట్లో చప్పున పోసింది కషాయం. సుబ్బలక్ష్మికి వొళ్ళంతా పులకలూ, సీతాపతికి చెమటలూ పట్టాయి.

"నీకు దగ్గరవాళ్ళెవరేనా ఉన్నారా నాయనా. కబురంపనా" అన్నాడు ముసలాయన.

"లేరు" అన్నాడు సీతాపతి.

ముసలాయన కోరుకుంటున్నదీ యిదే. నలుగురున్నవాడూ, నాలుగూ వున్నవాడూ తనకి అల్లుడయేందుకు సులువుగా అంగీకరించడని ఆయనకి తెలుసును. కోవెలలో అర్చకుడిగా తానిన్నాళ్ళూ చేసిన సేవకి భగవానుడి అనుగ్రహం ఈ సీతాపతి రూపంలో కలిగిందని నమ్మకం కలిగింది ఆయనకి.

"అయితే నువ్వొంటరివాడివే అన్నమాట. సంసారమూ, జంజాటమూ ఏవీ లేవన్నమాట."

"నాకెవ్వరూ లేరండీ—ఎవ్వరూ...."

నొక్కి పలికాడు సీతాపతి. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ముసలాయన ముసలావిడకేసి. ముసలావిడ సుబ్బలక్ష్మి వైపూ సాభిప్రాయంగా చూపుల్ని బట్వాడా చేశారు. సుబ్బలక్ష్మి సిగ్గుపడింది.

"జ్వరం తగ్గిపోతుంది నాయనా. జలుబున వచ్చి వుంటుంది. ఏమీ కంగారుపడకు నీకేలోటూ రానివ్వను. ఇంక ట్యూషన్లన్నావూ—బోలెడు దొరుకుతాయి. జ్వరం తగ్గాక యిద్దరం కలసి పెద్దలందర్నీ కలుసుకుందాం. ఈ సత్రం వసారాలోనే చదువుకునే పిల్లల్ని పిలిచి పాఠాలు చెప్పొచ్చును. దివ్యంగా వుంటుంది" అని భరోసా యిచ్చాడు పూజారి.

సుబ్బలక్ష్మి సీతాపతికి ఎప్పుడు ఏం అవసరమో అని ఆ గది చాయలనే రోజంతా తిరుగుతోంది. సాయంత్రం పూజారి వచ్చి మళ్ళీ కషాయం యిప్పించాడు. ఈసారి ఏవో ఆయుర్వేదపు మాత్రల్ని కూడా మింగించాడు. రాత్రికి జ్వరం ఎక్కువైంది. వొళ్ళు నొప్పులూ ఎక్కువయ్యాయి. సీతాపతి పూజారితో నీరసంగా యిలా అన్నాడు.

"ఖర్చులకి భయపడకండి. నా వేలి ఉంగరాలు రెండూ మీరు తీసుకోండి. ఒక ఇంగ్లీషు వైద్యుడిని పిలిపించండి. తెలుగు మందులు నాకు పడవు తాతగారూ."

"ఎంత మాట, ఎంతమాటన్నావు నాయనా. ఈమాత్రం దానికి మేం చెయ్యలేమూ. మేమేమైనా పరాయివాళ్ళమా. రేపు పొద్దుటే వస్తూ డాక్టర్ని తీసుకొస్తాను. ఆంజనేయులు సామాన్యుడు కాదు. గొప్ప హస్తవాసి ఉన్నవాడు. ఒక్క యింజక్షన్ యిచ్చాడా. జ్వరం పిలక పుచ్చుకుని లాగినట్టు చరుత్రన దిగిపోతుంది.

సీతాపతి తల వూపి కళ్ళు మూసుకున్నాడు.

"చూడు నాయనా. నీతో మనసులో మాట చెప్పక పోవడమెందుకూ? మా సుబ్బలక్ష్మి వుంది చూడు మహా ఉత్తమురాలు. దానికి పెళ్ళిచేసే బాధ్యత నాదేకదా. పిల్లకి పెళ్ళిచేసి పిల్లనీ, అల్లుణ్ణీ యింట్లో పెట్టుకొని వాళ్ళని చూసుకుంటూ రామా కృష్ణా అంటూ కాలక్షేపం చేయడమే నా అభిమతం. నీకూ ఎవరూ లేరు. సుఖంగా యిక్కడే వుండిపోవచ్చును. మా పిల్ల వొళ్ళు దాచుకునే మనిషి కాదు. శ్రద్ధగా నిన్ను కనిపెట్టుకుని యింటి పనులన్నీ దివ్యంగా చూసుకుంటుంది. నెలకి వంద తక్కువ కాకుండా నీకు ట్యూషన్ల మీద జీతం వచ్చేటట్టు చూసే పూచీ నాది. ముప్ఫై యేళ్ళు పైగా యీ పూజాపునస్కారాలు చేస్తూ నలుగురిలో ఓహో అనిపించుకున్నానే కాని వేరు కాదు! మా అల్లుడు చదువుకున్నవాడు. పాఠాలు చెప్తాడు అంటే ఎగిరి గంతేసి వస్తారు. ఏమంటావ్ పిల్లదాని వొంటిమీద రెండుతులాల బంగారం వుంది. కడుపున కన్న పిల్లలా చూసుకుంటున్నాం నాయనా. అంగీకారమేనా నీకు?"

ముసలాయన ఉండబట్టలేక తన అభిలాషని తెలియజేశాడు. సీతాపతి ఊఁ అంటే ఆయన జీవితాన్ని వేధించే ఒకే ఒక సమస్యకి పరిష్కారం దొరికి శాంతి సుఖాల్ని పొందగలడు. సీతాపతి చెప్పినదంతా విన్నాడో లేదో తెలియదు. జ్వర తీవ్రత, తలనొప్పి. మనసులో తెలియనికసి, దాని పక్కనే కొండంత దిగులూ— యిన్నింటితో మనస్సు మనస్సులో లేని ఒక దయనీయ పరిస్థితిలో వున్నాడు. ముసలాయన ఏమంటావ్ నాయనా అని మళ్ళీ రెట్టించి అడగ్గానే తల వూపాడు. ఎందుకు వూపాడో సీతాపతికి తెలియనే తెలియదు. కాని పూజారి

● ఫ్యాక్టరీని తనిఖీ చేయడానికి వచ్చిన ఇన్‌స్పెక్టరు మేనేజరుతో:— "మీ ఫ్యాక్టరీలో ఎంతమంది పనిచేస్తున్నారండీ?"
మేనేజరు: "సగం మందండీ."

మొహంలో సంతోషపు వెల్తురు అలుముకుంది.

సుబ్బలక్ష్మి వింటూండగా భార్యతో సీతాపతి అంగీకారాన్ని తెలిపాడు పూజారి. ఆవిడ సుబ్బలక్ష్మిని కౌగలించుకొని బుగ్గలు పుణికి దీవనలు కురిపించింది.

మూడవరోజు ఉదయం—శీతాపతి యిల్లు వదలి రెండురోజులు పూర్తి అయాయి. ఉత్సాహంలాంటి లేత ఎండ ఇళ్ళమీదా, చెట్లమీదా, పొలాలమీదా, శీతాపతి పడుకున్న కిటికీ అంచులమీదా సమబుద్ధితో ప్రసరించినా గ్రామం అంతా చైతన్య కోలాహలంలో మునిగివున్నా, సుబ్బలక్ష్మి తల దువ్వుకుంటూ పాటలు పాడుకుంటూన్నా, ఒక్క శీతాపతి మాత్రం ఆ ఆనందాన్ని పంచుకోలేక పోయాడు. పైగా బరువుగా మూలిగాడు. జ్వరం ఏమాత్రం తగ్గలేదు. అతనికి వొంటిమీద ఎవరో కాల్చిన ఇనుప కడ్డీలతో వాతలు పెడుతూన్నట్టు వుంది. సుబ్బలక్ష్మి తీసుకొచ్చి యిచ్చిన కాఫీ చేదుగా హాలాహలంలా వుంది. మరి కాసేపటిలోనే పూజారి యింగ్లీషు వైద్యుడు ఆంజనేయులుని తీసుకొచ్చాడు.

"చూడు నాయనా, డాక్టరుగారు వచ్చారు" అన్నాడు పూజారి.

శీతాపతి కళ్ళు తెరిచాడు. ఎదురుగా పంచెకట్టుమీద రంగుచొక్కా, దానిమీద ఇంకో రంగుకోటూ, మెడలో స్టెతస్కోపూ, మరోచేతిలో మందుల సంచితో ఆంజనేయులు కనుపించాడు. గుబురుగా పెరిగిన కనుబొమ్మలూ, లావాటి పెదవులూ, సగం బట్టతలా, సన్నంగా మనిషి, చాలా అసందర్భంగా వదులుగా వున్న అవయవాలూ—శీతాపతి నీరుకారి పోయాడు.

ఆంజనేయులు నవ్వుతూ "మీకు ఏ వైద్యం కావాలి." అని అడిగాడు.

ప్రశ్నార్థకంగా చూశాడు శీతాపతి.

"ఆంజనేయులుగారు యింగ్లీషు వైద్యమొక్కటే కాదు నాయనా. హోమియోపతీ, ఆయుర్వేదం, యునానీ లో కూడా సిద్ధహస్తులు. ఏమైనా ఇంగ్లీషువైద్యానికే గిరాకీ యిక్కడ. నాలుగేళ్ల పట్నంలో కాంపౌండరుగా వుండి వైద్యంలోని మెలకువలన్నీ గ్రహించేశారు. మహా సూక్ష్మబుద్ధి. గ్రామం అంతా వైద్యానికి వీరిమీద ఆధారపడి వుంది. పది పదిహేనేళ్ళ అనుభవం వుంది".

శీతాపతి నిస్పృహతో తల వూపాడు. కాకినాడలో పెద్దడాక్టర్లందరూ ఈపాటికి తన పాదాలదగ్గరుండేవారు కదా అని లోపలే వాపోయాడు.

ఆంజనేయులు భయం లేదని చెప్పి మాత్రలిచ్చి, తగ్గకపోతే యింజీషన్ (ఆంజనేయులు అలాగే వుచ్చరిస్తాడు.) యిస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం వేళకి శీతాపతికి నీరసంగా ఆకలిగా అనిపించింది. గుమ్మం అవతల సుబ్బలక్ష్మి కుంపటి అంటించి శీతాపతి తాగడానికి వేడినీళ్ళు కాస్తోంది. "అమ్మాయ్" అని పిలిచాడు. సుబ్బలక్ష్మి పవిట సవరించుకొని కాస్త దూరంలో నిలబడింది.

"నాకు ఆకలేస్తోంది" అన్నాడు మెల్లగా.

"కాఫీ కాచి తీసుకురానా ?"

"వద్దు. నాకు తినేందుకేమైనా కావాలి"

"అయ్యబాబోయ్. అన్నం తినకూడదు. లంఘణం వుండాలన్నాడు నాన్న."

"పోనీ అన్నం వద్దు—ఇంకేమైనా...."

బతిమాలుతూ చూశాడు శీతాపతి.

"జంతికలున్నాయి."

"కాసిని తెచ్చిపెట్టు."

తట పటాయించింది సుబ్బలక్ష్మి.

"ఎవరికీ చెప్పొద్దు. ఏవేనా తింటేకాని నాకు జ్వరం తగ్గదు."

సుబ్బలక్ష్మి చాటుగా రెండు రోజుల క్రితం చేసి డబ్బాలో దాచిన జంతికల్ని భక్తియుతంగా శీతాపతి చేతిలో పెట్టింది. కరకర నమిలి గ్లాసుడు మంచినీళ్ళు తాగి నిద్దరపోయాడు శీతాపతి. పద్మ వుంటే పండో, రొట్టె (బ్రెడ్) గాని యిచ్చివుండేది. కాని ఆ సదుపాయాలు యిక్కడ వీళ్ళకి తెలియవు. అర్థంకావు. అనుకున్నాడు శీతాపతి.

శీతాపతికి మెలకువ వచ్చేసరికి చీకటి పడుతోంది. అతనికి తల పోటుగా, దిమ్ముగా వుంది. వొళ్ళు కాలిపోతోంది. అతనికి పరిసరాలూ, పరిస్థితులూ అన్నీ మసకగా వున్నాయి. ఆంజనేయులు వచ్చి జ్వరం చూసి నూటనాలుగు డిగ్రీలుందనడం, ముసలాయన ఆతృతగా ఏవేవో అనడం, సుబ్బలక్ష్మి తడిగుడ్డ తలమీద వేయడం-ఇవన్నీ ఎక్కడో ఎవరినిగురించో జరుగుతూన్నట్టు వుంది శీతాపతికి.

రాత్రి శీతాపతి పక్కగానే తన పక్క వేయించుకున్నాడు ముసలాయన. సుబ్బలక్ష్మి తలాపి దిక్కున కూర్చుని తల కాస్తోంది. ముసలావిడ భయం భయంగా గుమ్మం అవతల కూర్చునివుంది. శీతాపతి అశాంతిగా నిద్రలోనే దొర్లుతున్నాడు. కలవరిస్తున్నాడు. పద్మ అంటున్నాడు. హత్య అంటున్నాడు. సందర్భంలేని ఆ మాటలకి అందరూ హడలిపోతున్నారు.

"సంధి లక్షణాలేమో" అంది ముసలావిడ.

"ఆంజనేయులుగార్ని పిలుచుకొస్తాను" అంటూ ముసలాయన కంగారుగా వెళ్ళాడు.

సుబ్బలక్ష్మి కనుకొలకులలో నీరు నిండింది. అయిదారేళ్ళనుండి తండ్రి తనకి వివాహప్రయత్నాలు చేసి చేసి విఫలుడయ్యాడు. ఇన్నాళ్ళకి—యిన్నేళ్ళకి తనకి మొగుడంటూ ఒకడు దొరికే అదృష్టం కలిగి—యింతలోనే వంచింపబడడంలోని అవమానమూ, బాధా ఆమెని దహించివేస్తున్నాయి. మనసులో వేయి దేవుళ్ళకి మొక్కుకుంది.

ఆంజనేయులు వచ్చి చూసి యింజక్షను యిచ్చి ఫరవాలేదని చెప్పి వెళ్ళాడు. ముసలాయన మెలకువ వచ్చిన శీతాపతికి ధైర్యం చెప్పాడు శీతాపతికి. మళ్ళీ నిద్రపట్టింది. నిద్రలో మళ్ళీ కలవరింతలు....

తల పట్టుతూన్న సుబ్బలక్ష్మికి తలగడ కింద డైరీ చేతికి తగిలింది. "ఏదో పుస్తకం నాన్నా" అంటూ తండ్రికిచ్చింది. ముసలాయన కళ్ళజోడు సవరించుకొని డైరీ పేజీలు పరిశీలించాడు. దీపకాంతిలో వేగంగా మారుతూన్న ఆయన ముఖ కవళికల్ని సుబ్బలక్ష్మి, తల్లీ తదేకంగా పరికిస్తున్నారు.


మేష్టారు:- "సింహళం ఎక్కడుంది ?"
పుత్రుడు:- "ఇండియాకి అరంగుళం దిగువ నుందండి."

ముసలాయన ముఖంలో భయం ఆశ్చర్యం పెనవేసుకున్నాయి.

"ఏమేవ్. ఏది నా అంగవస్త్రం యిలా పడెయ్యి." అన్నాడు తొందరగా.

"ఏం జరిగిందీ ?" అంది ముసలావిడ కంగారుగా.

"ఒంటిగంటకి కాకినాడ వెళ్లే బండివుంది నేను వెళుతున్నాను. ఇతగాణ్ని జాగ్రత్తగా చూస్తూవుండండి. అవసరమైతే ఆంజ



నేయుల్ని పిలవండి." చెప్పులు తొడుక్కుని గుమ్మంవరకూ వెళ్ళాడు పూజారి.

"ఇంత రాత్రివేళ ఈ ప్రయాణమేమిటి. అసలేం జరిగిందీ అంట ?'

"ఇతగాడికి యిల్లూ వాకిలీ అన్నీ వున్నట్టే కనపడుతున్నాయి. కలవారి కుటుంబంలోంచి వచ్చాడు. నేను ముందే అనుమానించాను. ఇక్కడ ఏ ప్రమాదం జరిగినా పీకలమీద కొస్తుంది. ఏ క్రిమినల్ కేసో వచ్చి జైల్లో కూర్చుంటాం."

పూజారి మళ్ళీ జాగ్రత్తగా శీతాపతిని సంరక్షిస్తూ వుండమని హెచ్చరించి వెళ్ళిపోయాడు. నోరావలించి చూస్తూ వుండిపోయారు భార్యాకూతురూ. ఇల్లూ వాకిలీ అన్నాడేకాని భార్య వుందా లేదా అన్న సందేహంతో సతమతమౌతూంది సుబ్బలక్ష్మి.

మరునాడు మధ్యాహ్నం వేళకి శీతాపతి చుట్టూ కూర్చున్న ఆంజనేయులూ, సుబ్బలక్ష్మీ, ముసలావిడ మ గుమ్మంముందు కారుచప్పుడు విని ఆత్రుతగా వచ్చారు. ఒక పెద్ద టాక్సీ ఆగివుంది గుమ్మంలో. పూజారి ముందుగా దిగాడు. వెనకాలే పద్మ, పద్మ తర్వాత స్టెదస్కోపు చేత్తోపట్టుకొన్న ఫామిలీ డాక్టరూ, గుమాస్తా గోవిందయ్యా దిగారు. గోవిందయ్యా, డ్రైవరు కలిసి రెండు మూడు బుట్టల సామానూ, హోల్డాలూ వగైరాలు దింపారు.

"ఎలావుంది ఆయనకి ?" ముసలావిడని అడిగింది పద్మ. ఆ గొంతులో ఆత్రుత, వేదనా యుగ యుగాల్ని ఛళదిళల్ని చీల్చుకు పోగలదు.

"శీతాపతిగారి ధర్మపత్ని పద్మావతీదేవిగారు వీరు. అలా రాయిలా నిలబడ్డావేం— లోపలికి తీసుకువెళ్ళు" అన్నాడు పూజారి భార్యతో.

"రండమ్మా రండి—" అంది. అప్పటికి అర్థమై తేరుకున్న ముసలావిడ. "మీ ఆయనకేం భయంలేదు. ఇంక మీరే వచ్చారుగా."

ఆంజనేయులు పెద్ద డాక్టరు రావడం చూసి ఏ సందులోంచి ఏనిముషంలో జారిపోయాడో ఎవరికీ తెలియదు.

శీతాపతి నీరసంగా కళ్ళెత్తి చూశాడు. ఫామిలీడాక్టరు పరీక్ష చేస్తున్నాడు. తన తల ఏదో పరిచితమైన మెత్తని తొడమీద ఆనించి వుండడం గ్రహించాడు. కళ్ళెత్తి పైకి చూశాడు. పద్మ — నీరసించి కృశించిన విదియచంద్రుని రేకలాగా, వడలిన రాలిన పువ్వురేకులా—తన తలనే నిమురుతోంది. ఆమె కన్నుల వెంబడి సంతత బాష్ప స్రవంతి చెక్కిళ్ళనీ, పమిటనీ తడిపివేస్తోంది.

శీతాపతి మొహంలో చటుక్కున ఏదో కాంతి, కాంతిసంతంగా, అలముకుంది. "వచ్చావా పద్మా.' అన్నాడు మెల్లగా.

రుద్ధమైన పద్మ కంఠంనుండి మాట రాలేదు. జవాబుగా తల వూపింది.

గోవిందయ్య బుట్టలు తెరచి పళ్లూ, గ్లూకోజూ, హార్లిక్సూ, మందులూ మొదలైన సరంజామాని గది అలమారాలో సర్దుతున్నాడు.

"మహాయిల్లాలు. సాక్షాత్తు లక్ష్మీదేవి. ఆమె ఎంత బెంగపడిపోయిందో, ఎంత మందిని ఎన్నిదిక్కులకు పంపించిందో.— ఓహోహో ఎంత అందమైన భవంతీ— నౌకర్లూ చాకర్లూ ఏం సిరీ ఏం సంపదా— నిష్కారణంగా యిల్లువదలి యీ వూరు రావడమేఁవిటీ విడ్డూరం కాకపోతే – ఇంకో రోజు ఆలస్యమైతే ఆవిడ ప్రాణాలే వదిలేసును—రామ రామ, ట్యూషన్లు చెప్పుకుంటానంటూ ఈయన దేవిరించడమేఁవిటీ" ముసలాయన మాటలోంచి మరోమాటలోకీ, భావంలోంచి మరో భావంలోకీ గంతులేస్తూ ఉత్సాహంగా చెపుతున్నాడు. వీరి సిరిసంపదలకీ, పద్మ పతిభక్తికీ ఆయన హృదయం గౌరవపూజ్య భావాలతో నిండిపోయింది.

సుబ్బలక్ష్మి ఎంతో నిరాశ చెందినా, పద్మ అందాన్ని చూసి లోపల్లోపల మెచ్చుకోకుండా వుండలేకపోయింది. ఇదంతా సినీమాలా, కలలా వింతగా వుంది ఆమెకు.

డాక్టరు గారు పరీక్ష పూర్తిచేసి, ఇది మామూలు ఫ్లూ జ్వరమనీ, జ్వరం కన్న మానసికాందోళన వల్ల ఎక్కువగా సీతాపతి బాధపడుతున్నాడనీ, భయపడవల్సిన అవసరం ఏమీ లేదనీ చెప్పాడు. పద్మ నిట్టూర్చింది.

"డాక్టరుగారూ, ఈయన్ని కదిపి మన వూరు తీసుకు వెళ్ళొచ్చునా—యింత జ్వరంలో."

డాక్టరు నవ్వాడు. "నువ్వు వచ్చాక యింకా జ్వరం ఎందుకుంటుందమ్మా. చల్లపడగానే సాయంత్రం బయలుదేరుదాం."

అన్నాడు.

"ఎంతమాట ఎంతమాట! ఈ పేదవాడి యింటికి రానే వచ్చారు. ఒక్కపూట ఆతిధ్యం స్వీకరించి నన్ను ధన్యుణ్ని చేసి—" అర్థోక్తిలో ఆపాడు పూజారి.

గోవిందయ్య కలిపి ఇచ్చిన హార్లిక్సు తాగి పద్మ వొడిలో తలపెట్టుకుని నిద్ర పోయాడు సీతాపతి. గదిలో ఎవరూ లేరు. పద్మ మెల్లగా విసురుతూ కూర్చుంది. కాసేపటికి సీతాపతికి మెలకువ వచ్చింది. దీర్ఘంగా ప్రేమగా చూశాడు పద్మవైపు.

"ఎందుకిలా చేశారు మీరు?"—గద్గదికంగా అడిగింది పద్మ.

సీతాపతి ఏం జవాబివ్వలేదు

"ఇంకెప్పుడూ యిలా చేయనుకదా"

సీతాపతి చెయ్యనని తల వూపాడు.

డాక్టరూ, సుబ్బలక్ష్మీ గదిలోకి వచ్చారు. సుబ్బలక్ష్మి చేతిలో పళ్ళెంలో పళ్ళూ, ఫలహారాలూ వున్నాయి.

"అమ్మాయ్. నువ్వీ నాలుగు రోజులూ నిరాహారదీక్షతో వున్నావు. నీ భర్తకన్న నువ్వే నీరసంగా వున్నావు. కాస్త ఫలహారం తీసుకుని పాలు పుచ్చుకో." అన్నాడు డాక్టరు.

పద్మ డాక్టరు ఆదేశాన్ని పాలించింది. ఈలోగా సీతాపతి తలగడకింద వున్న డైరీ తీశాడు. మెల్లగా యిలా రాశాడు.

"పద్మ దేవత"

ఏం రాస్తున్నారా అని కొంచెం వొంగి చూసిన పద్మ తృప్తిగా నవ్వింది. ఎందుకో తెలియని సుబ్బలక్ష్మి నవ్వింది. డాక్టరూ నవ్వాడు.

సాయంత్రం భర్తతో వెళ్ళిపోయేముందు పద్మావతి పూజారి కుటుంబానికి తన కృతజ్ఞతను తెలియపరచింది. పూజారివల్ల కథ అంతా ఆమె ముందే వినివుంది. సమయానికి ఈ అర్చక మహాశయుడు తోడుగా లేనట్లయితే సీతాపతి ఏమై వుండేవాడో ఊహించటానికి కూడా ఆమె భయపడింది.

పూజారికి పూజారి భార్యకీ నమస్కరించి సుబ్బలక్ష్మి బుగ్గలు పట్టుకుని "నీకు మంచి మొగుడు రావాలని ఆశీర్వదిస్తున్నాను. నా భర్తలాంటి వాడిని కట్టుకున్నా సుఖపడేది ఏమీవుండదు. రాత్రీ పగలూ ఆయనకి ఎంతో సేవ చేశావు. లక్ష్మీ. నీ మంచితనం నీకు సౌభాగ్యాన్ని చేకూరుస్తుంది. నీ పెళ్ళికి రాగలనో లేదో, ఇప్పుడే నీకు నా కానుక యిచ్చేస్తాను. నీ అక్కనీ. ఆమె ప్రేమనీ మరిచిపోకమ్మా." అంటూ మెడలోంచి రెండు పేటల గొలుసుతీసి సుబ్బలక్ష్మి మెడలో వేసింది.

పూజారి ఏదో అనబోయాడు. ముసలమ్మ ఏదో అనబోయింది. సుబ్బలక్ష్మి సిగ్గుగా తికమకగా చూసింది కాని ఏమీ వినకుండా పద్మ చరాలున కారులో కూర్చోవడమూ, బుర్రున కారు కదలడమూ జరిగింది. ●

హోదా

"ఎలా వుందోయ్ నీ కొత్త వుద్యోగం?"
"ఉద్యోగానికేం? నాకింద వందమంది పనిచేస్తున్నారు."
"నిజంగా?"
"అవును. నేను పనిచేసేది మూడో అంతస్తులో."

మధురమైన సంగీతం వింటుంటే జన్మాంతర స్నేహాలన్నీ జ్ఞాపకం వస్తాయంటాడు మహాకవి కాళిదాసు.

రాజేశ్వరరావు సంగీతం వింటుంటే - పొదరింటినుంచి పొంచి చూచే చందురుడు, యమునా తటిపై శ్యామసుందరుని మురళి, ఆ తోటలోని అందగాడెవరే అని ప్రశ్నించే రాజకన్య, నీహారహిమ నీలాంబరధారిణి అయిన విభావరి, రాసలీలా మనోజ్ఞధామమైన బృందావనం ఇంకా ఎన్నెన్నో సృష్టిలోని అందమైన వస్తువులన్నీ మనల్ని పలకరిస్తాయి.

దాదాపు రెండు దశాబ్దాలనుంచి ఆంధ్రదేశంలో స్వరఝరంపరగా పరవళ్ళు తొక్కుతున్న ఈ సంగీతలహరి వెనక దాగిన వ్యక్తిత్వం ఎటువంటిది? అది వెలయించిన ఇంద్రధనుస్సుల వెలుగుల వెల ఏపాటిది? దాని అనుభవసారం ఎంతటిది? దాని మాధుర్య తీరం ఎక్కడ?

పేజీ తిప్పండి!

హాయిగ పాడుదునా?

పి. బి. శ్రీనివాస్

నేను కవినికాను. గాయకుణ్ణి. రచయితను కాను. రాగాలాపకుణ్ణి. అయినా జ్యోతి సంపాదక వర్గంవారు నన్ని వ్యాసావళి వ్రాయవలసినదిగా కోరినంతనే వెంటనే కొంత తటపటాయించినా, చిత్రసీమలో నాకు వ్యక్తిగతంగా పరిచయస్థులూ, స్నేహితులూ అయిన సంగీత దర్శకులనుగురించి, వారిలోని మంచి విషయాలను గురించి, వారితో నా అనుభవాలను గురించి నా చేతనయిన రీతిని వ్రాయడానికే సంకల్పించుకున్నాను.

ఈ రచనల్లో నాకత్యంత ప్రియమైన హాస్యరసం కోసం తాపత్రయమే తప్ప, వ్యంగ్యాని కేమాత్రమూ తావులేదు. అనుకోకుండా పొరపాటున వ్యంగ్యమెక్కడైనా స్ఫురిస్తే, అది నాతప్పు కాదు. కాకతాళీయ మనుకోమని నా మనవి. వ్యక్తుల సుగుణగణ ప్రశంసతోనేకాని, వారి దోషవిచారణ వివరణలతో మనకు నిమిత్తంలేదు. ఉండకూడదు. వారి కళాకౌశలం, అనుభవవైశిష్ట్యం, సౌశీల్య సౌరభం, సౌజన్యాది సద్గుణ సౌందర్యం మనకు కావలసిన అంశాలు. తదితరాలుకావు. ఎవరి మనసునుగాని నొప్పించడం నా ఉద్దేశ్యంకాదు. అభిమతం కాదు. చదువుకుంటూ పోతూవున్న సమయంలో మధ్య ఎక్కడైనా మీకు నవ్వువస్తే చిన్నగా, సన్నగా నవ్వుకోండి. లేకపోతే వూరుకోండి. అంతే! ఏ విషయంలోనూ అపార్థం మాత్రం చేసుకోకండి.

మామూలుగా మనం మాట్లాడుకునేటప్పుడు వాడుకుంటూ వుండే విదేశీయ పదజాలం అక్కడక్కడ తప్పనిసరిగా ఉపయోగించవలసి వచ్చింది. కారణమేమంటే, వాటికి తెలుగు తర్జుమా చేసి వ్రాస్తే పిల్లి కర్థం మార్జాలం అని చెప్పినట్టవుతుందేమోనని భయం. అంతేకాని ఇంగ్లీషు, హిందీ, అరవం ఆదిగాగల పరభాషా పాండిత్య ప్రకర్ష కోసం కాదని మనవి. ఎటొచ్చీ కొన్నిచోట్ల ప్రాసకోసం ప్రాకులాడేనన్న విషయం మీకందరికీ ఎలాగూ విదితమైపోతుంది. తప్పో ఒప్పో చెప్పలేనుగాని, నేను రైముకీ రిథిముకీ దాసుణ్ణి. ఫొనెటిక్స్ ప్రియుణ్ణి. ఇదే నాలోని ప్రబలమైన దౌర్బల్యం. సాహిత్యపరంగానూ, భాషాపరంగానూ పరికిస్తే, దోషాలు దొర్లుతూ వుండక పోవు గనకనూ ఈ వ్యాసాలలో నేను ప్రాధాన్యమిస్తున్నది సంగీతానికి, సంఘటనలకి, వ్యక్తుల తత్త్వాలకి గనకనూ ఆ యా దోషాలను విస్మరించి అనుగ్రహించ గలందులకు పాఠకులు నాచే ప్రార్థితులు.

* * *



శ్రీ సాలూరు రాజేశ్వరరావుగారి గురించి తెలియని వారెవరూ తెలుగుదేశంలో వుండరు. తెలుగుదేశంలో మాత్రమే అనుకోవడం దేనికి ? "చంద్రలేఖ" చిత్రం ద్వారా వీరి సుమధురమైన సంగీతాన్ని యావద్భారతదేశమూ విని ఆనందించింది. అభినందించింది. అలాంటి జగమెరిగిన జగజెట్టిని గురించి వ్రాయబూనడం నాలాంటి వారికి మహా సాహసమనే అనాలి న్యాయానికి. అయినా నాకూ వారికీగల వ్యక్తిగత వ్యాపారిక, కళాత్మక సాన్నిహిత్యాన్నీ, స్నేహాన్నీ పురస్కరించుకుని వారితో నాకు కలిగిన కొన్ని అనుభవాలను మీకు తెలియజేయగోరి వ్రాయుట కుపక్రమిస్తున్నాను.

ఈయన భలే తమాషా మనిషి. విచిత్రమైన వ్యక్తి. ఎవరితోనైనా ఇట్టే పరిచయం చేసేసుకుని సరదాగా మాటాడేయగలిగే శక్తి వుంది. ఆ ధోరణిలో నవ్వుతూ నవ్విస్తూనే నసాళానికి అంటిపోయే జోకులు బ్రేకు లేకుండానే స్వీట్ కేకుల్లా తెగవేయగలిగే నేర్పువుంది. వేషభాషలలో చాలా సింపుల్‌గా, సాదరదాగా వుంటారు. మొదట్లో వీరి చేతిలో సదా గొడుగుండేది. "మరొకరు మనకి గొడుగు పట్టవలసిన యోగం మన కుండగా, మనకి మనమే గొడుగెత్తుకోవలసిన అవసరమేమి" అనుకునే అహంభావం వీరిలో శూన్యం. నిరాడంబరజీవి. మడచిన ఫుల్‌షర్టూ, గూడకట్టూ, చంకలోనో, చేతిలోనో మ్యూజిక్ ఫైలూ, మ్యాజిక్‌లా ఆకర్షించే మాటల ధోరణీ, అనుకరణీయమైన రాగాలకరణీ, సంభాషణలో మధ్య మధ్య నవ్వుల కామాలు - ఇవి వీరి వ్యక్తిత్వంలోని కొన్ని ప్రత్యేకతలు. వీరివద్ద ఇద్దరు తమిళ సహోదరులు సహాయ సంగీత దర్శకులుగా పని చేస్తూ వుంటారు. రాజగోపాల్, కృష్ణన్ అనే ఈ ఇరువురూ శాస్త్రీయ సంగీత ప్రవీణులు. జంటగాయకుల్లాగ వీరిద్దరూ ఒకేసారి పాడుతూ రాజేశ్వరరావుగారు కట్టిన ట్యూనులు మాకు రిహార్సల్సులో వినిపిస్తూవుంటే మా అందరికీ భలే యిదిగా వుంటుంది. భాషావ్యత్యాసం గమనించకుండా వారికి తమవద్ద పనిచేసే సదవకాశం కలిగించారంటే వీరి ఉదార స్వభావాని కదొక మహావహమైన ఉదాహరణ.

రాజేశ్వరరావుగారి సంగీతాన్నే కాక, స్వరాలు ధ్వనించే వారి సంభాషణలూ, చమత్కారం స్ఫురించే ఛలోక్తులుగూడా విని ఆనందించడంతో వూరుకోక వాటిని అనుకరించేవారు అత్యధిక సంఖ్యలో వుంటారు. వున్నారు. అలాటివాళ్ళలో నేను గూడా ఒకణ్ణి. వీరి పరోక్షంలో వీరి సంభాషణలూ అవీ అనుకరిస్తూ, మిత్రులందరికీ వినిపిస్తూ, వారితోపాటు నేనుకూడా ఆనందిస్తూ వుంటా. మనలో మనమాట. ఆయన కెదురుగా ఎన్నడూ ఇలాటి చేష్టలు చేయలేదనుకోండి. కాని ఒకవేళ అలవాటులో పొరపాటుగా నేనలా చేసినా, ఆయన నన్ను పార్థం చేసుకోరనే ధైర్యం, నమ్మకం నాకున్నాయి. ఏమో ! చూడాలిమరి !

రాజేశ్వరరావుగారి పాట, దాని ప్రాశస్త్యం వర్ణించాలంటే మానవుల తరమా ! సాక్షాత్తూ వేణు ప్రవీణుడైన ఆ శ్రీకృష్ణుడే ఒప్పేసుకున్నాడాయె. "పాట పాడుమా !



శ్రీనివాస్ : "మీరు కాకపోతే ఇంకెవరు హాయిగా పాడగారు మాష్టారూ ?"

కృష్ణా ! పలుకు తేనెలొలుకు నటుల" అని రాజేశ్వరరావుగారు మురళీధరుణ్ణి అడిగినదే తడవుగా, "నీ అంత హాయిగా నేను పాడగలనా? నువ్వే పాటపాడు. నేను పూటు వాయిస్తాను" అనేశాడు. (చూడుడు: 'జ్యోతి' కృష్ణాష్టమి ప్రత్యేక సంచిక)

తేనె గొంతు

ఈయన గొంతులో వింత మాధుర్యముంది. పాట సాహిత్యానికి సంగీతాన్ని జతచేర్చి మంచివరస కట్టి ఈయన స్వంతంగా అనుభవిస్తూ, అభినయిస్తూ పాడి వినిపిస్తూ వుండే సమయంలో నిర్మాతలూ, వారి ఆశ్రితులూ తదితరులూ ఈ పాటను పాడ

బోయే నేపథ్య గాయకులూ — ఈయన పాడేటంత అద్భుతంగానూ పాడి, పాటకి న్యాయం చేకూర్చగలరో లేదో అనే సహజమైన సందేహానికి గురి అవుతూ వుండడం కద్దు. అంతేకాదు. ఒకే సాహిత్యానికి ఈయన రెండుమూడు వరసలు కట్టి, తమ గళమధురిమ జోడించి, చక్కగా మేళవించి, అనర్గళంగా, తీయగా, హాయిగా, పాడి వినిపిస్తూవుంటే, ఏట్యూను కాట్యూనే నచ్చి, దేనిని సెలెక్టు చేసుకోవాలో తెలియక నిర్మాతలు తికమక పడటం కూడా కద్దు. ఇదేమీ అతిశయోక్తికాదు. ఖచ్చితమైన ఉచితోక్తి. సూక్తి.

ఈ సందర్భంలోనే వీరు సంగీతం సమకూర్చిన అనేక చిత్రాలలోని కొన్ని పాటలు జ్ఞాపకం చేసుకుందాం. అన్నీ తలచుకుని వాటిని గురించి చర్చ ప్రారంభిస్తే చాలా టైము పడుతుంది. పెద్ద గ్రంథం అవుతుంది. అన్ని చిత్రాలలో లెక్కలేనన్ని పాటలు సృష్టించారన్నమాట. శ్రీకృష్ణ లీలలూ, ఇల్లాలు, బాలనాగమ్మ (జెమినీది కాదు) మొదలైన చిత్రాల్లో వీరు నటించారు. తన పాటలు తనే పాడుకున్నారు. ఇల్లాలు చిత్రంలో "కావ్యపానముచేసి కైపెక్కినానే" అని వీరు చేతులూపుతూ, మత్తు కలిగించేలా పాడుతుంటే నాకు మాంఛి సరదాగా వుండేది. దానికోసమే నాలుగుసార్లు ఆ ఫిలిం చూశానని జ్ఞాపకం. కాలక్రమేణా సినీమాల్లో నటించడం, పాడడం మానేశారు. ఆమధ్య ఒక తమిళ చిత్రంలో (బహుశా వాళ్కైలే ఒరునాళ్ లేక వాళ్ప్పిరందవళ్ చిత్రంలో అనుకుంటా) నేపథ్యగీతం పాడారు. ఈమధ్య సంగీత దర్శకత్వంమీద మాత్రమే శ్రద్ధ వహిస్తున్నారు.

జెమినీవారి "బాలనాగమ్మ"కి వీరు సంగీతం ఇచ్చారు. అందులోని చాలా పాటలు 'హిట్స్' అయినై. ఆ చిత్రంలో మాయల మరాఠీ-భూత ప్రేతాల్ని పూజించే సన్నివేశంలో వీరిచ్చిన రీరికార్డింగ్ ఎఫెక్ట్స్ తలుచుకుంటే ఇప్పటికికూడా నా గుండెలు ఢామ్మంటూ వుంటాయి. ఆ సమయంలో థియేటర్లో పసిపిల్లలు ఝడుసుకుని ఆరున్నొక్క రాగం అందుకుని ఆలాపిస్తూ వుండేవారు. ప్రతీ చిత్రంలోనూ, రీరికార్డింగ్ విషయంలో తగు శ్రద్ధ వహించి సన్నివేశాలకి తగిన సంగీతం అందించడంలో వీరు సిద్ధహస్తులు.

ఒక జాబితా

చంద్రలేఖ (తమిళం, హిందీ) నిశాన్ అపూర్వసహోదరులు (తెలుగు, అపూర్వసహోదరగళ్ అరవం,) మంగమ్మ శపథం (తెలుగు, తమిళం,) మిస్ మాలిని, చక్రధారి వగైరా జెమినీ చిత్రాలకి సంగీత సారథ్యం వహించారు. అంతకుముందు, ఆ తరువాత వారు సంగీతదర్శకత్వం నెరపిన పలు చిత్రాలలో ఈ క్రిందివి కొన్ని. మిస్సమ్మ (తెలుగు, తమిళం) విప్రనారాయణ, మల్లీశ్వరి, చరణదాసి, (తెలుగు, అరవం) బాలసన్యాసమ్మ కథ, వయారిభామ, మాయాబజార్, అప్పుచేసి పప్పుకూడు, విక్రమాదిత్తన్ (అరవం), అమరదేవి (అరవం), పాసై పిడిత్తవళ్ భాగ్యశాలి (అరవం), ఆడ

పెత్తనం, ఆరాధన, ఆహుతి ఈ చిత్రాలలో నేను పాడలేదు. భలేరాముడు, (తెలుగు), ప్రేమపాశం (తమిళం,) భలే అమ్మాయిలు (తెలుగు,) ఇరుసహోదరిగళ్ (తమిళం,) అల్లావుద్దీన్ అద్భుతదీపం (తెలుగు-తమిళం,) భక్త జయదేవ, చెంచులక్ష్మి, ఆవళ్యార్ (తమిళం,) రాణీ రత్నప్రభ, భీష్మ, ఇద్దరు మిత్రులు, కులగోత్రాలు, చదువుకున్న అమ్మాయిలు మొదలైన చిత్రాలలో నేను పాడాను. కొన్ని ముఖ్యమైన పిక్చర్ల పేర్లు వ్రాయటం నేను మరిచిపోయి వుంటాననుకుంటా.

ఇలా అనేక చిత్రాలకి అద్భుతంగా సంగీత ప్రదానం చేసి, ఆబాల గోపాలాన్ని ఆనందింపజేసి అశేష ఆంధ్రావనిలోనూ, అరవదేశంలోనూ; ఉత్తరాదిలో కూడా అఖండమైన కీర్తి ప్రతిష్ఠల నార్జించారు. సందర్భోచితంగా, కర్ణాటక సంగీతమూ, హిందూస్థానీ బాణీ, స్పానిష్, అరబిక్, హవాయిన్, ఆదిగాగల విదేశీయ సంప్రదాయాలూ ఉపయోగిస్తూ, కాలానుగుణమైన కొత్త కొత్త పోకడలతో రకరకాలట్యూనులు సృష్టించి మనందరికీ వినిపించారు. వినిపిస్తున్నారు. ఇంకా ఇంకా వినిపించబోతున్నారు కూడా.

నాటకీయతలోని రామణీయకత దూరమవకుండా పాతపద్ధతీ పవిత్రతా చెడకుండా కొత్త పంథాలో భవ్యమౌ నవ్య రీతులలో వీరు చెంచులక్ష్మి, భీష్మ చిత్రాలలోని పద్యాలకమర్చిన రాగ ప్రయోగాలు గమనించి చూస్తే, నిత్యనూత్నమైన వీరికల్పనా శక్తిని గ్రహించగలుగుతాము. ఈవిధంగా తనకే సొంతమైన ఒక పద్ధతి (Style) ననుసరించి — పాట వినగానే ఇది రాజేశ్వర్రావు బాణీ అని శ్రోతలు వెంటనే గుర్తుపట్టగలిగే విధాన గీతాలకు సంగీతం సందర్భశుద్ధితో సమకూర్చడం ఈయనకు వెన్నతో పెట్టిన విద్య అనడం అసమంజసం కాదు.
వింటే రాజేశ్వరరావు సంగీతంవినాలి. తింటే బాంబాంహల్వా తినాలి, అని కొంతమంది రసికు లనుకోవడం నేను చెవులారా విని వున్నాను.

అయిదు రాగాలు

రా. రా. గారికీ అయిదురాగాలు పంచప్రాణాలనవచ్చు. 1, భీంపలాస్, 2. సింధుభైరవి, 3. కాఫీ, 4. కళ్యాణి, 5. పహాడీ. వీరి గీతాలలో ఈ రాగచ్ఛాయలు తరుచూ వినవస్తుంటాయి. మిగిలిన రాగాలు వా[illegible] కాదు. సాధారణంగా లలిత సంగీతంలో ఎక్కువగా వాడబడే రాగాలివే. ఇలాటివే. ఈ ముఖ్య రాగాలలో ఒక్కొక్కదానిలో వేలసంఖ్యలో పాటలు తయారవుతూనే వున్నాయి. మనమూ వింటూనేవున్నాము. ఒక పట్టాన బోరుకొట్టని రాగాలివి. మనకి ముఖ్యంగా వున్నవి ఏడుస్వరాలే అయినా ఆ సప్తస్వరాల వింత కలయికల విభిన్న పరివర్తనలవలననే మనకిన్ని రకాల వరుసలు ఒకే రాగంలో అమర్చుకోవడానికి అవకాశాలు లభ్యమౌతున్నాయి. ఇదే సందర్భంలో ఈ విషయంకూడా గమనించాలి మనం. మనం మన మిత్రులతో ముచ్చటించే సమయంలో "ఒరేయ్ ఫలానావాడ ఫలానా హిందీ లేక ఇంగ్లీషు ట్యూన్ కాపీ కొట్టేశాడ్రా" అని అతి తేలికగా మాట

దేసుకుంటూ వుంటాం. కాని సర్వదా ఈ అభిప్రాయం తథ్యం కాదు. ఒకొక్కొక్కప్పుడు ఒకేరాగంలో. ఒకే తాళంలో కూర్చబడే మట్లు.కొన్ని మెట్లవరకూ ఒకేవిధంగా వున్నట్లు అనిపిస్తాయి. నిజంగా కలిసిపోతూ వుంటాయి. బర్మన్ గారు కూర్చిన. కిషోర్ కుమార్ పాడిన "దుఖీమన్ మేరా" అనే గీతంలో "దర్ద్ హమారా" అని ప్రారంభమయే రెండు మూడు పంక్తులదాకా అమరిన ట్యూను. నేనంతకు ముపు కొన్ని సంవత్సరాల క్రితమే వినివున్న ఒకానొక గీతంలోని కొంత భాగంతో యథాతథంగా తాదాత్మ్యం పొంది వుండడం నాకెంతో ఆశ్చర్యం కలిగించింది. నేను ఘంటా పథంగా బల్లగుద్ది (సగం లాయరునిలెండి అంటే లా కోర్సు సగం చదివి వదిలేశాను) చెప్పగలను - బర్మన్ గారు నేను విన్న పాత ట్యూను విని వుండడాని కెంతమాత్రం అవకాశమేలేదని. ఇలా అవ్యాజంగా ఒకరు చేసిన ట్యూన్స్ అనుకోకుండానే మరొకరి ట్యూన్స్‌తో అక్కడక్కడ కలిసిపోవడం సంభవిస్తూ వుంటుంది. అలాటప్పుడుగూడా మనం ఆ ఒకరు మరొకరి పాటను కాపీ కొట్టేశారని అనుకుంటాం. ఆ అనుకోవడం ఒకప్పుడు న్యాయం. మరొక్కప్పుడు అన్యాయం అవుతూ వుంటుంది. కనుక ఒక వ్యక్తి మనఃపూర్వకంగానే మరొకరి మాటనిగాని, పాటనుగాని కాపీ కొట్టారని రుజువుగా మనకి తెలిసే పర్యంతం.ఆవ్యక్తి కాపీ కొట్టారని అనడం దురంతం అని నా సొంత అభిప్రాయం. మీ రేకీభవిస్తే నాకు సంతోషం. అనగా. నా ఉద్దేశ్యం కాపీ కొట్టడం జరగదనికాదు. చాలా అరుదని అంటాను. అంతే. ఎందుకంటే ప్రతికూల పరిస్థితుల ప్రాబల్యానికి లొంగవలసి వస్తే తప్ప. ఏ కళాకారుడూ తానింకొక కళాకారుని కళాసృష్టిని కాపీకొట్టి నట్లనిపించుకోడాని కిష్టపడడు. తాను రూపొందించిన కళ సంపూర్ణంగా తనదే అయి వుండడానికెంతైనా కష్టపడతాడు. సరియైన అవకాశాలు దొరికినప్పుడల్లా తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకోడానికే ప్రయత్నిస్తూ వుంటాడు. తన శక్త్యానుసారం విజయం సాధించగలుగుతాడు.

కొంతమంది మిత్రుల అభిప్రాయం కాపీ సంగీతంకూడా కాఫీలాగే రుచికరం, భోగ్యం అని. ఇంతకీ కాపీ కొట్టడమనేది వ్యక్తుల మనస్తత్వాన్ని బట్టీ, పరిస్థితుల ననుసరించీ జరుగుతూ వుంటుంది. వడకట్టి కాఫీ డికాక్షన్ తయారుచేయడంలో గూడా నేర్పు అవసరం.


దారితప్పి చాలాదూరం వచ్చినట్టున్నాను క్షమించండి. ఏక్సిడెంటు అయేలోపుగా మళ్ళీ దారిలో కొస్తాలెండి.

మరపురాని పాటలు

మల్లీశ్వరిలోని 'మనసున మల్లెలమాలలూగెనే, అనే వెన్నెల వెదజల్లే గేయాన్ని మరవగలమా ? 'ఆకాశవీధిలో'ని అందం "ఔనా నిజమేనా"లోని విరహం, "కోతీబావకు పెళ్ళంట"లోని కొంటెతనం, "ఉరకలు వేయాలి గిత్తలు పరుగులు తీయాలి" లోని ఉల్లాసం. ఉద్రేకం, ఉత్సాహం "ఎందుకే నీకింత తొందర"లోని మందగమనం.గాంభీర్యం. మనందర్నీ ఆకర్షించి. ఏడిపించి. కితకితలు పెట్టి నవ్వించి. కవ్వించి. ఎంతగా మురిపించాయో. మైమరిపించాయో. మరీ మరీ వినాలనిపించాయో మనందరికీ తెలుసు. 'మిస్సమ్మ'లో "బాలనురా మదనా" "బృందావన మది అందరిదీ" "ఏమిటో ఈమాయా" "రావోయి చందమామా" వగైరా అన్ని పాటలూ బ్రహ్మాండమైన హిట్స్ అయ్యాయి. మన మనసును రంజింపచేశాయి. "విప్రనారాయణ" లోని "చూడుమదే చెలియా" "ఎందుకోయీ తోటమాలీ" బహుళ జనాదరణ పొందాయి.

'ఆహుతి'నిలో గీతికలు అనేక తరహా. "ప్రణయమేపోయేనా బలియై." ఊగిసలాడేనయ్యా పడవా" పాటలు మనసే ఊపేశాయి. "భక్తజయదేవ"లో "రాధా మనోరమణా" మొదలైన పాటలూ. అష్టపదులూ మనవి భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. "చెంచులక్ష్మి. భీష్మ"ల సంగీతం శాస్త్రీయంగా ఆహ్లాదం కలిగించింది.

"భలేరాముడు. భలేఅమ్మాయిలు"చిత్రాలు "నరసూ" వారివి. కనుక నేకాబోలు పిటిలోని గీతాలు నరసూ కాఫీలా కమ్మకమ్మగా కుదిరాయి. "ఇద్దరు మిత్రులు. చదువుకున్న అమ్మాయిలు. కులగోత్రాలు" వగైరా సాంఘిక చిత్రాలు కనుక పాశ్చాత్య బాణీలు కూడా కొన్ని మనకు వినిపించాయి. ఉర్రూతలూగించాయి. వీరివద్ద నేను పాడిన పాటలు నాకూ నచ్చాయి. మీకూ నచ్చాయి. "భయమేలా ఓమనసా" "బంగరు బొమ్మా" "అనురాగములొలికే ఈరేయి" "రావేరావే బాలా" "చక్కనిచుక్కా సరసకురావే"



"ఓహో చక్కనిచిన్నది" "ఎక్కడదాచావోయ్ సిపాయీ" "లాటరీలోనా లక్షలు లక్షలు" "మనేసులోని కోరిక" వగైరా పాటలూ, "భీష్మ"లో కృష్ణుడికీ, "చెంచులక్ష్మి"లో నారదుడికీ పాడిన పద్యాలూ అవీ నాకు మంచిపేరు తెచ్చియిచ్చాయి. ఇలా ఒక్కొక్క పాట గురించీ రాసుకుపోతూంటే రామాయణమంత పురాణ గ్రంథమూ రాసేయొచ్చు. కాని చోటు చాలదు.

జోకేశ్వరరావు

ఇక రా. రా. గారి ఓరల్ మరియు ప్రాక్టికల్ జోకులూ, ఛలోక్తులూ, సూక్తులూ కొన్ని ఉదహరిస్తాను. వీరి సంగీతమూ, దాని ప్రాశస్త్యమూ అందరికీ తెలుసు. కాని వీరుచేసే వింతలూ, విశేషాలూ, తమాషాలూ కొందరికే తెలిసుంటాయి. అందరికీ తెలిసుండవు. అందుకే వ్రాస్తున్నాను—

కొద్దిరోజుల క్రితం చెన్నపురి నక్షత్ర ప్రదర్శనశాల అనగా స్టార్ థియేటరులో బిమల్‌రాయ్ "బందినీ" చూసేందుకని నేను నామిత్రుడొకడితో వెళ్ళాను. అక్కడ హైద్రాబాదునుండి వచ్చిన మిత్రునితో కలిసి అదే పిక్చర్ చూడడానికి వచ్చిన శ్రీ రాజేశ్వరరావుగారు కనిపించారు. పిక్చరు ఆరంభించడానికి ఇంకా ఇరవై నిముషా లవుతుందని తెలుసుకొని, నేను మన ప్రస్తుత వ్యాసనాయకునితో "అలా రత్నా కేఫ్ దాకా వెళ్ళి నాలుగు ఇడ్లెన్లు సేవించి వద్దామా సార్ ! ఆ హోటల్ ఇడ్లెనకి స్పెషల్" అన్నాను. దానికాయన మొదట "తిరిగి రావడం ఆలస్యమైపోతే బర్మన్‌గారి టైటిల్ మ్యూజిక్ మిస్‌అయిపోతామేమో మాష్టారూ" అని "తరవాత మిస్ అనంలెండి మనమంతా మిష్టర్ మేగా పదండి" అని జోకారు. మొత్తానికి ఏమయినా సరేనని అందరం హోటలుకేసి దారితీశాం కాలినడకనే. అన్నట్టు మరిచాను మాతో ప్రఖ్యాత హిందీ గేయ రచయితా, కవీ అయిన శ్రీ సరస్వతీకుమార్ దీపక్ కూడా వున్నారు. వారితో మన సాలూరు వారు టూటీ ఫూటీ హిందీలో తమాషాగా ముచ్చటిస్తూనే వున్నారు దారిపొడుగునా. మెల్లిగా హోటలు చేరాం. కడుపునిండా మస్తుగా మజాగా యిడ్లెన్లు కొట్టేశాం. త్రేన్చుకుంటూ తిరిగి థియేటరుకి బయలుదేరాం. కాని ఆయన అన్నట్టుగానే పిక్చరు మొదలై అప్పటికే అయిదారు నిమిషాలయింది. టైటిల్ మ్యూజిక్ మిస్సయ్యారు మా మిష్టర్లంతా. "నావల్లనే ఈ ఆలస్యం అయింది సార్" అని రారాగారితో బాధతోనే బిక్కమొగంపెట్టి, గుటకలు మింగుతో నసిగాను. సారీ సారన్నాను "పోనీయండిసార్. దానికి నష్టపరిహారంగా White Tablets (తెల్లమాత్రలు అంటే ఇడ్లీలు) కమ్మగా భోంచేశాంగా" అని లోలోపల టైటిల్ మ్యూజిక్ మిస్సయ్యామన్న బాధ బాధిస్తున్నా, నేను కూడా బాధపడడం దేనికని నన్నూరడించడం కోసమనే నవ్వు తెచ్చుకుని నవ్వారు. ఇది వారి సున్నితమైన హృదయానికి తార్కాణం.

ఒకరోజు మేం రిహార్సల్సు చేస్తూండగా వీరికీ వీరి అన్నగారైన శ్రీ హనుమంతరావుగారికీ ఒక చిత్ర విచిత్రమైన సంభాషణ జరిగింది. మాటల సందర్భంలో రా.రా.

నౌషాదునీ, నౌషద సంగీతాన్ని తెగ పొగడసాగారు. వీరి అన్నగారు "ఏమిటోయ్ ! నువ్వు చాలా గొప్పవాడివని మన ప్రొడ్యూసర్లు నిన్ను గౌరవించి పిలిపిస్తే నువ్వేమిటీ యిలా ఎవరెవరో నౌషాదు గురించీ, వాళ్ళ గురించీ అంకింపుకున్నావూ" అని సాగదీశారు, తన తమ్ముణ్ణి అక్కడివాళ్ళెక్కడ అపార్థం చేసుకుంటారోనన్న భయంతో. దానికి రా. రా. గారేమన్నారో తెలుసా ! "నౌషాదుగారు గొప్పవాళ్ళన్నాం గాని, మనం కామన్నామా ? ఎవరిగొప్పవారిదే. ఒకరి గొప్పతనాన్ని చెప్పుకున్నందువల్ల తప్పూలేదు. మనం తగ్గిపోము" అన్నారు. (ఈ "మనం"అనేది వారు తరుచూ 'నేను' అనే మాటకి బదులు వాడుతూవుండే మాత పదం. అంతేగాని అది అహంకార సూచకమని మన మనుకోరాదు). ఇదీ వారి సామర్థ్యం. ఎవరేమాట అన్నా, వెంటనే దానికి టంకంపొడిలా అతుక్కునేలాగ జవాబిస్తారు. ఇలాటి వాళ్ళనే హిందీలో 'హాజిర్ జవాబ్ ఆద్మీ' అంటారు.


మౌఖికంగానేకాక, వీరు క్రియాత్మక హాస్య ప్రదర్శనా ప్రియులూ, దక్షులూ కూడా. (Practical Joker). ఒకనాడు వీరి పాటొకటి రిహార్సలు చేస్తున్నాం. రిహార్సలు ముగియగానే దావాఖానీ (ఖూనీ కాదు) లోకి దిగాం. టౌనులో మినర్వా థియేటరులో అప్పుడు పసందైన ఇంగ్లీష్ ఫిలిం ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ "సైకో" ఆడుతూవుంది. అందరం దానికి వెడదామని నిశ్చయించుకున్నాం. రారాగారి కారు ఆరోజుని సర్వీసింగుకనో, మైనర్ ఎడ్జస్ట్‌మెంట్సుకనో వెళ్ళింది. అది తెలిసి నేను వారితో "ఏం సార్ ! అయిదుగంటలకల్లా రెడీగా వుండండి. దారిలో మిమ్మల్ని పికప్ చేసుకోడాని కొస్తాను. కలిసి బీచ్ దారిని చల్లగాలిలో పాట పాడుకుంటూ పయనిద్దాం" అన్నాను. వెంటనే "ఎందుకు సార్, వృథాశ్రమ. మీరూ, మా ఎసిస్టెంట్సూ థియేటరు కెళ్ళిపోండి. నేను చిన్న పనొకటి చూసుకుని తిన్నగా ఆటోరిక్షాలో అక్కడికే వచ్చి కలుసుకుంటాను. ఆరు గంటలకల్లా" అన్నారాయన. "సరే సార్" అన్నానేను. ఆయన మనసులో ఏదైనా ఫలానా విధాన చేయాలనుకున్నారంటే, దాన్ని వ్యతిరేకించి ఎవరెన్ని చెప్పినా ఒక పట్టాన వినరు. విన్నట్టు కనిపిస్తారేతప్ప తననుకున్నట్టే చేస్తారు. అందుకనే నేను మళ్ళీ అడగలేను. అడిగి ప్రయోజనంలేదు.

సరిగా మా (స్వరాలనుకోకండీ ! ఊఁ) అనుకున్న సమయానికే నేనూ, వారి సహాయకులూ మినర్వావద్ద చేరాం. ఆరుగంటలయింది. కాని రావుగారి జాడ దొరకలేదు. ఆరూ అయిదూ, పదీ, పదిహేనూ, ఇరవై ఇరవైఐదు అయింది. ఆట ఆరంభమయ్యే ఆరున్నరకి అయిదు నిమిషాలే వుంటిక. మాకు గాభరా పుట్టింది. కొంపదీసి మా మాటే మరిచిపోయి, మరోచోటి కెక్కడికైనా దయచేశారేమో అని హడిలిపోయాం. ఇంతలో ఆరున్నరైంది. పిక్చర్ ప్రారంభమైపోయింది. మాతో ఆరాటం పోరాటం సాగించసాగింది. అయినా, ఆసనాయన వస్తేనేగాని ఆట చూడకూడదని నిశ్చయించుకున్నాం. అలాగే నిలుచున్నాం.

నిముషమొక యుగంగా, మందంగా, బరువుగా గడిచింది. మర్నాడే ఈ పిక్చరు మారిపోతుంది. రెండో ఆటకైనా వెళదామా అంటే, మాకు మర్నాడుదయాన్నే రికార్డింగు ఫిక్సయింది. అదీగాక అడ్వాన్సు బుకింగు ఫుల్లయిపోయిం దప్పటికే. అప్పటికే రెండో ఆటకి లోయర్ క్లాసుకి పెద్దాపురం వెంతాడంత పొడుగాటి క్యూ నిలబడి వుంది. ఆఖరిరోజున అంతమంది జనం పోగయారా ఫిలిం చూసేందుకు. ఈ ఆటకే మాకు నాలుగు టిక్కెట్లు దొరికేసరికి తల ప్రాణం తోకకి వచ్చేసింది. ఎవరో కేన్సిల్ చేయబట్టి అవైనా దొరికాయి అదృష్టవశాత్తూ. అందుకని మా ఆందోళన మరీ అధికమైంది. అరున్నరల్లా మెల్లిగా ఏడున్నరైంది. మా కళ్ళనిండా కన్నీరైంది. కాని ఇంగ్లీష్ పిక్చర్ కనక ఇంటర్వెల్ తరవాతే ఒరిజినల్ పిక్చరు స్టార్టవుతుందని తెలిసింది. ఇంటర్వెల్ వరకూ, ఆస్ట్రో అడ్వర్టైజ్‌మెంట్లూ అవీ తలనొప్పి పుట్టించి, అడియన్సు పని పట్టించి, "ఆస్ట్రో"కి పని కల్పించి, దాని డిమాండు బాగా పెంచే స్తాయి అని మే మొసుగుదుం. అసలాట (ఒరిజినల్ పిక్చర్) ఆరంభించేలోగా వారు వచ్చినా చాలునని ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురుచూస్తూ నిలుచునే వున్నాం. ఎంతకీ రాకపోయేసరికి నిరాశా పూరిత హృదయారవిందులమై, కళ్ళుండీ కూడా పిక్చర్ చూడలేని అంధులమై, ఇంటిదారి పట్టడానికే నడుం కట్టాం. ఇష్టంలేకుండానే నా చెయ్యి కారు స్విచ్ ఆన్ చేసి, స్టార్ట్ చేసింది. ఇంతలో "ఆటో" శబ్దం వినిపించేసరికి ఎగిరిపోయిన మా ప్రాణాలు తిరిగి వచ్చాయి. ఆటోలోంచి అర్జంటుగా దిగుతూ "సారీ సార్. మీరు నాకోసం ఇంకా కాచుకుని వుంటారేమోననే నేనింత ఆలస్యమైనా వచ్చేశాను. లేకపోతే అసలు రాలేకపోయేవాణ్ణే. అంతపని జరిగింది." అన్నారు మా నవ్వెన్నును క్లెయిమాక్సుకు తెస్తూ. "ఏం జరిగింది సార్" అని నేనూ, "ఎన్న అయిడిచ్చి సార్" అని అరవ సోదరులూ ఒకేసారి ఆరుద్రాగా, సారీ అదుర్దాగా, ఏకగ్రీవంగా శ్రుతికలిపి అడిగేశాం. "ముందు పిక్చర్ చూదాం పదండి సార్" అని సినీమా అయిన పిదప, ఇల్లు చేరేదారిలో తన ఆలస్యానికి గల కారణ వివరణం చేయసాగారు. "ఏం చేయమంటారు సార్! ఎంతకీ "ఆటో" దొరకలేదు. ఆటోకోసం, టాక్సీ వేసుకుని ఊరంతా తిరిగి తిరిగి, వెతికి వెతికి, చివరికి మిమ్మల్ని కలుసుకున్న పది పదహేను నిమిషాల క్రితం ఈ "ఆటో"ని పట్టుకున్నాం. అందుచేతనే అప్పటికైనా రాగలిగాం" అన్నారు.

"పోనీ టాక్సీలోనే వచ్చేయక పోయారా?" అన్నాం. మీకు మాటిచ్చాం గాదా సార్ "ఆటో"లో వస్తామని. మాట నిలబెట్టుకున్నాం" అన్నారు విజయగర్వంతో. మాకు ఏడుపూ నవ్వూ కలిసి వచ్చాయి. ఇదీ వారి వరస.

"ఇద్దరు మిత్రులు" చిత్రంలో పద్మనాభంగారికి నేను పాడిన "చక్కనిచుక్కా సరసకురావే" అనేపాట లోని "ఉక్కిరి బిక్కిరి అయిపోతానే" అన్న పదానికి తగ్గట్టుగా, పల్లవి ట్యూను, గుక్క తిరక్క ఉక్కిరి బిక్కిరయే ఫక్కీలోనే తయారించారు. మీరూ గమనించే వుంటారుగా! ఈ పాట పాడేందుకు నన్ను పిలిచినపుడు— "ఇలాటి ఫస్టుక్లాస్ కామెడీ సాంగ్సు కూడా మీరు పాడాలనీ, ఒక రకమైన పాటలేగాక అన్ని రకాల వివిధ రసాల గీతాలను మీ చేత



పాడించాలనీ-నా ఆశయం, మీరు పాడగలరని నా నమ్మకం." అని చెబుతూ-మరీ ఆ పాట కాగితాన్ని నాచేతికందించారు. అన్నట్టుగానే నా చేతనే ఆ పాట పాడించి హిట్టు చేయించారు. న్యాయానికి, ఆయన నాతో అలా చెప్పవలసిన అగత్యం లేదు కాని ఎదుటివారి మనసులో ఎలాటి భేదాభిప్రాయాలూ ఉద్భవించకుండా రాబోయే ప్రశ్నకి ముందుగానే సమాధానం ఇచ్చేస్తుంటా రీయన.

"రాణీ రత్నప్రభ"లో "అమరాయము విరిసే ఈ రేయి" అనే అమీరు కళ్యాణి రాగంలో రచించిన యుగళ గీతం "డ్యూయెట్" పాడించేముందు నా చేతా, శ్రీమతి సుశీలగారి చేతా బాగా సాధకం చేయించారు. మధ్యలో నే నాలపించవలసిన శాస్త్రీయమైన సంగతులూ, బిరకాలూ బాగా రిహార్సలు చేయించి వుండడంవల్ల టేక్ సమయంలో ఏ అనుమానమూ రాకుండా తేలికగా పాడగలిగాను. ఏపాటకెన్ని రిహార్సల్సు కావాలో ముందే తేల్చుకొని, తేలికైనవాటికి తక్కువ రిహార్సల్సుతోనే తృప్తి పడినా, క్లిష్టమై కష్టతరమైన వాటికి పూర్తి సంతృప్తి కలిగేదాకా రిహార్సల్సు చేయించకుండా వదలరు.

వీరికి వచ్చిన వాయిద్యాలు, హార్మోనియం-పియానో-సితార్-ఫ్లూట్ - ఎలక్ట్రిక్ గిటార్ - మేండొలిన్ - తబలా-డోలక్‌లు. వీరు అభిమానించే పాశ్చాత్య సంగీత దర్శకులు Paramount, విక్టర్‌యంగ్, మేక్స్‌స్టీనర్, 20th century fox ఆల్ ఫ్రెడ్ న్యూమన్, డిమిట్రీటియాంకిన్ మైకేల్స్ రోజా మొదలగువారు. ఇప్పటికీ పాశ్చాత్య శాస్త్రీయ సంగీతాధ్యయనం చేస్తూ వుండడమనేది వీరి కొక హాబీలాంటిది. శాస్త్రీయమై, సరళమై, సులభమై, సులలితమైన సంగీతం అందించడంలో వీరిది అందె

వేసిన చేయి.

"స్వర్గంగ స్వరగంగయై సర్వదా, నవ రసధారావాహినియై స్వర రాజేశ్వరసిత సంగీత సిక్తాసక్త మానస వీధులలో పయనిస్తూ ప్రవహిస్తూ వుంటుందనడం" అతిశయోక్తి అనిపించుకోదు.

"చాటు" గీతాలు


చిన్నప్పటినుంచీ నాకు వీరి ప్రైవేటు రికార్డులంటే మహాయిష్టం. "చల్లగాలిలో యమునా తటిపై శ్యామసుందరుని మురళి" అన్న పాటకి సాటి అదే. బహుశా ఈ పాట వినే శ్యామసుందరుడైన ఆ మురళీలోలుడు తనంత బాగా పాడడం అసంభవమని అనుకుని, ముందే నిశ్చయించుకుని వుంటాడు రాజేశ్వరారావు ఎప్పుడైనా తనని పాడమని అడిగితే చెప్పవలసిన సమాధానాన్ని. అందుకనే అడిగిన తక్షణమే తటపటాయించకుండా జవాబిచ్చాడు. తన వేణుగానాన్ని రాజేశ్వరారావుగారు పై పాటపాడి ఎలాగూ పొగిడేశారు కదా అనే ధైర్యం వుండబట్టే. "నువ్వు పాట పాడు. దానికీడుగా, జోడుగా, నేను వేణు వూదుతాను" అని తెలివిగా బదులు పలికాడు.

ఇంతకీ చెప్పొచ్చే దేమిటంటే, "చల్లగాలిలో" పాటంటే నాకూ ఎంతో ఇష్టం. అంతేకాదు. ఆయన ప్రతీ పాటా నాకు నచ్చేది.

ముఖ్యంగా ఓహో విభావరీ, కోపమేల రాధా. ఆతోటలో నొకటి ఆరాధనాలయము. కలగంటి కలాగంటి కలువారేకులా వంటి కన్నులు గల స్వామి కనిపించెనే. తలుపు తీయునంతలోన. రావోయి చందమామా (సినీమాలోదికాదు). గాలివానలో ఎటకే ఒంటిగా. పొదరింటిలో నుండి పొంచి చూచెదవేలా, హాయిగా పాడుదునా చెలీ, పోయిరావే కోకిలా, ఆనందమేలేదా, పాడుమా కృష్ణా పలుకు తేనెలొలుకు నటుల మున్నగు అన్ని గీతాలూ, భావగేయాలూ. వారు స్వంతంగా పాడినవీ, ఇతరులతో కలిసి పాడినవీ, పరులచే పాడించినవీ కూడా నన్ను పరవశుణ్ణి చేసేసేవి. ఈ పాటలన్నీ నేను చక్కగా నేర్చుకుని కాలేజీ ఫంక్షన్స్‌లోనూ, ఇతర గానసభలలోనూ పాడుతూ వుండేవాడిని. ఆ సమయంలోనే శ్రీ రాజేశ్వరరావుగారు ఏదో సన్మానం సందర్భంలో అని జ్ఞాపకం - కాకినాడకు విచ్చేశారు. ప్రప్రథమంగా నేను వీరిని చూసిందప్పుడే. అప్పటి నా ఆనందం అనిర్వచనీయం. ఆ సందర్భంలో ఆయన రెండుమూడు చోట్ల హార్మోనియం వాయిస్తూ, రాగరంజితంగా, గంధర్వగానం వినిపించి మమ్మల్నందరినీ తన్మయులను చేశారు.

ఆయన పాడిన ప్రతీచోటికీ నేను వెతుక్కుంటూ వెళ్ళాను. విని పరవశించాను. "వీరి సంగీత సారథ్యంలో నాకు కూడా పాడే సదవకాశం లభిస్తే ఎంత బాగుండును" అని ఆశ కలిగింది. ఆ ఆశ మొదటిసారిగా నరసూవారి "భలేరాముడు" చిత్రంలో 'భయమేలా ఓమనసా భగవంతుని లీల' అనే పాటతో నెరవేరింది. ఆయనవద్ద ఆపాట పాడుతూ వున్నప్పుడు నేను పొందిన సంతోషం ఇంతా అంతా కాదు. అనంతం. అది నాకు మాత్రమే విదితం. ఇప్పటికీ వ్యాసంలో కథితం. కాని రాజేశ్వరరావుగారితో పరిచయం నాకీ పాట పాడకపూర్వమే లభించింది.

నేను మద్రాసుకు వచ్చిన క్రొత్తలోనే శ్రీ వీణ రంగారావుతో కలిసి వారి గృహానికి వెళ్ళాను. పాడి వినిపించడానికని. పాడాను. వారు విన్నారు. తల వూపారు. తాళం వేశారు. ఎంతో మెచ్చుకున్నారు. ఏ పాట పాడానో సరిగ్గా స్మృతి పథంలోకి రావడం లేదుగాని "దీదార్" లోని "అసీర్ పంజాయే అహ్‌దే శబాబ్ కర్‌కే ముఝే. కహాఁగయా మేరా బచ్‌పన్ ఖరాబ్ కర్‌కే ముఝే" అనే రఫీ పాట పాడి వుంటానను కుంటా. ఎందుకంటే అదే ఆనాటి, నా అడిషన్ సాంగ్. ఎవరు పాడమన్నా. అదే పాడేవాణ్ణి. ముఖ్యంగా ఎవరైనా సంగీత దర్శకులు నన్ను పాడమన్నప్పుడు, వారు కట్టిన ట్యూనులు నాకు వచ్చినా, వారి కెదురుగా సాధారణంగా పాడేవాణ్ణి కాదు. భయం వల్లనో, మరే కారణంచేతనో వారిపాట వారికే వినిపించాలంటే వణుకొచ్చేది. ఒకవేళ ఆపాటని నేను సరిగా పాడలేకపోతే, "నా పాటని ఎంత చక్కగా ఖూనీ చేశాడ్రా భగవానుడా" అని బాధపడతారేమోనని భయపడేవాడిని. కనుకనే ఎవరు పాడమన్నా వెంటనే నాకు బాగా అలవాటులోవున్న హిందీ పాటలు "దీదార్"లోవో, "బాబుల్"లోవో, అందాజ్, అనోఖేఅదా, బర్సాత్, ఆవారా వగైరా చిత్రాలలోవో పాటలు జంకూ, గొంకూ లేకుండా బింకంగా పాడేస్తూ వుండేవాడిని. నాపాట విని, మెచ్చుకుని రారాగారు, నిర్మొగమాటంగా ఇలా అన్నారు. "శ్రీనివాస్‌గారూ! మీపాట నాకు చాలా నచ్చింది. మైకుకి మీ వాయిస్ చాలా బాగా సూట్ అవుతుంది కాని మన ప్రొడ్యూసర్లు ప్రతీసారీ పాత ఆర్టిస్టులే కావాలంటారు సార్! ఏంజేస్తాం! అయినా ప్రయత్నిస్తాం"




అలా నిజంగానే ప్రయత్నించారు. కొంతకాలం తర్వాత "భలేరాముడు" చిత్రంలో సాధించారు. దానికితోడు ఆ చిత్రంలోని రెండుమూడు పాటలు నావి గూడా హిట్‌సాంగ్స్ అయేసరికి, చిత్రసీమలో నాకు ప్రవేశం దొరకడమేకాక, నా పేరుకూడా స్థిరపడింది. ప్రజలనోటి కలవాటు పడింది. ఈ చిత్రానికి తమిళ వెర్షన్ అయిన "ప్రేమపాశం"లో "అవన్ అల్లాల్ పులిమేతే అణువుం అశైయాదు" పాట అరవదేశంలో కూడా నన్ను ప్రజాప్రియుణ్ణి గావించింది. అయితే "భలే రాముడు" చిత్రానికి పాడుతూండగా చిన్న తమాషా జరిగింది. శ్రీ రేలంగిగారికి ఈయనే "బంగరుబొమ్మా - భలేజోరుగా పదవే పోదాము పైదేశం చూదాము" అనే పాట పాడించారు. రేలంగి వాయిస్‌కి బాగా సూట్ అవాలనే కోరికతో నాకు బాగా రిహార్సల్సిచ్చి, రికార్డింగ్ సమయంలో కూడా దగ్గరుండి మంచి సలహాలు ఇస్తూ, నా గొంతును ప్రత్యేకంగా రికార్డు చేయించారు. దానికితోడుగా నాకు జన్మ సిద్ధమయిన ఇమిటేషన్ గుణం కొంత సహకరించింది. ఇహ

చూసుకోండి మరి! నమ్మండి. నమ్మక పోండి.

మద్రాసు పారగన్ థియేటరులో "భలే రాముడు" ప్రివ్యూ చూస్తూండగా, మధ్యలో నేను పాడిన "బంగారుబొమ్మ" పాట వచ్చింది. రేలంగి అద్భుతంగా అభినయించారు. అభినయించడంతో ఆగక, రేలంగే పాటకూడా పాడేశారేమో ననిపించింది. నిజంగా పాటమధ్యలో ఒక బిరకాసంగతి వచ్చేదాకా నా ప్రాణాలు ప్రాణాలలో లేవు. కొంపదీసి నాకు తెలియకుండానే మళ్ళీ రేలంగి తనే పాడేశారేమో ననిపించింది. మొత్తానికి నేను పాడినదే చిత్రంలో వుందని తెలిసిన తర్వాత మహదానందం అనుభవించాను. నిష్కారణంగా మంచి పాప్యులర్ అయే పాట పోగొట్టుకున్నానేమో అని నేనుపడ్డ భయం తొలగిపోయింది. ప్రివ్యూ అవగానే రారాగారు "శ్రీనివాస్‌గారూ, మీ వాయిస్ రేలంగికి సెంట్ పర్సెంట్ సూటై పోయింది సార్" అన్నారు. కాని రేలంగికి మాత్రమే సూటవుతుంది అనుకుని, ఆయనకు మాత్రమే పాడించాలనే నిర్ణయానికి రాకుండా, రారాగారు మిగతా చాలమంది ఆర్టిస్టులకీ, హీరోలకి గూడా నాచేత పాడించారని మీకూ తెలుసు. ఈ "సూట్" అవడమనేది చాలా విచిత్రమైన విషయం. అది వాటుమీదే ఎక్కువగా ఆధారపడివుంటుంది. అంతే. సర్వసాధారణంగా, ఒక పురుష గాత్రం. మరో పురుష గాత్రంతో సరిపోతుంది. మరీ కీచుగు నేటంత వ్యత్యాసం వుంటేతప్ప. ఆమాటకొస్తే ఒకే వ్యక్తి పాడేటప్పుడూ మాటాడేటప్పుడూ గొంతులో కొంత తేడా అగుపిస్తుంది. కనక న్యాయానికి పురుషుడి గాత్రం మరో పురుషుడి గాత్రానికి సరిపోవాలి. కాని మన అభిప్రాయాలు ఎవరికి కావాలి? ఎవరి అభిప్రాయాలు వారివే! ఒకరు మరొకరితో ఎన్నడూ ఎప్పుడూ ఏకీభవించరు. సర్వదా. సర్వథా, భిన్నాభిప్రాయులవడానికే ప్రయత్నిస్తారు. ఇది మానవ ప్రకృతి. సహజమైన స్వభావం. సరే మళ్ళీ దారికొస్తా. దారితప్పి, తిరిగి దారిలో పడటంగూడా సహజమైన మానవ స్వభావమేగా! "టు ఎర్ ఈజ్ హ్యూమన్"

"భలేరాముడు" తదుపరి "నరసూ" వారి "భలేఅమ్మాయిలు"లో గూడా "నిసరిమపా, లాటరిలోన లక్షలు లక్షలు సాధించావినాడు" అనే పాట, "నాజెమైన సరుకుంది లాహిరి" అనే పాటా పాడాను. ఈరెండు భలే చిత్రాల్లోనూ భలే మంచి పాటలు. భలే బాగా పాడినవి మొదలు, వీరివద్ద చాలా పాటలు పాడాను. అవి ఇదివరకే మీకు తెలిసానుగా! "అమరశిల్పి జక్కన్న" (కన్నడం) "బొబ్బిలియుద్ధం" మొదలైన రాబోయే చిత్రాలలో కూడా పాడాను. భవిష్యత్తులో వీరి పాటలేవేవి పాడగలిగే అవకాశాలు సంభవిస్తాయో, సంప్రాప్తిస్తాయో, మీకూ, నాకూ కూడా తెలియదు. ఆయనకే తెలియదు. సర్వకాల సర్వజ్ఞుడైన సర్వేశ్వరుడొక్కడికే తెలియాలి. ఆ విషయం తత్కాల పరిస్థితులపైన ఆధారపడి వుంటుందన్న విషయం మాత్రం మనందరికీ తెలుసు. ●



చిత్రరథుని చైత్రయాత్ర

అనగా అనగా ఒక సెట్టు

నేటి కథల కాటపట్టు
మేటి సినీ సెట్టు

ఆని భలోక్తి విసిరా దొక ప్రాసాంతక ప్రేక్షకుడు. ఇది పత్రికలవాడి అభిప్రాయం కాదు. వాడి మోహం. నాకు క్లాసోఫ్, క్లాసని గోలపెడతాడు. ఇది వరసగా సినిమాలు చూసే ఒక ఆసామి అన్న మాటన మాట. అతని భాష—బెంగాలీ భాష దీనికి సమ్బంధం లేదు—స్పష్టంగా ఇదే!

తెలుగు సినిమా కథలన్నీ అనగనగా ఒక పెద్ద సెట్టు అంటూ ఆరంభమవుతున్నాయి. పాత్రలన్నీ ఆ సెట్టుచుట్టూ తిరుగుతున్నాయి. ఆ సెట్టుమీద నాగేశ్వరరావు రామారావు లాంటి హై లెవెల్ జగ్గయ్య వుంటారు. సావిత్రి, అంజలి, జమున వుంటారు. లేదా వైస్ వెర్సా. అదీ వరస. సెట్టుమీద ఇనప్పెట్టెలో కొన్ని లక్షల ఆస్తి మూలుగుతూ వుంటుంది. సెట్టుచుట్టూ తిరిగే పాత్రలు. హీరోనో, హీరోయిన్నో పడదోసి సెట్టెక్కాలని చూస్తాయి. కాని, హీరో హీరోయినులు ప్రేమగొడవలో వుంటాయి. మంచి హైక్లాసు డ్రెస్సులు - 1970 ఫాషన్వి—వేసుకుంటాయి.... మన మనుషుల ఫాషన్లకి, వాటికీ అసలు సమంధం లేదు. డ్రెస్సుబట్టి ఈ హీరో, లేక హీరోయిన్ కోటీశ్వరులా అని ఊహించడం బుద్ధి తక్కువ. రిక్షా వాడు, అప్పలమ్మకూడా హైక్లాసు డ్రెస్సుల్లోనే వుంటారు.... ఇలా పోతోందాయన ధోరణి. చాలా బాధపడుతున్నాడు. ఆవేశంలో ఉన్నాడని తెలుస్తూనే వుంది. కాని పాయింటేమిటో అంతు చిక్కలా.

"అయితే ఏమంటారు సార్?" అన్నాం.

"ఆ సెట్టండీ, సెట్టు. ఆ డ్రెస్సులు—అయామ్ గెటింగ్ నెర్వస్. సచ్ లౌడ్, హారిబుల్, వల్గర్ టేస్ట్!.... అంతలా డబ్బు ఓడిపోతున్నట్టు—ప్రపంచంలో సినీకథా వస్తువులు-కాతగ్గ సమస్యలు - కష్టాలు అన్నీ కోటీశ్వరుల చుట్టూనే వున్నట్టా—ఏమిటంట? నా గొడవ, నా కష్టాలు ఎవడూ మాట్లాడేం? నా బాధలు నా ప్రేమ చిత్రించరేం. నామీద జాలిపడరేం? ఆ!" అన్నాడాయన ఉద్రేకంతో.

పక్కనేవున్న ఒక మిత్రుడు అంత ఉద్రేకంతోనూ చిరునవ్వు నవ్వాడు—కాని అది అట్టహాసమని మా వుద్దేశం.

ఈ దేశంలో చాలమంది జనం తినతిండి -కట్టబట్ట-వుండడానికి చక్కని యిల్లు లేక అవస్థపడుతున్నారు సార్ ? మీరు రోజూ చూసేవే పూరిపాకలు -చివికినపెంకుటిళ్ళు- బోడి మేడలూను. మంచిళ్ళు చూడ్డానికి మీరు మొహం వాచున్నారు. మీరు కథలకోసం వస్తున్నారా" అన్నాడాయన.

"నాన్సెన్స్ :" అన్నా డీయన.

"చూడండి, ఇంకొక్కమాట-మేము సినిమాలు చూసేవాళ్ళ కోసం తీస్తున్నాం కాని, తిట్టేవాళ్ళకోసం కాదు" అన్నాడాయన,

"నేను మీకోసమే చెప్తున్నాను. సినిమా కథలు—ఆ రిచ్చి సెట్టును ఖాళీ చేసి— మామూలు మనుషులుండే యిళ్ళకి మారాలి. అప్పుడే అది బాగుపడుతుంది—"

"కథ ఇప్పుడేం చెడిపోయి - బాగు పడ్డానికి."

"నాన్సెన్స్."

"మీ మొహం."

ఈ విధంగా చర్చ—ప్రైవేటు సమాలోచన స్థాయిని అందుకోవడంతో మేము పొడిదగ్గు దగ్గి—బయట ఎవరో పిలిచినట్టయినందువల్ల-అటుకేసి వెళ్ళిపోయాము. (మీకు ఓపిక వుంటే మీరు ఈచర్చను కొనసాగించండి.)



కన్నడ చిత్రాలలో ఉత్తమ నేపథ్య గాయకుడుగా ఎన్నికైన పి. బి. శ్రీనివాస్‌కు మదరాసులో కన్నడ ఫిలిమ్‌ఫాన్స్ సంఘంవారు ఇటీవల ఘన సన్మానం జరిపినప్పటి ఫొటో.

పి. ఎ. పి. వారి "పునర్జన్మ"లో ఒక దృశ్యం



దొరలు—కథలు

ఎంత గొప్ప అవతార పురుషుడు పుట్టినా ఏడవడం, ఉగ్గుతాగడం, నాన్నా తాత, నువ్వు, అయ అనడం, ఏడవడం పదమూడో ఎక్కం రాకపోవడం, అబద్ధాలాడడం ఇవన్నీ తప్పని సరి ఘట్టాలు. ఒక దేశం అభివృద్ధీ అంతే. సబ్బులు తయారీ అంతే. పత్రికలూ అంతే. సినిమాలూ అంతే. హాలీవుడ్-లండన్-రోమ్ - పారిస్ అన్ని కేంద్రాలూ సినిమా ప్రగతిలో అన్ని ఘట్టాలూ దాటాయి. వ్యాపార రీత్యా ఫార్ములా కథలు తీశాయి. నేటికీ తీస్తూనే వున్నాయి. ఒక కొత్తకథ దొరికితే అది చివికి తూట్లు పడేదాకా చాకిరేవు పెడుతూనే వున్నాయి. తిరగేసి మరగేసి తొడుగుతూనే వున్నాయి. వాళ్ళకీ కథల కరువు వచ్చినప్పుడు—పెద్ద సెట్లను కట్టుకు రంగుల హంగులు చేసుకు తిప్పలు పడ్డారు.

ఇప్పుడు వున్న రకాలన్నీ—వాళ్ళ అవధులు, అవకాశాలు నిజానికి మనకన్న ఎన్నోరెట్లు హెచ్చు. వాళ్ళ ప్రేక్షకులు-ఒక్కొక్క రకం చిత్రానికి, పోషించడానికి సరిపడేటంత మంది—అన్ని రకాలూ వున్నారు. అయినా వాళ్ళకీ ఒకరకం కథల కరువు వచ్చిందట. సెక్సు ఫార్ములాలో—సెక్స్ ట్రార్డినరీ కథలు, సెక్సయిటింగ్ కథలు తియ్యడం (వాళ్ళని జటిశాస్త్రిగారు అన్నిటికీ కోప్పడరు) అయిపోయింది. సెక్స్ అంటే స్త్రీ పురుష సంబంధం. (అశ్లీలమ్ప్రతిహతమగుగాక) అనే దోరణిలో వాడడం

జరిగింది. ఇప్పుడు అందుపై రాగల కథలన్నీ అయిపోయినందున కొత్త ఫార్ములాలా పట్టుకున్నారట. బ్రాడ్వే నాటకాలు, టెలివిజన్లు దాకవరకు — సినిమాలలో చాలవరకు ఈ ఫార్ములాలా పాకిందట. వాళ్ళ నవలలలో కథలలో కొంత మనకీ కనిపిస్తూనే వుంది. అదేమిటన్న ప్రశ్నకు జవాబు—చర్చించడం సంభావ్యం కాదు. అయినా అమెరికాలో అగ్రశ్రేణి దినపత్రిక "న్యూయార్క్ టైమ్స్" విమర్శకుడు ఈ కొత్త ధోరణిని విమర్శనచేస్తూ సుదీర్ఘ వ్యాసం వ్రాశాడు.

ఒక్కటే కోరిక.

ఈ కథలను బెంగాలీ వాళ్లెవరూ అనుకరించకుందురుగాక.

వాళ్ళేమన్నా చేస్తే మనవాళ్ళు కొని తీస్తారని భయం—అంతే.

ఛలో హైదరాబాద్

నాగేశ్వరరావు హైదరాబాద్ చైత్ర యాత్ర ఇప్పటికి జైత్ర యాత్రి అనతగ్గ స్థాయిని అందుకుంది.

పి. ఎ. పి. వారు అక్కడ తీసిన "పునర్జన్మ" చిత్రం ఈ నెలాఖరున విడుదల అవుతుంది. జగపతివారి చిత్రం ఆడురీళ్ళు తయారయింది. అన్నపూర్ణావారి చిత్రం, పి. పుల్లయ్యగారి చిత్రం ఈ నెలలోనో, పై నెలలోనో ఆరంభం కాబోతున్నాయి. పని ఉత్సాహంగా, కట్టుదిట్టంగా, సత్ఫలదాయకంగా సాగుతోంది ఇపుడు అక్కడ ఇంకో ఫ్లోరుకూడా వేశారు.

పునర్జన్మ చాలా కొత్తతరహా అనతగ్గ కథతో - కులగోత్రాలు చిత్రంద్వారా అత్యంతాధునిక శిల్పం సాధించి ప్రతిభాశాలి అనిపించుకున్న ప్రత్యగాత్మ సారథ్యాన చాలా బాగా రూపొందిందని రిషెస్ చూసిన వారు చెబుతున్నారు. నాగేశ్వరరావు ఇందులో అపూర్వమైన పాత్ర ధరించాడు. కృష్ణకుమారి, వాసంతి, సూర్యకాంతం, గుమ్మడి, రమణారెడ్డి, పద్మనాభం మొదలయినవారు పాల్గొన్నారు. మాటలు ఆత్రేయ, ప్రత్యగాత్మ వ్రాశారు. నిర్మాత అనుమోలు సుబ్బారావు.

రాబోయే చిత్రాలలో రాజ్యం పిక్చర్స్ వారి "నర్తనశాల", విక్రమ్‌వారి "జల్సారాయుడు", రవీంద్రవారి "లక్షాధికారి", బాబూమూవీస్ "మూగమనసులు".

బందిపోటు

ఆపదలలోనున్న అనాథలను గాచే వాడెవ్వడు ? దిక్కులేని స్త్రీలపాలిటి కల్పవృక్ష మెవ్వడు ? మనోహరణ మోహనుడెవ్వడు ? దేవుడను కుంటారో యేమో, కాదు. రాజలక్ష్మీవారి "బందిపోటు"

కథలో కొత్తదనం తక్కువైనా, ప్రతిభ వున్నవారు ఆ పాత చింతకాయ పచ్చడినే యెంత రుచ్యంగా అందించగలరో ఈ చిత్రం చూస్తే తెలుస్తుంది. ఈ రుచికి చాల మటుకు అభినందించవలసినది నహతా ఆర్థికతాహతును, దూండీ పర్యవేక్షణా సంపత్తిని. వీటికితోడు ఎన్. టి. రామారావు, కృష్ణకుమారి, రేలంగి, గిరిజ, రమణారెడ్డి, ఇ. వి. సరోజ, గుమ్మడి, రాజనాల, నాగయ్య, మిక్కిలినేని, వంగర, రామకోటి, పుష్పవల్లి, మీనాకుమారి ఇత్యాది తారాబలం.



రవీంద్ర ఆర్ట్ పిక్చర్స్ వారి "లక్షాధికారి"లో ఎన్. టి. రామారావు, కృష్ణకుమారి

కథనం మొదట్లో అంతా పరుగెత్తుతుంది నాలుగ్గుర్రాల బండిలో. ఆ వడిలో తప్పొప్పులు తెలియవు. అసలు యిటువంటి కథల్లో అర్థాయితీసి తర్కాన్ని వెతకడం అనర్థమైన కుతర్కం. క్షణక్షణానికి ఆవేశం, ఆహ్లాదం, ఆనందం కలిగించే హంగులు వున్నవా లేవా అని చూడాలి. ఇవి చాలమటుకు పుష్కలంగానే వున్నవని చెప్పవచ్చును. కథమాత్రం అడిగితే కొత్తగా చెప్పేదేమీ లేదు.

రామారావు హీరోదాత్తంగా, ధీరునిగా ఉన్నారు. గొప్పగా నటనా వైదుష్యం ప్రదర్శించడానికి యెక్కడా అవకాశం లేదుమరి. కృష్ణకుమారి తలబిరుసు రాకుమారిగా బుసలు కొట్టింది. కృష్ణ అందంగా వున్నది. కొన్ని దృశ్యాల్లో ముక్కులు పొంగించి ముక్కోపం చూపబోయినప్పుడు అతి ముద్దుగా వుంది. రాజనాల యెప్పటి స్థాయిలోనే గావుకేకలు, కుప్పిగంతులు ఒకోసారి సమయానుకూలంగా, మరొకసారి ప్రతికూలం

గా వేయటం జరిగింది. గుమ్మడీని ఆ పాత్రకు నియమించటం ఇంద్రధనుస్సుని తెచ్చి వంటింటికి రంగులు వేసుకోటం. తమ నటనా పటిమకో పదోవంతు ప్రతిభేనా చూపటానికి అవకాశంలేని పాత్రలను వారెందుకు స్వీకరిస్తారో వారికే తెలియాలి. మీనాకుమారి చిత్రం పాడుగునా చలాకీగా వుంది.

ఘంటసాల సంగీతంలో హిందీ ఛాయలు చాలా కనిపించాయి. చూస్తున్నంతసేపు (వింటున్నంతసేపు) బాగానే వున్నాయనిపించినవి. దాశరథి, సి. నారాయణరెడ్డి, ఆరుద్ర, కొసరాజు వ్రాసిన పాటల్లో ప్రత్యేకత అంతగాలేదు. మహారథి సంభాషణలలో ప్రతి వాక్యంలోను వున్నది. వీరిచే సంభాషణలన్నీ వ్రాయించుకొని ఒక్కపాట, ఒక్కటికూడా వ్రాయించలేదేఅనివారుకూతురు కాపురంలో "వన్నెల చిన్నెల కన్యనురా, నిన్నేవలచిన ధన్యనురా" అన్న పాట వ్రాశారని తెలిసినవారికి విచారం కలుగక మానదు. నగాయిచ్ ఫొటోగ్రఫీ, గాంధి వేషాలంకరణ చెప్పుకోతగ్గ అలంకరణలు.


విఠలాచార్య దర్శకత్వంలో మెచ్చుకోతగ్గవి చక్కగా ఊహించబడిన రకరకాల పోట్లాటలు, కొట్లాటలు.

మంచిరోజులు వస్తాయి

విజయవంతమైన చిత్రంలో నాసిరకం పాటలున్నా ప్రజామోద ముద్ర పొందుతాయి. కాని తెలుగు చిత్రాలలో చక్కని, వట్టి చక్కనికాదు, అతిచక్కని పాటలున్నా, చిత్రం పేలవమైన తరువాత రాణింపుకు రావు. గణన కెక్కవు.

ఆరుద్ర, కోదండపాణి కలసి "మంచి రోజులువస్తాయి"లో యెంత చక్కని పాటలు వ్రాశారో, వరసలు చేశారో విన్నారా? లేకపోతే అందుకోసమైనా ఆ చిత్రం చూడవచ్చును. సుశీల పాడిన "గరిగమపా" అన్న ఓమాదిరి శాస్త్రీయగీతం వింటానికి అద్భుతంగా వున్నది, చిత్రీకరణలో పాడైపోయింది. ఆ తరువాత జమునారాణి "బావ పాట" అందరినీ బావలుగా చేయగల శక్తి గలది. ఎల్లారీశ్వరి "తాలేలో" పాటలో పల్లె పరువాల సొంపువుంది. శ్రీనివాస్ సుశీల, శ్రీనివాస్ జానకి యుగళగీతాలు ప్రేమకు సంగీతంలో పర్యాయ పదాలుగా వున్నాయి. మాధవపెద్ది పద్యాలు నాటక పద్ధతిలో అతి సొగసుగా వున్నాయి. ఒకటేమిటి ప్రతి పాట, ప్రతి పద్యం యెన్నోవిధాలుగా ఆనందం కలుగజేస్తున్నాయి. నేపథ్య సంగీతం అక్కడక్కడా చెవులను బద్దలుచేయ ప్రయత్నించినా దూరాన్నించి వింటానికి బాగానే వుంది. దీనికి కొంతకారణం రికార్డింగ్ తప్పు. పాటల రికార్డింగ్‌లో మోహనసుందరం చేతిచలువ యెంత చల్లగా, మృదువుగా వుందో సంభాషణలలో అంత కటువుగా వుంది. జగ్గయ్య కంఠంలో మాధుర్యమే వినపడటం లేదు.

"బావా బావా" నృత్యం బాగుంది కాని దీనికి కారణం చోప్రా, మాధవన్‌ల ఒడుపు కంటె జమునారాణి కంఠంలోని మడుపే అనిపిస్తుంది. హెచ్.ఎస్. వేణు ఛాయ అతి సుందరంగా ఔట్‌డోర్స్‌లో మరీ నేత్రపర్వంగా వుంది. ముందు చెప్పిన పాట తప్ప తక్కిన పాటలన్నీ బాగా చిత్రీకరించబడ్డాయి.



రాజలక్ష్మీ వారి "బందిపోటు"లో రామారావు, కృష్ణకుమారి

జయలలిత ఒక పల్లె నృత్యం లలితంగా చేసింది. కాంతారావు, రాజనాల, రమణారెడ్డి, రాజశ్రీలలో కొత్తదనం యేమీలేదు. కథలోనే లేనిదది. ఆరుద్ర సంభాషణలు అతనివిగా లేవు. ఈ సినిమాపోస్టర్లు చాలా బాగున్నాయి. మొత్తం మీద ఆరుద్ర, కోదండపాణీలకు పేరు తేవచ్చు.

మహావీర భీమసేన

డబ్బింగ్ చిత్రాలకు మాటలు పాటలు వ్రాయటంలో ఈనాడు అగ్రగణ్యులు అనిసెట్టి. "మహావీర భీమసేన" కలుగజేసే మంచి అభిప్రాయంలో అతనికన్న పాలు మరొకరికి లేదు పేరు "భీమసేన"గాని భారతంలో ఘట్టాలు యెన్నో వున్నాయి కురుక్షేత్రయుద్ధం దాకా. అన్ని సంఘటనలు బాగా తెలిసినవే కనుక వెనుకా ముందులు చెప్పకపోయినా వెలితి కనబడటం జరగలేదు.

మాయాద్యూతం దృశ్యం, కుంతీ కర్ణ సంవాద దృశ్యం కొంచెం విసుగనిపించినవి కాని తక్కినదంతా బిగి సడలకుండానే చెప్పబడింది. నటీనటుల్లో చెప్పుకోదగ్గవారు ఒకనాడు అమ్మాజీగా ప్రవేశించి, కొన్నాళ్లు తెరమరుగై, ఆ తరువాత జయశ్రీగా పునః ప్రవేశించి తిరిగి తెరమరుగై ఈనాడు యిందులో ద్రౌపదిగా మన యెదుట నిలచిన జయశ్రీ. ఈ అమ్మాయిలో యింత అందము, యింత గ్లామరూ, యింత నటనా కౌశలమూ వుండీ కూడా పైకి రాలేదంటే

అది అందరి దురదృష్టము. ఎల్. విజయలక్ష్మి రెండు చక్కని నృత్యాలు చేసింది.

సంగీతం ముఖ్యంగా మోహనలో వున్న "చెలివిన్న పిలచేనులే" అన్న జావళీ బాగున్నది. మాటలు పాటలు అనిసెట్టి రచన బాగుందని ముందే చెప్పుకున్నాము. బాలకృష్ణ ఛాయాగ్రహణం ఉత్తమ పరిమాణంలో వుంది. దర్శకత్వంలో నాటకీయత వున్నది: ఎస్. ఎ. సుబ్బరామన్.

* * *


ఏ. ఎస్సెస్‌వారి "జ్ఞానేశ్వర్" ఆంధ్రలో ఇంకా అక్కడక్కడ పర్యటన చేస్తూనే వుంది. రెండు దశాబ్దాల క్రిందట ప్రభాత్ వారు తీసిన ఈ మరాఠీ చిత్రం ఆనాడెంత ఉత్తమమైనదో ఈనాడు చూస్తే తెలుస్తున్నది. ఆనాటి సహజత్వం ఈనాటి చిత్రాలలో తెలుగు, తమిళ, హిందీ చిత్రాలలో, ఒక్కదానిలో లేదంటే అతిశయోక్తి లేదు. నటనలో, సంభాషణా విధానంలో, ఛాయాగ్రహణంలో, ప్రతి అంగంలో ప్రతి హంగులో సహజత్వం ఉట్టిపడుతుండటం ఈనాడు ఆశ్చర్యం కలిగిస్తుంది.

జ్ఞానేశ్వర్ పాత్రధారి సాహు మోడక్, మరొక ముఖ్య పాత్రధారి సుమతీగుప్త అందరితోబాటు బాగా నటించారు. మల్లాది వారి పాటల రచన, ఆనాటి సంగీతానికి అనుగుణ్యంగా వ్రాయవలసి వచ్చినందున కొంత చిత్రంగా వుంది. కాని వడిగా వున్న భజనలకు వారి మాటలు యెప్పటిలాగానే విశిష్టమైన పదజాలంతో కూడుకొని వున్నవి. ఆనాటి వన్నె చెరగకుండా ఈనాడు సంగీతం సమకూర్చినది వేలూరి కృష్ణమూర్తి. ఎన్. జగన్నాథ్, బి. శివరాంల మాటలు పొందికగా వున్నాయి.

ప్రతి ఒక్కరూ ఒక్కమారైనా చూడవలసిన చిత్రం. చూసి నేటి మన చిత్రాల స్థాయి యెంత వెనుకబడివుందో తెలుసుకోవాలి.

కౌసల్యా వారి "మంచిరోజులు వస్తాయి"లో జగ్గయ్య, జమున




ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ చిత్రం
పునర్జన్మ
నిర్మాత
ఎ.వి.సుబ్బారావు
స్క్రీన్‌ప్లే • దర్శకత్వం
కె.ప్రత్యగాత్మ